ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org


# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 1 | సంచిక 6 జనవరి-మార్చి 2026

మమత-సమత-మానవత
www.gurajada.org

## సబ్ కో సన్మతి దే భగవాన్





# సంపాదక మండలి


**వ్యవస్థాపక సంపాదకులు**
మహాకవి గురజాడ అప్పారావు

**ప్రధాన సంపాదకులు**
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ(USA)

**నిర్వాహక సంపాదకులు**
శ్రీమతి అరుణ గురజాడ (USA)
శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

**విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు**

**కార్యనిర్వాహక సంపాదకులు**
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
*(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)*

**సంపాదక సలహాదారులు**

ఆచార్య, సూర్యా ధనంజయ్
*(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)*

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి
*(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాసి)*

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
*(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)*

డా. వి.ఆర్. రాసాని
*(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)*

**సంపాదకులు**

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
*(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)*

ఆచార్య రాచుగాల్ల రాజేశ్వరమ్మ
*(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)*

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
*(మదురై విశ్వవిద్యాలయం, మదురై)*

**సహ సంపాదకులు**

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

**కథలు, కవితలు, వ్యాసాల విభాగం**

**సంపాదకులు**
డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*



ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

# గాంధీ తత్త్వం: ప్రపంచానికి ఆదర్శమార్గం

భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ చరిత్రలో ఒక అసాధారణ అధ్యాయం. ఆ అధ్యాయానికి నడిచే శక్తి మహాత్మా గాంధీ. ఆయన తత్త్వం, ఆయన జీవనవిధానం, ఆయన రాజకీయదృష్టి — ఇవన్నీ కేవలం భారతదేశాన్ని స్వతంత్ర దేశంగా చేయడానికి మాత్రమే కాక భారత సమాజ పునర్నిర్మాణానికి కూడా ఉపయోగపడ్డాయి. గాంధీని ఒక రాజకీయ నాయకుడిగా మాత్రమే చూడటం ఆయన వారసత్వాన్ని చిన్నబుచ్చినట్లే. ఆయన ఒక సామాజిక సంస్కర్త, ఒక దార్శనికుడు.

నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న సంక్షోభాలు — విభజన, అసహనం, అసత్యం, పర్యావరణ నాశనం, ఆర్థిక, సామాజిక అసమానతలు — గాంధీ కాలంలో ఉన్నవే, కానీ ఇప్పుడు మరింత తీవ్రమైన రూపంలో ఉన్నాయి. సాంకేతిక పురోగతి మన జీవితాలను వేగవంతం చేసింది; కానీ మానవవిలువలను, మానవసంబంధాలను, నెమ్మదిగా కరిగిస్తోంది. ఈ నేపథ్యంలో గాంధీ తత్త్వం ఒక సమాజ పునర్నిర్మాణ పథంగా ఉపయోగపడుతుంది. గాంధీ తత్త్వానికి అహింస, సత్యం, స్వచ్ఛత, స్వావలంబన, సామరస్యం, పర్యావరణం అనే అంశాలు మూలస్తంభాలు.

గాంధీ అహింసను ఒక రాజకీయవ్యూహంగా మాత్రమే కాకుండా, ఒక జీవనవిధానంగా చూశారు. ఆయన దృష్టిలో అహింస అంటే శారీరక హింసను నివారించడం మాత్రమే కాదు; మనసులో ద్వేషాన్ని తగ్గించడం, మాటల్లో మృదుత్వం, ఆలోచనల్లో సహనం, నిత్యజీవితంలో నైతికత. నేటి ప్రపంచంలో అహింస మరింత ప్రాసంగిక అంశం. సామాజిక మాధ్యమాలు మనుషులను దగ్గర చేస్తున్నాయి, కానీ మనసులను దూరం చేస్తున్నాయి. అభిప్రాయ భేదాలు వాదనలుగా

కాకుండా శత్రుత్వానికి దారితీస్తున్నాయి. చిన్న చిన్న సంఘటనలు ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. రాజకీయ సంభాషణలు పరస్పర గౌరవం కోల్పోయి, వ్యక్తిగత దాడులుగా మారుతున్నాయి. అహింస అంటే బలహీనత కాదు; నైతికతతోకూడిన బలం.

ప్రజాస్వామ్యం నిలవాలంటే, ప్రజలు ఒకరినొకరు శత్రువులుగా కాకుండా సహపౌరులుగా చూడాలి. ముఖ్యంగా రాజకీయ పార్టీలు ప్రజాసేవలో సహభాగస్వామ్య ధోరణితో వ్యవహరించడానికి గాంధీ అహింసాతత్త్వం దిక్సూచి కావాలి.

గాంధీకి సత్యం ఒక ఆధ్యాత్మిక సాధన. నేటి కాలంలో సత్యం అరుదైన వస్తువుగా మారింది. నకిలీ వార్తలు వేగంగా వ్యాపిస్తున్నాయి, అర్ధసత్యాలు, అసత్యాలు ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేస్తున్నాయి, రాజకీయ ప్రయోజనాల కోసం నిజం వక్రీకరించబడుతోంది. సామాజిక మాధ్యమాల పుణ్యమా అని నిజం, అబద్ధం, ప్రచారం అన్నీ కలిసిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నిజం కోసం నిలబడే ధైర్యం, నిజం చెప్పే నైతికత, నిజం పాటించే క్రమశిక్షణ సమాజానికి అత్యవసరం.

గాంధీ దృష్టిలో స్వచ్ఛత అంటే కేవలం శుభ్రత కాదు; అంతరంగ స్వచ్ఛత, ఆలోచనల పారదర్శకత, దైనందిన జీవితంలో నైతికత. నేటి కాలంలో రాజకీయ అవినీతి, ప్రజల నిర్లిప్తత వ్యవస్థలు నిర్వీర్యం అవడానికి కారణం అవుతున్నాయి. ప్రజా నిధుల దుర్వినియోగం అభివృద్ధిని అడ్డుకుంటోంది. నైతికతకంటే స్వప్రయోజనం ముఖ్యమవుతోంది. ప్రజాసేవ ఒక సామాజిక బాధ్యతగా కాకుండా, స్వప్రయోజనాలు నెరవేర్చుకోవడానికి ఒక అవకాశంగా మారుతోంది. స్వచ్ఛత ఒక అలవాటు కాదు; అది ఒక సామాజిక బాధ్యత. వ్యక్తి స్వచ్ఛతే వ్యవస్థ స్వచ్ఛతకు పునాది. ఇది గాంధీ తత్త్వసారం. మురికివాడలను శుభ్రపరచడం, అస్పృశ్యతాభావానికి వ్యతిరేకంగా ఉద్యమించడం గాంధీతత్వానికి గాంధీ చూపిన ఆచరణమార్గం. దురదృష్టవశాత్తూ స్వచ్ఛభారత్ ఒక ప్రహసనంగా మొదలయి నినాదంగా ముగిసింది. పరిసరాల పరిశుద్ధత దైనందిన జీవితంలో భాగం కావాలి.

స్వయం ఆధారతకు, స్థానికతకు, సమాన అవకాశాలకు, ఆర్థిక స్వాతంత్ర్యానికి ప్రతీకగా చరఖా వాడారు గాంధీ. ప్రపంచీకరణ మనకు అవకాశాలు ఇచ్చినా చిన్న వ్యాపారాలు ఒత్తిడికి గురవుతున్నాయి. పిన్నీసులు కూడా అమెజాన్‌లో కొనే సంస్కృతి పెరుగుతోండడంతో వీధి చివరి దుకాణాలు వెలవెలబోతున్నాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలహీనపడుతున్నాయి. స్థానిక ఉత్పత్తులు ప్రాపంచిక పోటీకి తలొగ్గుతున్నాయి. వినియోగ సంస్కృతి ఉత్పత్తి సంస్కృతిని మింగేస్తోంది. సమాజం బలపడాలంటే, చిట్టచివరి వ్యక్తి కూడా బలపడాలన్నది గాంధీ ఆలోచన. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభ్యుదయం చేరాలన్న దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ గారి అంత్యోదయ్ (integral humanism) కార్యక్రమ ఆశయం కూడా ఇదే. ఆర్థిక స్వాతంత్ర్యం అంటే గౌరవం, స్వాభిమానం, సమానత్వం. Make in India అనే పిలుపు నినాదంగా మిగిలి చైనా సరుకు భారత అంగళ్లలో విహారంచేయడం చిత్తశుద్ధిలేని ప్రభుత్వ ఆలోచనలకి అద్దం పడుతుంది. ప్రతీ పల్లె స్వయం సమృద్ధిని సాధించే దిశగా రూపొందాలి.

గాంధీ దృష్టిలో భారతదేశం ఒక ఆధ్యాత్మిక భావన, ఉన్నత ఆశయాలకు ఆలంబనగా నిలిచే ఒక సామాజిక ప్రయోగం. సామాజిక, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించే, భిన్నత్వాన్ని ఆలింగనం చేసుకునే ఉన్నత సంస్కృతికి దర్పణం భారతదేశ వ్యక్తిత్వం. నేటి ప్రపంచంలో మత, జాతి, భాష, వర్గ విభేదాలు పెరుగుతున్నాయి. రాజకీయ ప్రయోజనాల కోసం విభజన వాదాలను పెంచి పోషిస్తున్నారు. సామాజిక సామరస్యం సవాళ్లను ఎదుర్కొంటోంది. భిన్నత్వం ఒక సంపదగా కాకుండా, ఒక సమస్యగా చూపబడుతోంది. భావోద్వేగాలను వాడుకుని సమస్యలనుంచి ప్రజల దృష్టిని మరలించే ప్రయత్నాలు చేయడం దేశ సమగ్రతకి భంగం కలిగిస్తుంది. 'సబ్ కో సమ్మతి దే భగవాన్' అనే గాంధీ ప్రార్థన ఈ నాటికీ, ఏనాటికీ భారతదేశానికి ఆదర్శ ప్రార్థన. భిన్నత్వంలో ఏకత్వం ఒక నినాదం కాదు; అది ఒక నిరంతర సాధనతో కూడిన యాత్ర. భారతదేశంలోని భిన్నత్వం దేశానికి బలం. ప్రపంచానికి ఒక అపురూప చిత్రం. సామరస్యంతో కూడిన సమాజ పరిరక్షణ మాత్రమే దేశం గాంధీకి ఇవ్వగల నిజమైన నివాళి.

సరళత, మితవ్యయం, ప్రకృతితో సమన్వయం — ఇవి నేటి పర్యావరణ సంక్షోభానికి ప్రత్యక్ష పరిష్కారాలు. అధిక వినియోగం, వనరుల దుర్వినియోగం, కాలుష్యం, వాతావరణ మార్పులు ఇవన్నీ గాంధీ ముందుగానే ఊహించిన సమస్యలు. ఆయన చెప్పిన మాటలోనే "భూమి ప్రతి మనిషి అవసరాన్ని తీర్చగలదు, కానీ ప్రతి మనిషి లోభాన్ని కాదు." పర్యావరణ సంక్షోభం కేవలం శాస్త్రీయ సమస్య కాదు; అది నైతిక సమస్య. గాంధీ జీవన విధానం ఈ నైతికతను తిరిగి నేర్పుతుంది. పల్లెల అభివృద్ధి పర్యావరణ పరిరక్షణలో భాగం కావాలి. పర్యావరణ పరిరక్షణ అన్ని తరగతులవారికీ పాఠ్యాంశంగా ఉండాలి.

గాంధీ తత్త్వం ప్రపంచానికి ఒక దిశ చూపుతుంది — మనిషి ముందుగా మానవత్వంతో కూడిన మానవుడు కావాలి. గాంధీ బోధించినా, 'దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్' అని గురజాడ ఉద్బోధించినా ఉన్నత ఆదర్శాలు కలిగిన వ్యక్తులున్న సమాజాన్ని ఆకాంక్షిస్తూనే.


ప్రపంచ వ్యాప్తంగా ఎందరో నాయకులకి స్ఫూర్తినిచ్చిన బహుకొద్దిమందిలో గాంధీ ఒకరు. మహాత్మా గాంధీ భారత జాతి వారసత్వ సంపద. ఈ సంపద పరిరక్షణ బాధ్యత దేశ యువత తీసుకోవాలి.

భవదీయుడు

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**

ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

# ముఖచిత్రం




# లోపల

అమరజీవి గాంధీజీ – డా. దార్ల వెంకటేశ్వరరావు ............................ 8

జాతీయోద్యమ నాటకాలు – ఆచార్య . ఎన్. ఈశ్వర రెడ్డి ...................... 10

జాతీయోద్యయమంలో తెలుగుకవులు – డా. యు.రమ్యజ్యోతి............... 18

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్య స్ఫూర్తి
– శ్రీ రావూలపాటి వెంకయ్య ......................................................... 26

ఇక చాలు... – డా. గోపాలకృష్ణ కొవ్వలి ........................................ 47

స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర – మెట్టు రవళి ......... 49

రచయితగా గాంధీజీ– ఒక పరిశీలన – డా. కె.జి. వేణు ...................... 53

బతుకమ్మ పండుగ పాటలు – తెలంగాణ జ్ఞాన పరంపర
– శ్రీ కర్నె మల్లికార్జున్.......................................................... 57

మన తెలుగు – మన హృదయ ధ్వని – యం. గాయత్రి దేవి ............... 66

ఎగరనివ్వరూ – డా. దారల విజయ కుమారి.................................. 68

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

డా. దార్ల వెంకటేశ్వరరావు ✆ 99896 28049

తే.గీ. కత్తి పట్టక, రక్తంబు గలప కుండ
శాంతి మంత్రము తోడనే సమర మొనర్చి
మదము పట్టిన ఆంగ్లుల మదము నణచి
స్వేచ్ఛ నిచ్చెను భారతావనికి నతడు.

తే.గీ. సత్యమేవ జయతేయను సాటి లేని
నిరతమును సత్య శోధన నిత్యమొనర్చి
మహిని నాదర్శమౌను యీ మానవులకు
శాశ్వతంబుగ లోకాన సత్య మూర్తి.

తే.గీ. నూలువడకుచు రాట్నము నోర్పుతోడ
సాధువగుచును జీవన సరణి గడపి
ఖద్ద రనునది గౌరవ కరము లనియె
జగతి కీ దేశ మంత్రము చాటిచెప్పె.

కం. పరమాత్ముడు గాంధీజీ
స్థిరముగ దీక్షను వహించె దేశము కొరకై
వరముగ విభజన వర్గము
ధరలోన విభజన దెచ్చు తగదను చుండెన్!

కం.	నమ్మిన హక్కుల కొరకై
నెమ్మది లేకను తపించె  నిర్మల భీమున్
సమ్మతి గాంధిని గావగ
కమ్మని సంతకము జేసె  కరుణను నింపన్!

కం.	ఉన్నత హక్కుల నెంచక
మన్నన తోడనె మహాత్ము మానము గావన్
కన్నని ప్రేమను జూపుచు
సన్నెగ భీముండు నాడు  సంధిని జేసెన్!

తే.గీ.	కులము భేదము లేదని కొలువు జేసి
మనుజ సేవేయె మాధవ మతము ననియె
అణచివేతను మాసిక నంతమొంద
బాట జూపెను గాంధీజి భరత భూమి.

తే.గీ.	నేడు తలచెడి వీరుల నిశ్చలతను
దేశ భక్త శిఖామణి దీప్తి గనగ
అసువు బాసియు నమరుడై యవని వెలిగె
భారతమ్మకు నిత్య నీరాజనముగ.

తే.గీ.	భారతమ్మకు ముద్దుల బిడ్డ డగుచు
బాపు యనగను భాసిలె భువిని నతడు
శాంతి మార్గమే మనకెల్ల శరణ మయ్యె
ధరణి పైనను సత్యము దార్ల మాట.

పరిశోధనావ్యాసం

# తెలుగులో జాతీయోద్యమ నాటకాలు

ఆచార్య . ఎన్. ఈశ్వర రెడ్డి
✆ 94901 92228

**ఉద్దేశ్యం:** భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తెలుగు నాటకం ప్రజల్లో జాతీయ చైతన్యాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించింది. అక్షరాస్యత లేని సామాన్య ప్రజల వరకు దేశభక్తి, స్వరాజ్య భావనలు చేరవేయడంలో నాటకం ఒక ప్రభావవంతమైన మాధ్యమంగా నిలిచింది. తెలుగు జాతీయోద్యమ నాటకాల నేపథ్యం, లక్షణాలు, ముఖ్య నాటకాలు, వాటి సామాజిక, రాజకీయ ప్రాధాన్యతను విశ్లేషించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

## పరిచయం

1885లో జాతీయ కాంగ్రెస్ స్థాపించిన తర్వాత రాజకీయ నాయకులు, మేధావులు, రచయితలు ప్రజల్లో చైతన్యం కలిగించడానికి కంకణం కట్టుకున్నారు. సంఘసంస్కరణ ప్రాతిపదికగా ప్రారంభమైన పునరుజ్జీవనం రాజకీయ స్పృహతో ఉంటూ జాతీయ ఉద్యమంగా మార్పు చెందింది. ఆంధ్ర దేశంలో కందుకూరి వీరేశలింగంతో ప్రారంభమైన సంస్కరణ దృష్టి గురజాడ మీదుగా అనేకమంది రచయితల మస్తిష్కాలలో చేరిపోయింది.

1905 నుంచి 1947 వరకూ కొనసాగిన భారత జాతీయోద్యమం తెలుగు సాహిత్యాన్ని, ముఖ్యంగా నాటక సాహిత్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేసింది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడంలో కవిత్వంతో పాటు నాటకం కూడా ముఖ్య ఆయుధంగా మారింది. చారిత్రక, పౌరాణిక కథల రూపంలో స్వాతంత్ర్య సందేశాన్ని సంకేతాత్మకంగా అందించిన నాటకాలు ఈ కాలంలో విస్తృతంగా వెలువడ్డాయి.

భారత స్వాతంత్ర్య సమరంలో తెలుగు నాటకాలు ప్రముఖ పాత్ర పోషించాయి. 19వ శతాబ్దం చివరలో ప్రారంభమై 20వ శతాబ్దం మధ్యకాలం వరకు సాగిన ఈ నాటక రచనలు జాతీయ భావన, దేశభక్తి, సామాజిక జాగృతిని ప్రజలలో నూరి పోశాయి. గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం సామాజిక దురాచారాలపై తీవ్రమైన విమర్శ చేసిన నాటకం. ఇది జాతీయోద్యమానికి పరోక్షంగా బలాన్నిచ్చింది. సామాజిక సంస్కరణ లేకుండా రాజకీయ స్వాతంత్ర్యం అసంపూర్ణమనే భావనకు ఇది పునాదులేసింది.

**పౌరాణిక నాటకాలు పురాణ గాథల ద్వారా పరోక్షంగా బ్రిటీష్ వారిని 'రాక్షసులు'గా, భారతీయులను 'దేవతలు'గా చిత్రించాయి.**

జాతీయోద్యమ నాటకాలు కింది లక్ష్యాలతో బయటికి వచ్చాయి.

1. దేశభక్తి ప్రచారం: ప్రజల్లో దేశ భక్తిని రేకెత్తించడం, స్వాతంత్ర్య పోరాటంలోకి తీసుకురావడం,

2. సామాజిక సమస్యలు: జాతి వివక్ష, స్త్రీ విద్య, అస్పృశ్యత నిర్మూలన

3. చారిత్రక సంఘటనలు: బెంగాల్ విభజన, జలియన్ వాలాబాగ్ హత్యాకాండ, సాయుధ పోరాటాలు, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణ

4. నాయకుల ప్రశంస: జాతీయ నాయకుల జీవితాలు, త్యాగాలు

### జాతీయోద్యమ నాటకాల లక్షణాలు

దేశభక్తి ప్రధాన భావంగా ఉండటం, చారిత్రక, పౌరాణిక ఇతివృత్తాల వినియోగం, సంకేతాత్మకంగా బ్రిటిష్ పాలనపై విమర్శ, ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాష, జాతీయ ఉద్యమ నాటకాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజించవచ్చు. పౌరాణిక నాటకాలు పురాణ గాథల ద్వారా పరోక్షంగా బ్రిటీష్ వారిని 'రాక్షసులు'గా, భారతీయులను 'దేవతలు'గా చిత్రించాయి. చారిత్రక నాటకాలు మన దేశ వీరుల చరిత్రను గుర్తు చేస్తూ పౌరుషాన్ని

రగిలించాయి. సామాజిక/రాజకీయ నాటకాలు గాంధీజీ సిద్ధాంతాలు, మద్యపాన నిషేధం, అంటరానితనం వంటి అంశాలపై నేరుగా యుద్ధం ప్రకటించాయి. బ్రిటిష్ ప్రభుత్వం నాటకాలను నియంత్రించేందుకు నాటక నిషేధ చట్టాలను అమలు చేసినప్పటికీ, రచయితలు సంకేతాత్మక మార్గాల్లో జాతీయ భావనను వ్యక్తపరిచారు.

బొబ్బిలి యుద్ధం పేరుతో 1908 శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన నాటకం విషాదాంత నాటకం పరోక్షంగా జాతీయ భావనను రేకెత్తించింది.

ప్రారంభ దశలో నాటకాలు ప్రధానంగా సామాజిక సమస్యలపై దృష్టి సారించినప్పటికీ, బ్రిటిష్ వ్యతిరేక భావనలు మెల్లమెల్లగా ఊపందుకున్నాయి. రచయితలు సామాజిక పునరుజ్జీవనం ద్వారా జాతీయతను పెంపొందించే ప్రయత్నాలు చేశారు. స్వాతంత్ర్యోద్యమ దశలో నాటకాలు ప్రత్యక్షంగా స్వాతంత్ర్య సమర విషయాలను చేపట్టాయి. మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి నాయకుల జీవితాలు, సంఘటనలు నాటకీయ రూపం పొందాయి.

### ముఖ్య జాతీయోద్యమ నాటకాలు

బొబ్బిలి యుద్ధం పేరుతో 1908 శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన నాటకం విషాదాంత నాటకం పరోక్షంగా జాతీయ భావనను రేకెత్తించింది. ఇదే పేరుతో వేదం వేంకటరాయ శాస్త్రి రాయగా, బొబ్బిలి ముట్టడి పేరుతో సోమరాజు రామానుజ రావు,ప్రచండ బొబ్బిలి పేరుతో బి. శేషగిరి రావు, నాటకాలు రాశారు. వీరత్వం, స్వాభిమానం ప్రధాన ఇతివృత్తాలుగా రూపొందిన ఈ నాటకం ప్రజల్లో దేశ గౌరవ భావనను రగిలించింది. పరాధీనతకు లొంగని భారతీయ స్వభావాన్ని ఇవి ప్రతిబింబింబించాయి.

వందేమాతరం పేరుతో వేదం వెంకటరాయశాస్త్రి రాసిన నాటకం జాతీయోద్యమ స్ఫూర్తిని నేరుగా ప్రతిబింబించిన రచన. 'వందేమాతరం' అనే నినాదం ద్వారా దేశాన్ని తల్లిగా భావించే భావజాలాన్ని ప్రజల్లో నాటింది. యువతను ఉద్యమ మార్గంలో నడిపించాలనే ఆశయం ఈ నాటకంలో స్పష్టంగా కనిపిస్తుంది. ప్రజలను నేరుగా జాతీయోద్యమ వేదిక మీదకు

తీసుకువచ్చింది. ప్రజానాటకంగా విస్తృత ప్రచారం పొందింది.

వేదం వెంకటరాయశాస్త్రి రాసిన ప్రతాపరుద్రయం నాటకం కాకతీయ రాజైన ప్రతాపరుద్రుని జీవితకథ ఆధారంగా రూపొందింది. ఈ నాటకం చారిత్రక నేపథ్యంతో వచ్చినా, జాతీయ భావనను ప్రతిపాదించింది. విదేశీ దండయాత్రలకు ఎదురొడ్డి నిలిచిన రాజు పాత్ర ద్వారా స్వాభిమానం, దేశరక్షణ భావనలు ప్రతీకాత్మకంగా వ్యక్తమవుతాయి. సుల్తానులను బ్రిటిష్ వారికి ప్రతీకలుగా చేసి విమర్శించడమే గాక, ఓటమిలోనూ ఆత్మ గౌరవాన్ని కాపాడుకున్న రాజు పాత్ర తెలుగువారిలో పౌరుషాన్ని రేకెత్తించింది.

**పౌరాణిక నాటక కర్తలు పరోక్షంగా జాతీయ భావన పెంపొందించడానికి ప్రయత్నించారు.**

చారిత్రక నాటకాల ద్వారా జాతీయ భావనను నింపిన నాటకాలలో ద్రోణం రాజు సీతారామారావు పల్నాటి వీరచరిత్ర, కొర్లపాటి శ్రీరామ మూర్తి పలనాటి వీరచరిత్ర, మదిరా సూర్యనారాయణమూర్తి ఆంధ్రశ్రీ, ఉన్నవ లక్ష్మీ నారాయణ నాయకురాలు, గుర్రం చెన్నారెడ్డి బ్రహ్మనాయుడు, ఇచ్ఛాపురపు యజ్ఞ నారాయణ రసపుత్ర విజయం, పసుమర్తి యజ్ఞ నారాయణ నందనార్ చరిత్ర, గుండు చంద్ర మౌళి దేశింగురాజు చరిత్ర ఆకెళ్ళ సత్యనారాయణ పీష్వా నారాయణ రావు వధ ఉన్నాయి. జాతీయోద్యమ స్పృహతో సుమారు నూట నలభై చారిత్రక నాటకాలు వచ్చినట్టు నాటక విజ్ఞాన సర్వస్వం ద్వారా తెలుస్తోంది.

పౌరాణిక నాటక కర్తలు పరోక్షంగా జాతీయ భావన పెంపొందించడానికి ప్రయత్నించారు. బుద్ధవరపు పట్టాభిరామయ్య రాసిన మాతృ దాస్య విమోచన నాటకంలో వినతను భారతమాతగా, సర్పాలను తెల్లవారుగా చిత్రించడం ఇందులో విశేషం. సంపూర్ణ మహాభారతం పేరుతో కె. సుబ్రహ్మణ్య శాస్త్రి రాసిన నాటకంలో ఆంగ్లేయుల పాలన వల్ల బాధలు అనుభవిస్తున్న భారతీయుల దుస్థితి కనిపిస్తుంది. ఈయనే రాసిన ద్రౌపది వస్త్రాపహరణంలో భారత స్వాతంత్ర్యం అపహరించబడిందన్న ఆవేదన కనిపిస్తుంది.

భరతమాత కడుపున పుట్టిన వాడు స్వేచ్ఛా స్వాతంత్ర్య భావనలు కలిగి ఉండాలని సోమరాజు రామానుజ రావు పద్మవ్యూహం నాటకంలో ప్రబోధిస్తాడు. పద్మవ్యూహంలో మరణించిన అభిమన్యుని శౌర్య పరాక్రమాలను కొనియాడుతూ, అలాంటి వీరులు భరతమాత దాస్య విముక్తికి అవసరమని అభిమన్యుని రథ సారథి సుమిత్రుడి నోటితో చెప్పిస్తాడు. ఈయనే రాసిన స్వరాజ్య రథం స్వరాజ్య రక్షణ కోసం ప్రతి ఒక్కరూ త్యాగానికి సిద్ధపడాలని ప్రబోధిస్తుంది.

స్త్రీలు కూడా పురుషులతో సమానంగా జాతీయోద్యమంలో పాలుపంచుకోవాలని కోరుకున్న నాటక కర్తలు అందుకు అనుగుణమైన నాటకాలు రాశారు.

పద్మవ్యూహం పేరుతోనే కాళ్ళకూరి నారాయణరావు రాసిన నాటకం గీతోపదేశం ద్వారా దేశభక్తి బోధ, భారతీయుల ఆత్మగౌరవం, జాతి గౌరవం, పరాధీనత కంటే మరణమే శ్రేయస్కరం అనే భావన, హిందువులకు మానహాని కలగకూడదనే ఆలోచన రేకెత్తిస్తుంది. మక్కపాటి వేంకటరత్నం రాసిన ద్రౌపదీ మాన సంరక్షణ దాస్యంలోని హీనత్వాన్ని, స్వేచ్ఛలోని సంతోషాన్నిఎత్తి చూపింది. “రాజాదరమునకు భంగము గలుగు గదాయని కూలికి విషము ద్రావకుడు.... రాజాదరము శాశ్వతమని తలచుటకన్న మౌఢ్యము లేదు. తుచ్ఛమగు రాజసన్మానము నపేక్షించి యాత్మగౌరవములు వీడి భరత భూమికి భారము గాకుడు... దేశద్రోహులు గాకుడు. ఇట్టి యధర్మ ప్రవర్తకుడగు రాజును బహిష్కరించిన గాని దేశక్షేమము కలుగనేరదు. దుష్ట పాలనాంతానికై, భారతీయ జాతి జాగృతికై సంస్కృతీ సంప్రదాయాల నిల్పడానికై పలికిన స్వార్థపరత్వమును వీడి, కులగౌరవ దేశ గౌరవము బునరుద్ధరింప ముందంజ వైచిన మహాత్ముని నిన్ను దేవతలు రక్షింతురుగాక” అనే మాటలు ఈ నాటకంలో అశ్వత్థామ చెప్తాడు.

స్త్రీలు కూడా పురుషులతో సమానంగా జాతీయోద్యమంలో పాలుపంచుకోవాలని కోరుకున్న నాటక కర్తలు అందుకు అనుగుణమైన నాటకాలు రాశారు. తిరుపతి వేంకటకవులు పాండవ జననంలో స్త్రీ ప్రాధాన్యతను నొక్కి చెప్పారు. ధర్మవరం కృష్ణమాచార్యులు ప్రమీలార్జునీయం,

ధర్మవరం గోపాలాచార్యులు సుభద్రార్జునీయం నాటకాలు స్త్రీ శక్తిని విశదపరిచి, స్త్రీలు ఎందులోనూ పురుషులకు తీసిపోరని నిరూపించి స్త్రీలలో చైతన్యాన్ని నింపాయి.

దామరాజు పుండరీకాక్షుడు రాసిన సంఘసమస్య / సంస్కారిణి, కలియుగ భారతం, స్వరాజ్య సోపానం నాటకాలలో కులభేద నిరసన, జాతీయోద్యమ రాజకీయ సంఘటనలు, గాంధీజీ నాయకత్వం, ప్రభుత్వ వ్యతిరేక ధోరణి మొదలైన అంశాలు ఉన్నాయి.

కొప్పరపు సుబ్బారావు రోషనార నాటకం బహుళ ప్రచారం పొందింది, ప్రభుత్వ నిషేధానికి గురైంది.

సంపూర్ణ భారతం నాటకంలో స్వాతంత్ర్య రాజ్య స్థాపన, దాస్యానికి వ్యతిరేకంగా తెగువ, పాశుపతాస్త్రం కోరడంలో స్వాతంత్ర్య సాధించడానికి భారత కథను ప్రేరణగా మలిచాడు దౌల్తాబాద్ గోపాల కృష్ణారావు.

భారత దేశం స్వీయ ఆస్తిత్వంతో వెలగాలని కోరుకున్న మరాఠీ నాయకుడు ఛత్రపతి శివాజీ. ఆయన ఎంతోమంది నాటకకర్తలకు కథానాయకుడయ్యాడు. ఒక శివాజీ మీదే పదుల సంఖ్యలో నాటకాలు వచ్చాయి అంటే శివాజీ మీద తెలుగు వారికున్న గౌరవాన్ని మనం అర్థం చేసుకోవచ్చు. శివాజీ ధైర్యం, ధర్మనిబద్ధత, సామాజిక సంస్కరణ, అస్పృశ్యత నిర్మూలన మొదలైన అంశాల నేపథ్యంలో నాటకాలు జాతీయ భావనను రగిలించాయి. శివాజీ పై వచ్చిన కొన్ని నాటకాలలో ధర్మవరం కృష్ణమాచార్యులు రాసిన ఛత్రపతి శివాజీ. చక్రావధానుల మాణిక్యశర్మ రాసిన మహారాష్ట్ర విజయం, కేతువరపు రామకృష్ణశాస్త్రిరాసిన శివాజీ విజయం, కేశవభట్ల సుదర్శన వేణుగోపాలమూర్తి రాసిన శివాజీ , ఊటుకూరి సత్యనారాయణ రాసిన ఛత్రపతి శివాజీ. నందూరి కృష్ణమాచార్యులు రాసియన్ ఛత్రపతి శివాజీ నాటకాలు ఉన్నాయి. ఈ నాటకాల్లో భారతీయుల వీరత్వం, విదేశీ పాలనపై నిరసన, ధర్మపాలన ప్రధాన వస్తువులు. కొప్పరపు సుబ్బారావు రోషనార నాటకం బహుళ ప్రచారం పొందింది, ప్రభుత్వ నిషేధానికి గురైంది.

## గాంధేయ సిద్ధాంత ఆధారిత నాటకాలు

తిరుపతి వెంకట కవులు రాసిన పాండవోద్యోగంలో ధర్మరాజు గురించి శ్రీకృష్ణుడు చెప్పిన "అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడు అలిగిన నాడు..." విషయం ద్వారా ధర్మరాజును గాంధీజీకి అన్వయించాడని, అవి జరగబోయే పరిణామాలకు రూపు కట్టించాయని విమర్శకులు అంటున్నారు.

ఎ. నీలకంఠ శాస్త్రి హరిజనుడు, ఓరుగంటి కృష్ణకౌండిన్య నందనారు చరితం, తాండ్ర సుబ్రహ్మణ్యం పతితపావన, వడ్డాది సుబ్బారావు గాంధీ మహారాజు, మునిమాణిక్య నరసింహారావు తిరుగుబాటు నాటకాలలో గాంధీ సిద్ధాంతాలు, లక్ష్యాలు, హరిజనోద్ధరణ, అస్పృశ్య నివారణ, సామాజిక న్యాయం, ప్రభుత్వ నిషేధాలు వాటి పర్యవసానాలు మొదలైన సమస్యలు కనిపిస్తాయి. సామాన్య ప్రజల దగ్గరకి స్వాతంత్ర్య ఉద్యమ అవసరాన్ని నాటకాలు నొక్కిచెప్పాయి. గాంధీ జీవితం, సిద్ధాంతాల ప్రభావాన్ని చిత్రించి, నీతి విషయాలు, చారిత్రక సంఘటనలు నాటకాల రూపంలో ప్రస్తుతించబడటం వలన అక్షరాస్యత లేని వారికి కూడా అర్థమయ్యాయి.

రాజకీయ చైతన్యంతో వచ్చిన నాటకాలు బ్రిటిష్ వ్యతిరేకతను ప్రజలలో పెంపొందించాయి. స్వదేశీ ఉద్యమం, ఖాదీ ప్రచారం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి సంఘటనలను ప్రజల్లోకి చేరవేయడంలో నాటకాలు ప్రధాన వాహకాలుగా పనిచేశాయి. దామరాజు పుండరీకాక్షుడు రాసిన నవయుగారంభం గాంధీజీ నిర్ణయించిన అహింసా సిద్ధాంతాన్నిప్రచారం చేయడమే గాక పన్నుల సమస్య, సహాయ నిరాకరణ, హిందూ ముస్లిం సఖ్యతలను అద్భుతంగా ప్రచారంలోకి తెచ్చింది. ఈయనే రాసిన పాంచాల పరాభవం పంజాబ్ దురంతాలను స్పష్టంగా చిత్రించింది. ఇందులో డయ్యరు దుర్యోధనుడుగా, పంజాబు పాంచాల మాతగా, గాంధీజీ శ్రీకృష్ణుడిగా, మోతిలాల్, షౌకత్ అలీ, లాలాలజపతి రాయ్, చిత్తరంజన్ దాస్, మహ్మద్ అలీ పాండవులుగా కనిపిస్తారు. గాంధీ 'నామం మరువాం మరువాం సిద్ధము జైలుకు వెళదాం వెళదాం...'అనే ప్రసిద్ధ గేయం ఈ నాటకంలో ఉండడం కొసమెరుపు. మంగళ పాండ్యా వీరోచిత పోరాటం నేపథ్యంగా మద్దూరి అన్నపూర్ణయ్య రాసిన చిచ్చర పిడుగు,ముద్దా విశ్వనాథం రాసిన జన్మభూమి నాటకాలు వీరత్వాన్ని, పౌరుషాన్ని నింపాయి. శ్రీపాద కృష్ణమూర్తి రాసిన గాంధీ విజయధ్వజం,తిలకు

మహారాజు, సీతారామయ్య రాసిన స్వరాజ్య ధ్వజం, సత్య దుర్గేశ్వర కవుల శాంతి సమరం మొదలైన నాటకాలు జాతీయోద్యమాన్ని, స్వాతంత్ర కాంక్షను బలంగా ప్రచారం చేశాయి. నాటకాల్లోని పద్యాలు, 'మాకొద్దీ తెల్ల దొరతనము...','వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడో చూపుడీ...', 'రండు స్వారాజ్య రథము లాగ' ..., 'మేలుకొనుమీ భరత పుత్రుడ...' వంటి జాతీయోద్యమ గీతాలు నాటకాల ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యాయి.

**బ్రిటీష్ ఆంక్షలు:** నాటకాల ప్రభావం తెలిసిన బ్రిటీష్ ప్రభుత్వం 'డ్రామాటిక్ పర్ఫార్మెన్స్ యాక్ట్ (1876)' ను అమలుచేసి అనేక నాటకాలను నిషేధించింది. అయినప్పటికీ, ప్రదర్శనలు రహస్యంగా సాగుతూనే ఉండేవి.

**ముగింపు:** తెలుగు జాతీయ ఉద్యమ నాటకాలు కేవలం సాహిత్య ప్రక్రియలు మాత్రమే కావు, అవి స్వాతంత్ర్య సమరంలో అజేయమైన శస్త్రాలు. ప్రజలను నిద్రలేపి, కర్తవ్యోన్ముఖులను చేయడంలో నాటకకర్తలు చూపిన చొరవ అద్వితీయం. అవి భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజల్ని మానసికంగా సిద్ధం చేసిన శక్తివంతమైన సాధనాలు. సాహిత్యం సమాజ మార్పుకు ఎలా ఉపకరిస్తుందో ఈ నాటకాలు స్పష్టంగా నిరూపించాయి. జాతీయోద్యమ చైతన్యాన్ని రేకెత్తించడంలో, సామాజిక మార్పును తీసుకురావడంలో గణనీయమైన పాత్ర పోషించాయి. తెలుగు నాటకాలు జాతీయోద్యమానికి చైతన్యదీపాలుగా నిలిచాయి. పురాణ కథలు, చారిత్రక వీరులు, సమకాలీన రాజకీయాలు కలసి ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాయి.

★★★★★★★★★★★★★★★★★★

**సూచన గ్రంథాలు** (References)

1. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం – తెలుగు విశ్వవిద్యాలయం.
2. కొర్లపాటి శ్రీరామమూర్తి, తెలుగు నాటక వికాసం.
3. నాటక విజ్ఞాన సర్వస్వం సంపుటం–8; పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
4. గురజాడ అప్పారావు, గురజాడ రచనలు.
5. ప్రసిద్ధ తెలుగు నాటకాలు సంపాదకులు; వల్లూరి శివప్రసాద్

పరిశోధనావ్యాసం

# జాతీయోద్యమంలో తెలుగుకవులు

డా. యు.రమ్యజ్యోతి
83093 79541

విశ్వశ్రేయః కావ్యం అన్నది ఆలంకారికోక్తి... కావ్యం లేదా సాహిత్యం ఎప్పుడూ సమాజశ్రేయస్సునునే కాంక్షిస్తుంది. సాహిత్యకారులు తమ సమకాలీన సమాజ స్థితిగతులకు, పరిణామాలకు స్పందిస్తారు, తమ స్పందనను వారి రచనల్లో ప్రతిఫలింపచేస్తుంటారు. ఆనాటి భారతదేశాన్ని సంఘటితం చేసిన భారత జాతీయోద్యమాన్ని గూర్చి కూడా భారతీయకవులు స్పందించారు, తమ వాడికలాలను ఝుళిపించారు. పరాయిపాలనలో మగ్గుతూ స్వేచ్ఛావాయువుల కోసం అలమటిస్తున్న భారతీయులకు ఒకవైపు ఫ్రెంచ్ విప్లవం, మరొకవైపు పత్రికలు, సాహిత్యం వెలుగురేఖలై మార్గదర్శనం చేశాయి. వ్యక్తికి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఎంత అవసరమో తెలియజెప్పాయి. బ్రిటీషువారి అకృత్యాలను, అన్యాయాలను, దోపిడీ మనస్తత్వాన్ని ప్రజల ముందు ఉంచి, స్వరాజ్యకాంక్షను వారిలో జ్వలింపచేశాయి. ఆంగ్లేయుల పదఘట్టనల క్రింద నలిగిపోతున్న భారతీయుల్లో దేశభక్తిని నింపి, ప్రజలను ఉద్యమోన్ముఖుల్ని చేయటానికి ఎంతోమంది కవులు రచయితలు ప్రయత్నించారు. తెలుగుకవులు అందుకు మినహాయింపు కాదు. ఆంగ్లేయపాలనను నిరసిస్తూ, దేశనాయకుల త్యాగాలను ప్రశంసిస్తూ, భారతీయుల్లో ముఖ్యంగా ఆంధ్రుల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని రగిలించే ప్రయత్నం చేసారు తెలుగుకవులు. ఒకవైపు సాంప్రదాయబద్ధమైన పద్యకావ్యాలు, శతకాలు, దండకాల రూపంలో మరొకవైపు గేయాలు, కవితలు వంటి ఆధునిక ప్రక్రియారూపాల్లో భారతీయుల్లో దేశాభిమానాన్ని పెంపొందించి, స్వరాజ్యసమరంలో మరింత ఉత్సాహంగా పాల్గొనే ప్రేరణనిచ్చాయి.

తెలుగుకవులలో జాతీయోద్యమ కవిత్వానికి ఆద్యుడిగా పేరొందిన కవి చిలకమర్తి లక్ష్మీనరసింహం. బ్రిటీషువారు భారతదేశంపైన పూర్తి ఆధిపత్యాన్ని చేజిక్కించుకోవాలనే ఉద్దేశ్యంతో, విభజించు, పాలించు అనే

సూత్రాన్ని పాటించి 1905 లో బెంగాల్ రాష్ట్రాన్ని రెండుగా విభజించారు. ఈ సంఘటన భారతీయుల్లో ఆగ్రహజ్వాలలను రగిలించింది. ఈ విభజనకు వ్యతిరేకంగా భారతీయులను సంఘటితపరచాలనే ఉద్దేశ్యంతో ఎంతోమంది స్వాతంత్రోద్యమ నాయకులు దేశవ్యాప్తంగా పర్యటనలు చేసారు. వారిలో బిపిన్ చంద్రపాల్ ఒకరు. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో విశాఖపట్నం, రాజమండ్రి, మచిలీపట్నం, నెల్లూరు తదితర ప్రాంతాల్లో పర్యటిస్తూ బ్రిటీషువారి దమనకాండలను భారతీయులకు వివరించి, వారిలో జాతీయోద్యమకాంక్షను రేకెత్తించే లక్ష్యంతో ఉపన్యసించాడు.



రాజమహేంద్రవరంలో వారి ఉపన్యాసాలకు అనువాదకులుగా ఉన్న చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు బిపిన్ చంద్రపాల్ గారి ఉపన్యాసం విని , జాతీయభావోద్రిక్తులై ఆశువుగా

“భరతఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి”

అనే పద్యాన్ని ఆలపించారు. అప్పటికే బ్రిటీషు వారి దమనకాండపట్ల వ్యతిరేకతతో ఉన్న భారతీయుల కోపాగ్నికి ఈ పద్యం ఆజ్యం పోసిందనే చెప్పాలి. ఇదే తెలుగులో స్వాతంత్రోద్యమానికి సంబంధించిన తొలి తెలుగురచన అని డా.సి.నారాయణరెడ్డి గారు ‘ఆధునికాంధ్రకవిత్వము – సంప్రదాయములు: ప్రయోగములు’ అనే గ్రంథంలో పేర్కొన్నారు. పాడియావులాంటి భారతదేశాన్ని గొల్లవారి వంటి బ్రిటీషువారు కొల్లగొట్టి దోచుకుంటున్నారని, భారతీయులు లేగదూడల్లా దోపిడీకి గురౌతున్నారని ఉపమానాలతో ఆంధ్రుల గుండెల్లో స్వాతంత్రోద్యమ పోరాట కాంక్షను రగిలించాడు.1907లో బ్రిటీషు ప్రభుత్వం లాలాలజపతిరాయ్‌ను నిర్బంధించిన సందర్భంలో “చెరసాలల్ పృథు చంద్రశాలలేయగున్” అంటూ జాతీయాభిమానం ఉన్న భారతీయుడికి చెరసాల కూడా చంద్రశాలలతో సమానమని అభివర్ణించారు చిలకమర్తివారు. సాహిత్యాన్ని సాధనంగా చేసుకుని ఆంగ్లప్రభుత్వాన్ని విమర్శించిన మొట్టమొదటి తెలుగు కవి చిలకమర్తివారే.




స్వాతంత్రోద్యమంలో పారతంత్ర్య నిరసన, భరతమాత ప్రస్తుతి, స్వాతంత్రోద్యమ నాయకుల త్యాగాల వర్ణన, స్వాతంత్రోద్యమ ఘట్టాల చిత్రణ, సంఘసంస్కరణ వంటి అనేక పాయల్లో తెలుగు జాతీయోద్యమ సాహిత్యం ప్రవహించింది. ముఖ్యంగా భరతమాతను కీర్తిస్తూ కవులు కవితలు, గేయాలు రాశారు. కవులు తమ రచనల ద్వారా ఒకవైపు బ్రిటీషువారి పరిపాలనపట్ల ప్రజల్లో వ్యతిరేకభావాన్ని కలిగిస్తూనే, మరోవైపు భరతమాత పట్ల ఆరాధనాభావాన్ని కలిగించే రచనలు చేసారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, 'జయజయజయ ప్రియభారత జనయిత్రి దివ్యధాత్రి' అంటూ కీర్తించారు.

జన్మభూమి అనే గేయంలో
ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగబలమో,
జనియించినాడవీస్వర్గఖండమున;
ఏమంచిపూవులన్ప్రేమించినావొ,
నిను మోచె ఈ తల్లి కనకగర్భమున"



అంటూ భారతీయుడిగా గర్వించమని పలికాడు రాయప్రోలు వారు.


అంతేకాక,
"శ్రీలు పొంగిన జీవ గడ్డయి
పాలు పారిన భాగ్య సీమయి
వ్రాలినది యీ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా!" అనే గేయాన్ని రాసి భరతమాతకు, జన్మ భూమికి నివాళులు అర్పించాడు.



గురజాడ అప్పారావు
"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా!" అనే గేయం ఆనాటి యువతకు కంఠోపాఠం అయిందని చెప్పటంలో అతిశయోక్తి లేదు.




గరిమెళ్ళ సత్యనారాయణ
"మా కొద్దీ తెల్లదొరతనము దేవ!
మా ప్రాణాలపై పొంచి – మానాలు హరియించే"
అనే గేయం తెలుగువారిని ఉద్యమోన్ముఖుల్ని చేసింది.



గురజాడ రాఘవశర్మ
జండా యెత్తర – జాతికి ముక్తిర,

త్రిపురనేని రామస్వామి చౌదరి
"వీరగంధము దెచ్చినారము –
వీరుడెవ్వరో తెల్పుడి,



మంగిపూడి వెంకటశర్మ రాసిన
"మేలుకొనుమీ భారతపుత్రుడ
మేలుకొనుమీ సుజన చరితుడ,

వడ్డాది సీతారామాంజనేయకవి
"దండాలు దండాలు మా భరతమాత
అవి అందుకుని దీవించు భరతమాత"



వేములపల్లి శ్రీకృష్ణ –
"చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడ,
గతమెంతో ఘనకీర్తి కలవోడ,

శంకరంబాడి సుందరాచారి,
"మా తెలుగుతల్లికి మల్లెపూదండ"

మొదలైన గేయాలు మాతృభూమి ఔన్నత్యాన్ని చాటాయి, ఆనాటి తెలుగుజాతిని జాగృతపరచాయి.

స్వాతంత్రోద్యమ నేపథ్యంలో కవిత్వాలు, గేయాలే కాక అనేక కావ్యాలు కూడా విరివిగా వచ్చాయి. గడియారం వెంకటశేషశాస్త్రి, 'శివభారతం', దుర్భాక రాజశేఖర శతావధాని, 'రాణా ప్రతాపసింహ చరిత్ర', విశ్వనాథ సత్యనారాయణ, 'ఝూన్సీరాణి', కొడాలి సుబ్బారావు, 'హంపిక్షేత్రం'వంటి రచనలద్వారా పూర్వ భారతీయవీరుల దేశభక్తిని ఆనాటి స్వాతంత్రోద్యమ వీరులకు తెలియచెప్పే ప్రయత్నం చేశారు.

భరతమాతను, భారతభూమిని ప్రస్తుతించినట్లుగానే, ఆంధ్రమాతను, తెలుగుజాతి చరిత్రను, ఆంధ్రవైభవాన్ని కూడా కొనియాడుతూ తెలుగుకవులు కవిత్వాలు, కావ్యాలు రాసారు. వీరిలో ముందుగా చెప్పుకోవాల్సిన వారు రాయప్రోలు సుబ్బారావు గారు.

ఆయన ప్రబోధం అనే ఖండికలో,
"అమరావతీ పట్టణమున బౌద్ధులు విశ్వ
విద్యాలయములు స్థాపించునాడు
ఓరుగల్లున వీరలాంఛనముగా
బలుశస్త్రశాలలు నిలుపునాడు" అని ఆంధ్రాభిమానాన్ని ప్రకటించాడు.



తుమ్మల సీతారామమూర్తి చౌదరి
"ఆంధ్రుడవై జన్మించితి
వాంధ్రుడవై యనుభవింపు మీ యుర్విభవం
బాంధ్రుడవై మరణింపు మి
ఆంధ్రత్వము లేని బ్రతుకు నాశింపకుమీ!"
అంటూ రాష్ట్రాభిమానంతో పలికాడు.

విశ్వనాథ సత్యనారాయణ, 'ఆంధ్రప్రశస్తి', మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి, 'ఆంధ్రపురాణం', పుట్టపర్తి నారాయణాచార్యులు, 'పెనుగొండ లక్ష్మి', మొదలైన కావ్యాలు స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో రాయబడిన రచనలే.

స్వాతంత్రోద్యమ రథసారథ్యాన్ని స్వీకరించిన నాయకుల చరిత్రలను మన కవులు వేనోళ్ల కీర్తించడం జాతీయోద్యమ కవిత్వంలో ప్రముఖంగా కనిపించే అంశం. మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి ఉద్యమనాయకుల్ని ప్రధానంగా చిత్రించే ప్రయత్నం చేసారు ఆనాటి కవులు.

మహాత్ముని ఆస్థానకవిగా పేరుగాంచిన తెలుగులెంక తుమ్మల సీతారామమూర్తి చౌదరి 'మహాత్మా కథ' అనే స్వతంత్ర కావ్యంలో

"పలికెడిది గాంధీకథ యట
పలికించెడివారు తెనుగు ప్రజలట దీనిం
బలికిన నూరట యౌనట
పలికెద నికనొండు మరచి బాపు చరిత్రన్" అని ప్రస్తుతించాడు.

"గాంధీయుగమున పుట్టితి, గాంధీ నడుపు
ఉద్యమంబుల నలగితినొపినంత
గాంధీని వీక్షించితిని, గాంధీ కవిత వ్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు" అంటూ గాంధీపట్ల తనకు గల అపార భక్తిని, అభిమానాన్ని చాటుకున్నాడు.



బసవరాజు అప్పారావు
"కొల్లాయిగట్టితేనేమీ
మా గాంధీ
కోమటై పుట్టితేనేమీ
వెన్నపూసా మనసు

కన్నతల్లీ ప్రేమ" అనే కవితలో గాంధీ యొక్క నిరాడంబరతను, అతని దేశభక్తిని చిత్రించాడు.



దామరాజు పుండరీకాక్షుడు
"శ్రీగాంధి నామం మరువాం మరువాం
సిద్ధము జైలుకు వెరువాం వెరువాం" అనే గేయం ఆనాడు గ్రామీణుల నాలుకల మీద నాట్యమాడింది.

ఇంకా మునగపాటి విశ్వనాథశాస్త్రి 'గాంధీదేవుడు', మరిగంటి శేషాచార్యులు రాసిన 'గాంధీ భారతము', దోమా వెంకటస్వామి గుప్త రాసిన 'మహాత్మాగాంధీ' శతకము కూడా మహాత్ముడిని నాయకునిగా అభివర్ణించే రచనలే. దేశంలోని వజ్రాలసంపదను ఒకవైపు, గాంధీజీని ఒకవైపు తూకం వేస్తే గాంధీజీనే ఎక్కువ బరువు తూగుతాడని, "గోచిపాత గట్టుకొని జాతి మానంబు నిలిపిన

ఖదరు నేతగాడు" అంటూ జాషువా గాంధీజీని కీర్తించాడు. అంతేగాక మహాత్ముని "భార్యాబిడ్డలున్న దైవంగా" కీర్తించాడు. గాంధీతోనే హరిజనోద్ధర సాధ్యమంటూ "నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును గాల్చి వేయుననుచు, రాట్నమును దుడ్డుకఱ్ఱ కరానబూని దెసల దొౌతెంచే గుజరాతు ముసలి శెట్టి" గాంధీజీని హరిజనోద్యమ సారథిగా, జాతీయోద్యమ రథసారథిగా అభివర్ణించాడు.

తెలుగులో జాతీయోద్యమ కవిత్వం అనేక రూపాల్లో కనిపిస్తుంది. అందులో అంతరానితనం నిర్మూలన కూడా ఒకటి. గాంధీజీ కంటే ముందే అంటరానితనాన్ని, అస్పృశ్యతను నిరసించిన కవులు తెలుగులో అనేకం కనిపిస్తారు. 1909లో వచ్చిన మాలవాండ్ర పాటలో

"అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి

అందారు ఒక్కటై ఉండాలి సక్కంగ" అంటూ ఆనాడే భారతీయుల ఐక్యతే బ్రిటీషువారి పాలనను ఎదిరించే ఆయుధమని, వర్ణవివక్ష లేని సమాజాన్ని ఆశించాడు కవి.

మంగిపూడి వెంకటశర్మ, 'నిరుద్ధభారతం'లో

"పరతంత్రత బహు హేయము

నరకమువలె భరతమాత! న్యాయసమేతా" అంటూ పరతంత్రతను నిరసించాడు.

మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి

"అంటరానివారెవరంటే మా వెంటరానివారే" అంటూ వర్ణవివక్షను వ్యతిరేకించాడు.

వెంకట పార్వతీశ్వర కవులు అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ,

"మమత తప్పిన యాతడు మాలగాక

మాట తప్పిన యాతడు మాలగాక

అన్నమును పున్నెమెరుగని యట్టి మాల

మాలయె! దేవుమెడ పూలమాల గాక!" అంటూ "పంచమాభివందనం" చేశారు.

కాటూరి వేంకటేశ్వర రావు నిమ్న వర్గాల వారికి కూడా దేవాలయ ప్రవేశ అర్హత ఉండాలని సమర్థిస్తూ, 'గుడిగంటలు' కావ్యాన్ని రాసారు.

ఇవేకాక జాతీయోద్యమంలో మద్యపాన నిషేధం, విదేశీ వస్తుబహిష్కరణ, స్వదేశీ వస్తువినియోగం, తెలంగాణా విముక్తి కూడా అంతర్భాగాలుగా కొనసాగాయి. స్వతంత్రోద్యమాన్ని జన సామాన్యానికి దగ్గర చేసింది కవుల, రచయితల సమూహమే. స్వాతంత్రోద్యమ వికాసానికి సాహిత్యం నిర్వహించిన కృషి అనిర్వచనీయం. బ్రిటీషు వారి పరిపాలనకు, వారి సామ్రాజ్యవాద తత్వానికి అడ్డుకట్ట వేయాలని, మాతృభూమి దాస్యశృంఖలాలను తెంపి, భారతీయులకు స్వేచ్ఛావాయువులను ప్రసాదించాలనే లక్ష్యంతో ప్రారంభమయిన తెలుగు కవిత్వం, ఆ లక్ష్యాన్ని నెరవేర్చింది అని చెప్పటంలో ఎటువంటి సందేహం లేదు.

## ఆధార గ్రంథాలు


1. తెలుగులో జాతీయోద్యమకవిత్వం – డా. మద్దూరి సుబ్బారెడ్డి
2. తెలుగు ఉద్యమ గీతాలు – ఆచార్య ఎస్వీ సత్యనారాయణ
3. తెలుగులో కవితోద్యమాలు – తెలుగు అకాడెమీ ప్రచురణలు
4. ఆధునికాంధ్రకవిత్వము – సంప్రదాయములు:ప్రయోగములు – డా. సి.నారాయణ రెడ్డి

సమగ్ర పరిశోధనావ్యాసం

# భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్య స్ఫూర్తి

శ్రీ రావూలపాటి వెంకయ్య
75699 34928

భారత స్వాతంత్ర్యోద్యమం కేవలం రాజకీయ సంఘటనల పరంపర మాత్రమే కాదు; అది ఒక విశాలమైన సాంస్కృతిక, మేధోపరమైన ఉద్యమం కూడా. ఈ ఉద్యమంలో తెలుగుసాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేయడంలో, జాతీయ భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో, వలసపాలనకు వ్యతిరేకంగా సామూహిక నిరసనను నిర్మించడంలో అత్యంత కీలకపాత్ర పోషించింది. బ్రిటిష్ పాలన కాలంలో రాజకీయ అణచివేత, ఆర్థికదోపిడీ, సామాజిక అసమానతలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో, తెలుగుకవులు, రచయితలు, నాటకకారులు తమ సాహిత్యాన్ని ప్రజా ఉద్యమానికి ఒక ఆయుధంగా మలిచారు. కవిత్వం భావోద్వేగాలను ఉత్తేజపరిచే శక్తిని కలిగి ఉండగా, గద్యరచనలు ఉద్యమానికి తార్కిక పునాదిని అందించాయి. ప్రజల్లో రాజకీయ అవగాహనను పెంపొందించాయి. నాటకాలు, వీధినాటకాలు, ప్రజాగీతాలు అక్షరాస్యత లేని వర్గాలకు కూడా స్వాతంత్ర్య సందేశాన్ని చేరవేశాయి. గాంధీయ సిద్ధాంతాలు, స్వదేశీ ఉద్యమం, అహింసామార్గం, సామాజిక సంస్కరణల ఆలోచనలు తెలుగుసాహిత్యంలో విస్తృతంగా ప్రతిబింబించాయి [నాగేశ్వరరావు, 1994, పుట. 61-68]. ఈ వ్యాసం భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్యం పోషించిన పాత్రను చారిత్రక, సామాజిక మరియు సాహిత్య పరంగా విశ్లేషిస్తుంది. ప్రత్యేకంగా కవిత్వం, గద్యరచనలు, నాటకాలు మరియు విప్లవాత్మక సాహిత్యం ప్రజాచైతన్యాన్ని ఎలా నిర్మించాయో ఈ అధ్యయనం వివరిస్తుంది. తెలుగుసాహిత్యం ఉద్యమానికి ప్రతిబింబంగా మాత్రమే కాకుండా, ఉద్యమాన్ని ముందుకు నడిపించిన శక్తిగా ఎలా పనిచేసిందో నిరూపించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన ఉద్దేశ్యం.

ముఖ్యపదాలు (Keywords): తెలుగుసాహిత్యం; భారత స్వాతంత్ర్య ఉద్యమం; జాతీయచైతన్యం; దేశభక్తి కవిత్వం; సాహిత్యం; సామాజిక సంస్కరణలు

> **స్వాతంత్ర్యోద్యమానికి ముందు తెలుగుసాహిత్యం ప్రధానంగా భక్తి, పురాణ, ఇతిహాస మరియు కావ్య సంప్రదాయాల చుట్టూ ఉండేది.**

## 1. పరిచయం (Introduction)

భారత స్వాతంత్ర్యోద్యమం (1857–1947) అనేది రాజకీయ పోరాటంతో పాటు సాంస్కృతిక పునరుజ్జీవనానికి కూడా వేదికైంది. వలసపాలన భారతసమాజాన్ని రాజకీయంగా మాత్రమే కాకుండా, మానసికంగా కూడా బానిసత్వంలోకి నెట్టింది. ఈ పరిస్థితిలో సాహిత్యం ప్రజల ఆలోచనాప్రపంచాన్ని మార్చే సాధనంగా మారింది. ప్రాంతీయభాషల సాహిత్యం, ముఖ్యంగా తెలుగుసాహిత్యం, జాతీయోద్యమ భావజాలాన్ని ప్రజలజీవితాలకు దగ్గర చేసింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 101–106]. తెలుగు అక్షరాస్యత పరిమితంగా ఉన్నప్పటికీ, కవిత్వం, పాటలు, నాటకాలు ప్రజల్లో వేగంగా వ్యాప్తి చెందాయి. సాహిత్యం ద్వారా జాతీయ చైతన్యం నిర్మించబడింది. ఈ నేపథ్యంలో తెలుగుసాహిత్యం స్వాతంత్ర్యోద్యమానికి మేధోపరమైన ఆధారంగా ఎలా నిలిచిందో అర్థం చేసుకోవడం అత్యంత అవసరం.

## 2. స్వాతంత్ర్యోద్యమానికి ముందు తెలుగు సాహిత్య నేపథ్యం

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్యం కీలకపాత్ర పోషించడానికి ముందే, దానికి ఒక దీర్ఘమైన సాంస్కృతిక మరియు మేధోపరమైన నేపథ్యం ఏర్పడింది. స్వాతంత్ర్యోద్యమానికి ముందు తెలుగుసాహిత్యం ప్రధానంగా భక్తి, పురాణ, ఇతిహాస మరియు కావ్య సంప్రదాయాల చుట్టూ ఉండేది. మధ్యయుగ కాలం నుండి 19వ శతాబ్దం వరకు తెలుగుసాహిత్యం మతపరమైన భావజాలాన్ని, ధార్మిక ఆచరణలను, నైతికవిలువలను ప్రతిపాదించే సాధనంగా పనిచేసింది. పోతన, అన్నమయ్య, త్యాగరాజు వంటి కవుల సాహిత్యం ప్రజల ఆధ్యాత్మికజీవనాన్ని ప్రభావితం చేసినప్పటికీ, ప్రత్యక్ష రాజకీయ చైతన్యాన్ని నిర్మించడంలో పరిమితపాత్రనే

పోషించింది. అయితే 19వ శతాబ్దం రెండవార్థంలో తెలుగు సమాజంలో చోటు చేసుకున్న సామాజిక, ఆర్థిక మరియు మేధోపరమైన మార్పులు సాహిత్యస్వరూపాన్ని క్రమంగా మార్చాయి. వలసపాలనతో పాటు పాశ్చాత్యవిద్య ప్రవేశం తెలుగుసమాజంలో ఆధునిక ఆలోచనలకు ద్వారాలు తెరిచింది. మిషనరీ పాఠశాలలు, ప్రభుత్వ విద్యాసంస్థలు, ముద్రణ సాంకేతికత వృద్ధి కారణంగా కొత్త విద్యావంతుల వర్గం ఏర్పడింది. ఈ వర్గం సంప్రదాయ సాహిత్యానికి భిన్నంగా సామాజిక వాస్తవాలను ప్రశ్నించే దృక్పథాన్ని అభివృద్ధి చేసింది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 33–40].

> **సంస్కర్తలు, మేధావులు సాహిత్యాన్ని సామాజిక మార్పుకు ఒక సాధనంగా భావించారు.**

ఈ కాలంలో తెలుగుసాహిత్యంలో వ్యాసాలు, కథలు, నాటకాలు వంటి కొత్త సాహిత్య రూపాలు పుట్టుకొచ్చాయి. ఇవి కేవలం వినోదం కోసం కాకుండా, సామాజిక సమస్యలను చర్చించడానికి ఉపయోగించబడ్డాయి. బాల్య వివాహాలు, కుల వివక్ష, మహిళల అణచివేత, మూఢనమ్మకాలు వంటి అంశాలు సాహిత్యచర్చకు కేంద్రబిందువులయ్యాయి. ఈ పరిణామం తెలుగు సాహిత్యాన్ని ఆధ్యాత్మిక – కావ్య పరిమితుల నుండి సామాజికవిమర్శ దిశగా మలిచింది. అదే సమయంలో వేదాంతం, హేతువాదం, మానవతావాదం వంటి ఆలోచనాధోరణులు తెలుగుమేధావుల్లో చర్చకు వచ్చాయి. సంప్రదాయ విశ్వాసాలను ప్రశ్నించే తర్కబద్ధమైన దృష్టికోణం సాహిత్యంలోకి ప్రవేశించింది. ఈ వేదాంత – హేతువాద చర్చలు వ్యక్తి స్వేచ్ఛ, మానవ గౌరవం, సమానత్వం వంటి భావనలను బలపరిచాయి [నాగేశ్వరరావు, 1994, పుట. 41–46]. ఇవే భావనలు తరువాత కాలంలో జాతీయ ఉద్యమ ఆలోచనలకు బలమైన మేధోపరమైన పునాదిగా మారాయి. సామాజిక సంస్కరణ ఉద్యమాలు కూడా తెలుగు సాహిత్యదిశను ప్రభావితం చేశాయి. సంస్కర్తలు, మేధావులు సాహిత్యాన్ని సామాజిక మార్పుకు ఒక సాధనంగా భావించారు. సాహిత్యం ప్రజలను చైతన్యవంతులను చేయగలదన్న భావన ఈ దశలోనే బలపడింది. ఇది స్వాతంత్ర్య ఉద్యమానికి ముందు తెలుగు సాహిత్యం రాజకీయంగా స్పష్టమైన దిశను స్వీకరించడానికి

దోహదపడింది. ఈ విధంగా, స్వాతంత్ర్య ఉద్యమానికి ముందు తెలుగుసాహిత్యం ఒక మార్పు దశలో నిలిచింది. భక్తి మరియు పురాణ సంప్రదాయాల నుండి ఆధునిక సామాజిక మేధోపరమైన దిశకు సాగిన ఈ పరిణామం, తరువాత కాలంలో స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం వికసించడానికి అనుకూల వాతావరణాన్ని సృష్టించింది. కాబట్టి, స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తెలుగుసాహిత్యం పోషించిన క్రియాశీల పాత్రను అర్థం చేసుకోవాలంటే, ఈ ముందస్తు సాహిత్యనేపథ్యాన్ని విశ్లేషించడం అత్యంత అవసరమని చెప్పవచ్చు.

ఈ కవితలు ప్రజల్లో భావోద్వేగాలను రగిలించడమే కాకుండా, జాతీయ ఐక్యతను కూడా బలపరిచాయి.

### 3. జాతీయ చైతన్యం మరియు తెలుగుకవిత్వం

భారత స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తెలుగుకవిత్వం జాతీయ చైతన్య నిర్మాణంలో అత్యంత ప్రభావవంతమైన సాహిత్యరూపంగా అవతరించింది. అక్షరాస్యత పరిమితంగా ఉన్న సమాజంలో కూడా కవిత్వం భావోద్వేగాలను వేగంగా ప్రజల మనసుల్లో నాటగలిగిన శక్తివంతమైన మాధ్యమంగా నిలిచింది. రాజకీయ ఆలోచనలు, జాతీయభావాలు, స్వాతంత్ర్య ఆశయాలు కవిత్వరూపంలో వ్యక్తమై, సామాన్య ప్రజల హృదయాలను కదిలించాయి. ఈ కాలంలో దేశభక్తి కవితలు కేవలం సాహిత్యరచనలుగా కాకుండా, ప్రజా ఉద్యమానికి ప్రేరణగా పనిచేశాయి. తెలుగు దేశభక్తి కవిత్వంలో స్వదేశీ భావన ప్రధానంగా దర్శనమిస్తుంది. స్వదేశం పరాధీనతపై ద్వేషం, స్వేచ్ఛ కోసం త్యాగానికి సిద్ధపడే మనస్తత్వం కవిత్వంలో ప్రధాన ఇతివృత్తాలుగా నిలిచాయి. ఈ కవితలు ప్రజల్లో భావోద్వేగాలను రగిలించడమే కాకుండా, జాతీయ ఐక్యతను కూడా బలపరిచాయి. కవులు తమ రచనల ద్వారా దేశాన్ని తల్లిగా, పవిత్ర భూమిగా చిత్రీకరించి, దాని విముక్తి కోసం పోరాటం చేయాల్సిన అవసరాన్ని స్పష్టంగా వివరించారు [శ్రీశ్రీ 1952, పుట. 15–22].

కవిత్వం ద్వారా వలసపాలనపై వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమైంది. పాలకుల ఆర్థిక దోపిడీ, రాజకీయ అణచివేత, భారతీయులపై చూపిన

వివక్షలను కవులు తీవ్ర పదజాలంతో విమర్శించారు. ఈ విమర్శ కేవలం రాజకీయ స్థాయిలోనే కాకుండా, మానసిక స్థాయిలో కూడా ప్రజలను ప్రభావితం చేసింది. పరాధీనతను అవమానంగా భావించే చైతన్యం కవిత్వం ద్వారా ప్రజల్లో బలపడింది. ఈ విధంగా కవిత్వం ప్రజలను మానసిక బానిసత్వంనుండి విముక్తివైపు నడిపించింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 121–126]. ప్రత్యేకంగా యువతపై తెలుగుకవిత్వం గాఢమైన ప్రభావం చూపింది. యువతలో దేశభక్తి, వీరత్వం, త్యాగభావనలను పెంపొందించడంలో కవిత్వం కీలకపాత్ర పోషించింది. జాతీయ ఉద్యమంలో పాల్గొనడం ఒక గౌరవకరమైన కార్యంగా కవిత్వం ద్వారా ప్రతిష్ఠించబడింది. స్వాతంత్ర్యం కోసం చేయడాన్ని మహోన్నతమైన కార్యంగా కవులు ఈ భావజాలం యువతను ఉద్యమంలోకి ఆకర్షించడంలో ముఖ్య కారణంగా నిలిచింది [నాగేశ్వరరావు, 1994, పుట. 58–63]. తెలుగుకవిత్వంలో గాంధీయ ప్రభావం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. అహింస, సత్యం, స్వదేశీ, ఖాదీవంటి భావనలు కవిత్వంలో ప్రతిబింబించాయి. అయితే ఇదే సమయంలో, కొంతమంది కవులు విప్లవాత్మక ధోరణిని కూడా ప్రదర్శించారు. శాంతియుత మార్గంతో పాటు అవసరమైతే తీవ్రపోరాటం కూడా అవసరమనే భావన కొన్ని కవితల్లో వ్యక్తమైంది. ఈ విభిన్నధోరణులు తెలుగుకవిత్వాన్ని మరింత చైతన్యవంతంగా మార్చాయి [రామచంద్రరావు, 2010, పుట. 98–104]. ముఖ్యంగా కవిత్వభాష సరళంగా, ప్రజలకు అర్థమయ్యే విధంగా ఉండటం దాని ప్రభావాన్ని మరింత పెంచింది. సభల్లో, జాతీయ సమావేశాల్లో, ఉద్యమకార్యక్రమాల్లో ఈ కవితలు గానం చేయబడటం వల్ల అవి ప్రజాసంస్కృతిలో భాగమయ్యాయి. ఈ విధంగా తెలుగుకవిత్వం వ్యక్తిగత భావప్రకటన స్థాయిని దాటి, సామూహిక జాతీయచైతన్య నిర్మాణానికి కీలక సాధనంగా మారింది. అందువల్ల, జాతీయ చైతన్యం మరియు తెలుగుకవిత్వం మధ్య ఉన్న సంబంధం విడదీయరానిది. తెలుగుకవిత్వం స్వాతంత్ర్య ఉద్యమానికి భావోద్వేగాత్మక బలాన్ని అందించడమే కాకుండా, ప్రజలను ఉద్యమంలో చురుకుగా పాల్గొనేలా చేసిన శక్తిగా నిలిచింది. భారత

శాంతియుత మార్గంతో పాటు అవసరమైతే తీవ్రపోరాటం కూడా అవసరమనే భావన కొన్ని కవితల్లో వ్యక్తమైంది.

స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో తెలుగు దేశభక్తి కవిత్వం ఒక విశిష్టమైన అధ్యాయంగా నిలిచిందని నిర్ధారించవచ్చు.

కవిత్వం, వ్యాసాలు, కథలు గాంధీయ ఆలోచనలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రూపంలో ప్రచారం చేశాయి.

### 4. గాంధీయ సిద్ధాంతాలు మరియు తెలుగుసాహిత్యం

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ ప్రవేశపెట్టిన ఆలోచనలు కేవలం రాజకీయ వ్యూహాలకే పరిమితం కాకుండా, భారతీయ సమాజపు నైతిక-సాంస్కృతిక జీవనవిధానాన్ని కూడా లోతుగా ప్రభావితం చేశాయి. ఈ ప్రభావం తెలుగుసాహిత్యంలో స్పష్టంగా ప్రతిఫలించింది. అహింస, సత్యం, సత్యాగ్రహం, స్వదేశీ, ఖాదీ, స్వావలంబన వంటి గాంధీయ సిద్ధాంతాలు తెలుగు రచయితలు మరియు కవులకు కొత్త ఆలోచనాదిశను అందించాయి. ఫలితంగా, తెలుగుసాహిత్యం స్వాతంత్ర్య ఉద్యమంలో రాజకీయ సందేశాలను నైతికవిలువలతో అనుసంధానించే సాధనంగా మారింది [నాగేశ్వరరావు, 1994, పుట. 70–75]. గాంధీయ సిద్ధాంతాలలో ముఖ్యమైన అంశం రాజకీయ పోరాటాన్ని నైతిక పోరాటంగా మలచడం. పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమాన్ని కేవలం శక్తి ప్రతిశక్తి పోరాటంగా కాకుండా, సత్యం మరియు అహింస ఆధారంగా సాగే ధర్మపోరాటంగా గాంధీ ప్రతిపాదించారు. ఈ భావన తెలుగు సాహిత్యంలో విస్తృతంగా ప్రతిబింబించింది. కవిత్వం, వ్యాసాలు, కథలు గాంధీయ ఆలోచనలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రూపంలో ప్రచారం చేశాయి. సాహిత్యం ద్వారా సత్యం కోసం త్యాగం చేయడం, అహింసను ఆచరించడం ఒక నైతిక బాధ్యతగా చిత్రీకరించబడింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 132–138]. స్వదేశీ మరియు ఖాదీ ఉద్యమాలు కూడా తెలుగుసాహిత్యంలో ముఖ్యమైన అంశాలుగా నిలిచాయి. విదేశీ వస్తువుల బహిష్కరణ, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం కేవలం ఆర్థికచర్యలుగా కాకుండా, జాతీయగౌరవానికి సంకేతాలుగా సాహిత్యంలో ప్రతిపాదించబడ్డాయి. ఖాదీ ధరించడం స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామిగా ఉండడాన్ని సూచించే గుర్తుగా రచయితలు వివరించారు. ఈ భావజాలం గ్రామీణ ప్రజల్లో ప్రత్యేకంగా ఆదరణ పొందింది, ఎందుకంటే

అది వారి దైనందిన జీవితాలకు నేరుగా అనుసంధానమై ఉంది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 150–156].

**గాంధీయ సిద్ధాంతాలపై విమర్శాత్మక దృష్టి కూడా తెలుగుసాహిత్యంలో కనిపిస్తుంది.**

గాంధీయ సాహిత్యం గ్రామీణసమాజాన్ని కేంద్రంగా చేసుకొని వికసించింది. గాంధీ భారత జాతీయ ఉద్యమానికి పునాదిగా భావించినట్లే, తెలుగు రచయితలు కూడా ప్రజల జీవనవిధానం, సమస్యలు, ఆశయాలను సాహిత్యంలో ప్రతిబింబించారు. రైతులు, కూలీలు, పేదలు ఉద్యమంలో భాగస్వాములవుతుండటాన్ని గాంధీయ సాహిత్యం సానుకూలంగా చిత్రీకరించింది. ఈ రచనలు ప్రజల్లో రాజకీయ చైతన్యంతో పాటు నైతికబాధ్యత భావనను కూడా పెంపొందించాయి [వెంకటరమణ, 2001, పుట. 96–102]. అదే సమయంలో, గాంధీయ సిద్ధాంతాలపై విమర్శాత్మక దృష్టి కూడా తెలుగుసాహిత్యంలో కనిపిస్తుంది. కొంతమంది రచయితలు అహింసామార్గం పరిమితులను ప్రశ్నిస్తూ, విప్లవాత్మకమార్గాల అవసరాన్ని సూచించారు. అయినప్పటికీ, గాంధీ ప్రతిపాదించిన నైతికవిలువలు తెలుగుసాహిత్యంపై చూపిన ప్రభావం విస్తృతమైనదిగా మరియు దీర్ఘకాలికమైనదిగా నిలిచింది. గాంధీయ ఆలోచనలు సాహిత్యాన్ని రాజకీయ ప్రేరణ సాధనంగా మాత్రమే కాకుండా, మానవవిలువలను పెంపొందించే మాధ్యమంగా మార్చాయి [రామచంద్రరావు, 2010, పుట. 120– 126]. మొత్తంగా చూస్తే, గాంధీయ సిద్ధాంతాలు మరియు తెలుగు సాహిత్యం మధ్య ఒక సజీవసంబంధం ఏర్పడింది. ఈ సాహిత్యం స్వాతంత్ర్య ఉద్యమాన్ని నైతికపోరాటంగా మలిచిన గాంధీయ ఆలోచనలను ప్రజల దైనందిన జీవితాలకు దగ్గర చేసింది. ప్రజల్లో విశేష ఆదరణ పొందిన గాంధీయ సాహిత్యం, జాతీయ ఉద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చడంలో కీలకపాత్ర పోషించిందని చెప్పవచ్చు.

### 5. నాటకాలు, వీధి నాటకాలు మరియు ప్రజాగీతాలు

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో నాటకాలు, వీధి నాటకాలు మరియు ప్రజాగీతాలు ప్రజా చైతన్యాన్ని నిర్మించడంలో అత్యంత

ప్రభావవంతమైన సాంస్కృతిక మాధ్యమాలుగా నిలిచాయి. అక్షరాస్యత లేని లేదా పరిమితవిద్య కలిగిన ప్రజలకు కూడా స్వాతంత్ర్య ఉద్యమ సందేశాన్ని సులభంగా చేరవేయగల శక్తి వీటిలో నిహితమై ఉంది. వ్రాతపూర్వక సాహిత్యం అందుబాటులో లేని సందర్భాలలో, దృశ్య శ్రవ్య మాధ్యమాలైన నాటకాలు మరియు పాటలు ఉద్యమ ఆలోచనలను ప్రజల జీవితాల్లో భాగం చేశాయి [వెంకటరమణ, 2001, పుట. 88–95]. నాటకాలు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో కేవలం వినోదసాధనాలుగా కాకుండా, రాజకీయ అవగాహన కలిగించే సామాజిక విద్యామాధ్యమాలుగా అభివృద్ధి చెందాయి. నాటకాల్లో వలసపాలనలోని అన్యాయాలు, ఆర్థిక దోపిడీ, సామాజిక అణచివేతలు కథానాయకుల అనుభవాల ద్వారా చూపించబడ్డాయి. ఈ పాత్రలతో తమను తాము అనుసంధానించుకోవడం వల్ల, ఉద్యమసందేశం మరింత లోతుగా వారి మనసుల్లో స్థిరపడింది. ఈ విధంగా నాటకాలు ప్రజల్లో జాతీయచైతన్యాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించాయి [రంగనాథాచార్యులు, 1986, పుట. 170–175]. వీధినాటకాలు స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన సాంస్కృతిక రూపంగా నిలిచాయి. పట్టణవీధులు, బజార్లు, జాతరలు వంటి ప్రజా స్థలాల్లో నిర్వహించబడిన ఈ నాటకాలు ఉద్యమ సందేశాన్ని ప్రత్యక్షంగా ప్రజల మధ్యకు తీసుకెళ్లాయి. వేదికలు, ఖర్చులు లేకుండా సులభంగా నిర్వహించగల వీధినాటకాలు ఉద్యమకార్యకర్తలకు ఒక శక్తివంతమైన సాధనంగా మారాయి. ఇవి బ్రిటిష్ పాలనపై విమర్శను సరళమైన భాషలో, హాస్యంతో లేదా భావోద్వేగంతో మేళవించి ప్రజలకు చేరవేశాయి [వెంకటరమణ, 2001, పుట. 96–101].

పాటల రూపంలో స్వాతంత్ర్య భావన, త్యాగం, స్వదేశీ ఉద్యమం, ఖాదీ, అహింస వంటి అంశాలు ప్రజల మనసుల్లో నాటబడ్డాయి.

ప్రజాగీతాలు కూడా స్వాతంత్ర్య ఉద్యమంలో విశేషపాత్ర పోషించాయి. పాటల రూపంలో స్వాతంత్ర్య భావన, త్యాగం, స్వదేశీ ఉద్యమం, ఖాదీ, అహింస వంటి అంశాలు ప్రజల మనసుల్లో నాటబడ్డాయి. ఈ పాటలు సభలు, నిరసనలు, యాత్రలు, సమావేశాల్లో పాడబడటం వల్ల ఉద్యమం

ఒక సాంస్కృతిక ఉత్సవంలా మారింది. సంగీతం మరియు పద్యాల మేళవింపు ప్రజల భావోద్వేగాలను ఉత్తేజపరిచి, ఉద్యమంలో భాగస్వాములవ్వాలనే తపనను పెంచింది [నాగేశ్వరరావు, 1994, పుట. 109–114]. సమాజంలో నాటకాలు మరియు ప్రజాగీతాల ప్రభావం మరింత తీవ్రంగా కనిపించింది. అక్షరాస్యత లేని రైతులు, కూలీలు, మహిళలు కూడా ఈ సాంస్కృతిక రూపాల ద్వారా ఉద్యమ సందేశాన్ని గ్రహించగలిగారు. ఈ విధంగా నాటకాలు మరియు పాటలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని పట్టణ మేధావుల పరిధినుండి బయటకు తీసుకువచ్చి, సామూహిక ప్రజా ఉద్యమంగా మలిచాయి [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 175–180]. అదే సమయంలో, ప్రభుత్వం ఈ సాంస్కృతిక రూపాల ప్రభావాన్ని గుర్తించి, నాటకాలు మరియు ప్రజాగీతాల పై నియంత్రణ చర్యలను అమలు చేసింది. కొన్ని నాటకాలు నిషేధించబడ్డాయి, ప్రదర్శనలపై ఆంక్షలు విధించబడ్డాయి. అయినప్పటికీ, కళాకారులు మరియు ఉద్యమకార్యకర్తలు ఈ అడ్డంకులను అధిగమిస్తూ తమ సందేశాన్ని ప్రజల వరకు చేరవేశారు. ఇది ఈ సాంస్కృతిక మాధ్యమాలలోని నిరసనాత్మక శక్తిని మరింత స్పష్టంగా చూపిస్తుంది [రామచంద్రరావు, 2010, పుట. 138–143]. మొత్తంగా చూస్తే, నాటకాలు, వీధి నాటకాలు మరియు ప్రజాగీతాలు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజాచైతన్యాన్ని నిర్మించిన ప్రధాన సాంస్కృతిక ఆయుధాలుగా నిలిచాయి. ఇవి అక్షరాస్యత అడ్డంకులను దాటి, ఉద్యమాన్ని ప్రతి వీధికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషించాయి. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో ఈ సాంస్కృతిక అత్యంత విశిష్టమైనదిగా నిలిచింది.

> **భారత స్వాతంత్ర్య ఉద్యమకాలంలో జైలు అనుభవాలు ఒక ప్రత్యేకమైన సాహిత్యరూపంగా అభివృద్ధి చెందాయి.**

### 6. జైలుసాహిత్యం మరియు త్యాగగాథలు

భారత స్వాతంత్ర్య ఉద్యమకాలంలో జైలు అనుభవాలు ఒక ప్రత్యేకమైన సాహిత్యరూపంగా అభివృద్ధి చెందాయి. వలసపాలనకు వ్యతిరేకంగా ఉద్యమంలో పాల్గొన్న అనేకమంది తెలుగునాయకులు, కవులు, రచయితలు జైలుశిక్షలను అనుభవించారు. ఈ జైలు జీవిత అనుభవాలు కేవలం వ్యక్తిగత బాధలుగా మాత్రమే కాకుండా, సాహిత్యరూపంలో ప్రజల ముందుకు

వచ్చాయి. ఈ విధంగా రూపుదిద్దుకున్న జైలుసాహిత్యం స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక భావోద్వేగాత్మక మరియు నైతికబలాన్ని అందించింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 156–160]. జైలు సాహిత్యంలో ప్రధానంగా కనిపించే అంశం త్యాగ భావన. స్వాతంత్ర్యం కోసం వ్యక్తిగత స్వేచ్ఛను త్యాగం చేయడం, కుటుంబ జీవితం నుండి దూరమవడం, శారీరక మానసిక బాధలను భరించడం వంటి అనుభవాలు రచనల్లో స్పష్టంగా ప్రతిఫలించాయి. ఈ రచనలు జైలు జీవితాన్ని ఒక శిక్షగా కాకుండా, జాతీయ ఉద్యమంలో భాగమైన గౌరవప్రదమైన త్యాగంగా చిత్రీకరించాయి. ఫలితంగా, జైలు అనుభవాలు ప్రజల్లో భయాన్ని కలిగించకుండా, ఉద్యమంలో పాల్గొనే ధైర్యాన్ని పెంపొందించాయి [నాగేశ్వరరావు, 1994, పుట. 118–123]. జైలు సాహిత్యం వ్యక్తిగత వేదనను సామూహిక అనుభవంగా మలిచింది. ఖైదీల దైనందిన జీవితం, కఠిన నియమాలు, ఆహార కొరత, అనారోగ్యం వంటి అంశాలు రచనల్లో వర్ణించబడ్డాయి. అయితే ఈ బాధల మధ్య కూడా స్వాతంత్ర్యంపై అచంచలమైన విశ్వాసం ఎలా నిలిచిందో రచయితలు వివరించారు. ఈ వర్ణనలు ప్రజల్లో ఉద్యమంపై నమ్మకాన్ని బలపరిచాయి. జైలుగోడల మధ్య కూడా జాతీయ భావజాలం నిలిచిపోతుందని ఈ సాహిత్యం స్పష్టం చేసింది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 190–195].

త్యాగగాథలు జైలుసాహిత్యంలో మరో ముఖ్యమైన అంశంగా నిలిచాయి. జైలుశిక్షలు అనుభవించిన నాయకులు, కార్యకర్తలు తమ అనుభవాలను స్మృతిరూపంలో, కథలుగా, కవితలుగా నమోదు చేశారు. ఈ త్యాగగాథలు ఉద్యమంలో పాల్గొనని ప్రజలకు కూడా స్వాతంత్ర్య పోరాటం వెనుక ఉన్న కష్టాలను అర్థమయ్యేలా చేశాయి. ముఖ్యంగా యువతలో ఈ రచనలు ఒక ఆదర్శ భావనను నిర్మించాయి. జైలు శిక్షను భయపడాల్సిన అంశంగా కాకుండా, ఉద్యమానికి అంకితమయ్యే మార్గంగా ఈ సాహిత్యం చిత్రీకరించింది [రామచంద్రరావు, 2010, పుట. 150–155]. జైలు

**జైలుశిక్షలు అనుభవించిన నాయకులు, కార్యకర్తలు తమ అనుభవాలను స్మృతిరూపంలో, కథలుగా, కవితలుగా నమోదు చేశారు.**

సాహిత్యంలో నైతికబలం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. గాంధీయ అహింసా సిద్ధాంతం ప్రభావంతో, జైలు జీవితం ఆత్మపరిశీలనకు, నైతికశుద్ధికి ఒక అవకాశంగా రచనల్లో ప్రతిఫలించింది. ఖైదీలు తమ బాధలను సత్యం మరియు ధర్మం కోసం భరించాల్సిన పరీక్షలుగా భావించిన తీరు ఈ సాహిత్యంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నైతిక దృష్టికోణం ప్రజల్లో ఉద్యమాన్ని ఒక ధర్మపోరాటంగా చూడే భావనను బలపరిచింది [వెంకటరమణ, 2001, పుట. 120–125]. అదే సమయంలో, జైలు సాహిత్యం పాలకవ్యవస్థపై తీవ్రవిమర్శను కూడా కలిగి ఉంది. ఖైదీలపై జరిగిన అన్యాయాలు, మానవ హక్కుల ఉల్లంఘనలు రచనల్లో ప్రత్యక్షంగా వర్ణించబడ్డాయి. ఈ విమర్శ ప్రజల్లో వలసపాలనపై వ్యతిరేకతను మరింత తీవ్రం చేసింది. జైలు అనుభవాలను ప్రజల ముందుంచడం ద్వారా, బ్రిటిష్ పాలన యొక్క నిజ స్వరూపాన్ని సాహిత్యం బహిర్గతం చేసింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 161–165]. మొత్తంగా చూస్తే, జైలుసాహిత్యం మరియు త్యాగగాథలు భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజాచైతన్యాన్ని నిర్మించిన ఒక ప్రత్యేకమైన సాహిత్య సంప్రదాయంగా నిలిచాయి. ఈ సాహిత్యం ప్రజల్లో ధైర్యం, త్యాగభావన, నైతికబలం మరియు ఉద్యమంపై అచంచలమైన విశ్వాసాన్ని పెంపొందించింది. స్వాతంత్ర్య ఉద్యమచరిత్రలో జైలు సాహిత్యం ఒక విలువైన మానవ అనుభవాల పత్రంగా, అలాగే ఉద్యమానికి ప్రేరణనిచ్చిన సాంస్కృతిక శక్తిగా శాశ్వతస్థానం సంపాదించిందని చెప్పవచ్చు.

**భారత స్వాతంత్ర్య ఉద్యమం రాజకీయ విముక్తితో పాటు సామాజిక విముక్తిని కూడా లక్ష్యంగా పెట్టుకున్న సమగ్ర ఉద్యమంగా ఎదిగింది.**

### 7. సామాజిక సంస్కరణలు మరియు సాహిత్యం

భారత స్వాతంత్ర్య ఉద్యమం రాజకీయ విముక్తితో పాటు సామాజిక విముక్తిని కూడా లక్ష్యంగా పెట్టుకున్న సమగ్ర ఉద్యమంగా ఎదిగింది. ఈ నేపథ్యంలో తెలుగు సాహిత్యం సామాజిక సంస్కరణల ప్రచారానికి ఒక ప్రభావవంతమైన మాధ్యమంగా మారింది. అస్పృశ్యత నిర్మూలన, మహిళావిద్య, కులవివక్షకు వ్యతిరేకత, సామాజిక సమానత్వం వంటి అంశాలు స్వాతంత్ర్య ఉద్యమకాలంలోని సాహిత్యంలో ప్రధానంగా చర్చించబడ్డాయి. రాజకీయ

స్వాతంత్ర్యం సామాజిక మార్పు లేకుండా అసంపూర్ణమేనన్న భావన తెలుగు రచయితల రచనల్లో స్పష్టంగా ప్రతిఫలించింది [నాగేశ్వరరావు, 1994, పుట. 90–96]. అస్పృశ్యత నిర్మూలన అంశం తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యంలో ప్రత్యేక ప్రాధాన్యతను సంపాదించింది. కుల ఆధారిత అణచివేతను మానవగౌరవానికి విరుద్ధమైన చర్యగా రచయితలు తీవ్రంగా ఖండించారు. దళితులు మరియు పేదవర్గాలపై జరుగుతున్న సామాజిక అన్యాయాలను కథలు, కవితలు, వ్యాసాల రూపంలో ప్రజల ముందుకు తీసుకువచ్చారు. ఈ రచనలు సమాజంలో కులవివక్షపై విమర్శాత్మక చైతన్యాన్ని పెంపొందించాయి. అస్పృశ్యతను నిర్మూలించడం జాతీయ ఐక్యతకు అవసరమైన ముందస్తు షరతుగా సాహిత్యంలో ప్రతిపాదించబడింది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 185– 190]. మహిళా విద్య మరియు మహిళా సాధికారత కూడా ఈ కాలపు సాహిత్యంలో ముఖ్యమైన అంశాలుగా నిలిచాయి. మహిళలను కుటుంబ పరిమితులలో బంధించి ఉంచే సంప్రదాయాలపై రచయితలు ప్రశ్నలు సంధించారు. మహిళల విద్య, స్వతంత్ర ఆలోచన, సామాజిక పాల్గొనడం దేశాభివృద్ధికి అవసరమన్న భావనను సాహిత్యం బలపరిచింది. మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం ఒక సామాజిక మార్పుకు సంకేతంగా రచనల్లో ప్రతిఫలించింది [రామచంద్రరావు, 2010, పుట. 160–165]. సామాజిక సమానత్వం అనే భావన స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యంలో ఒక కేంద్ర సిద్ధాంతంగా అభివృద్ధి చెందింది. కులం, మతం, లింగం ఆధారంగా జరిగే వివక్షను రచయితలు వ్యతిరేకించారు. సమానహక్కులు, మానవగౌరవం, న్యాయంవంటి విలువలు జాతీయ ఉద్యమలక్ష్యాలుగా సాహిత్యంలో ప్రతిపాదించబడ్డాయి. ఈ రచనలు ప్రజల్లో సామాజికన్యాయంపై అవగాహనను పెంపొందించాయి [వెంకటరమణ, 2001, పుట. 130–135].

మహిళలను కుటుంబ పరిమితులలో బంధించి ఉంచే సంప్రదాయాలపై రచయితలు ప్రశ్నలు సంధించారు.

**8. మహిళలు మరియు స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం**

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో మహిళల పాత్ర క్రమంగా విస్తరిస్తూ,

సమాజంలో ఒక కొత్త చైతన్యానికి దారి తీసింది. ఈ మార్పును ప్రతిబింబించడంలో తెలుగుసాహిత్యం కీలకపాత్ర పోషించింది. మహిళలను గృహపరిమితులకు మాత్రమే పరిమితం చేసిన సంప్రదాయ దృక్పథాన్ని ప్రశ్నిస్తూ, మహిళల సామాజిక, రాజకీయ, జాతీయపాత్రను గుర్తించిన రచనలు ఈ కాలంలో వెలువడ్డాయి. మహిళల భాగస్వామ్యం స్వాతంత్ర్య ఉద్యమానికి అవసరమైనదిగా మాత్రమే కాకుండా, జాతీయ పునర్నిర్మాణానికి కీలకమైన అంశంగా సాహిత్యంలో ప్రతిపాదించబడింది [రామచంద్రరావు, 2010, పుట. 145–150]. స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యంలో మహిళలు త్యాగం, ధైర్యం, సేవాభావానికి ప్రతీకలుగా చిత్రీకరించబడ్డారు. మహిళలు సత్యాగ్రహాలలో పాల్గొనడం, జాతీయసభల్లో ప్రసంగించడం, ఖాదీ ఉద్యమానికి మద్దతు ఇవ్వడం వంటి అంశాలు కథలు, కవితలు, వ్యాసాలలో ప్రాధాన్యతను పొందాయి. ఈ రచనలు మహిళలను ఉద్యమానికి సహాయక పాత్రలో మాత్రమే కాకుండా, చురుకైన కార్యకర్తలుగా చూపించాయి. దీని వల్ల మహిళలపై ఉన్న సామాజిక పరిమితులపై ప్రశ్నలు మొదలయ్యాయి (నాగేశ్వరరావు, 1994, పుట. 121–126].

> **మహిళా చైతన్యం స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యంలో ఒక ముఖ్యమైన భావనగా అభివృద్ధి చెందింది.**

మహిళా చైతన్యం స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యంలో ఒక ముఖ్యమైన భావనగా అభివృద్ధి చెందింది. మహిళలు తమ హక్కులు, గౌరవం, స్వతంత్ర ఆలోచనలపై అవగాహన పొందాల్సిన అవసరాన్ని రచయితలు స్పష్టంగా ప్రస్తావించారు. మహిళావిద్య ప్రాముఖ్యత, అక్షరాస్యత, సామాజిక పాల్గొనడం వంటి అంశాలు సాహిత్యంలో పునరావృతమయ్యాయి. ఈ రచనలు మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో దోహదపడ్డాయి [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 202–207]. స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యంలో తల్లిగా మహిళ పాత్రను జాతీయ భావజాలంతో ముడిపెట్టడం కూడా ఒక ముఖ్య లక్షణం. భారతమాత భావన ద్వారా దేశాన్ని తల్లిగా ప్రతిష్ఠించి, ఆ తల్లి విముక్తి కోసం మహిళలు మరియు పురుషులు సమానంగా పోరాడాల్సిన అవసరాన్ని కవులు వ్యక్తం చేశారు. ఈ రూపకం మహిళలను జాతీయ ఉద్యమానికి భావోద్వేగాత్మకంగా దగ్గర చేసింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 192–197]. అదే

సమయంలో, కొన్ని రచనల్లో మహిళలపై జరుగుతున్న అణచివేత, అసమానతలు, సామాజిక వివక్షలు కూడా విమర్శాత్మకంగా చర్చించబడ్డాయి. మహిళలు ద్వంద్వ అణచివేతను—వలసపాలనతో పాటు పితృస్వామ్య వ్యవస్థను—ఎదుర్కొంటున్నారని రచయితలు గుర్తించారు. ఈ విమర్శాత్మక సాహిత్యం మహిళావిముక్తిని స్వాతంత్ర్య ఉద్యమంలో అంతర్భాగంగా ప్రతిపాదించింది [వెంకటరమణ, 2001, పుట. 140–145]. మహిళారచయితల స్వరం కూడా ఈ కాలంలో క్రమంగా వినిపించసాగింది.

**మహిళల అనుభవాలు, భావోద్వేగాలు, ఆశయాలు సాహిత్యంలో వ్యక్తమవ్వడం ద్వారా మహిళాచైతన్యం మరింత బలపడింది.**

మహిళల అనుభవాలు, భావోద్వేగాలు, ఆశయాలు సాహిత్యంలో వ్యక్తమవ్వడం ద్వారా మహిళాచైతన్యం మరింత బలపడింది. ఇది స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యాన్ని మరింత సమగ్రంగా, బహుళ స్వరాలతో కూడినదిగా మార్చింది [రామచంద్రరావు, 2010, పుట. 151– 155]. ఈ విధంగా మహిళల భాగస్వామ్యాన్ని సాహిత్య రూపంలో ప్రతిష్ఠించిన తెలుగు స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం భారత జాతీయ ఉద్యమ చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా నిలిచిందని చెప్పవచ్చు.

### 9. ఉద్యమ సాహిత్యం

1947లో భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం సాధించిన తరువాత కూడా, స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం తన ప్రాసంగికతను కోల్పోలేదు. ఉద్యమకాలంలో రూపొందిన సాహిత్యం స్వాతంత్ర్యానంతర భారత సమాజానికి నైతిక దిశానిర్దేశకంగా, చారిత్రక స్మృతిగా, అలాగే సమాజపరిశీలనకు ఒక ప్రమాణంగా నిలిచింది. తెలుగుసాహిత్యంలో ఉద్యమ అనుభవాలు, త్యాగగాథలు, జాతీయవిలువలు స్వాతంత్ర్యానంతర కాలంలో కొత్త సందర్భాలలో పునఃపఠనానికి లోనయ్యాయి. ఈ సాహిత్యం ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, జాతీయ ఐక్యత వంటి లక్ష్యాలను కొనసాగించాల్సిన అవసరాన్ని గుర్తుచేసింది [నాగేశ్వరరావు, 1994, పుట. 120–125]. స్వాతంత్ర్యానంతర తెలుగుసాహిత్యంలో ఉద్యమసాహిత్యం

ఒక చారిత్రక ఆధారంగా మారింది. రచయితలు, కవులు ఉద్యమకాలాన్ని తిరిగి పరిశీలిస్తూ, స్వాతంత్ర్యసాధనలో జరిగిన త్యాగాలను స్మరించారు. ఈ స్మరణ కేవలం గౌరవార్పణగా కాకుండా, స్వాతంత్ర్యానంతర భారతసమాజంలో ఏర్పడిన అసమానతలు, పరిపాలనా లోపాలు, సామాజిక సమస్యలను విమర్శించడానికి ఒక ప్రమాణంగా ఉపయోగించబడింది. ఉద్యమ సాహిత్యం ప్రతిపాదించిన ఆదర్శాలను ఆధారంగా చేసుకొని, కొత్త భారతదేశం ఆ ఆదర్శాలకు ఎంతవరకు నిబద్ధంగా ఉందో రచయితలు ప్రశ్నించారు [రంగనాథాచార్యులు, 1986, పుట. 216–221].

**స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం ద్వారా త్యాగం, దేశభక్తి, నైతికబాధ్యత వంటి విలువలు విద్యావ్యవస్థలో భాగమయ్యాయి.**

ఈ కాలంలో ఉద్యమసాహిత్యం యువతకు ప్రేరణగా కొనసాగింది. పాఠ్యపుస్తకాలు, సాహిత్య పఠనాలు, నాటక ప్రదర్శనలు ఉద్యమకాలపు రచనలను కొత్తతరాలకు పరిచయం చేశాయి. స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం ద్వారా త్యాగం, దేశభక్తి, నైతికబాధ్యత వంటి విలువలు విద్యావ్యవస్థలో భాగమయ్యాయి. ఇది యువతలో పౌరబాధ్యత భావనను పెంపొందించడంలో దోహదపడింది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 208–213]. స్వాతంత్ర్యానంతర దశలో ఉద్యమసాహిత్యం విమర్శాత్మక దృష్టికి కూడా లోనైంది. కొంతమంది రచయితలు ఉద్యమ సాహిత్యంలోని ఆదర్శవాదాన్ని పునఃపరిశీలిస్తూ, అది స్వాతంత్ర్యానంతర వాస్తవాలతో ఎంతవరకు సరిపోతుందో విశ్లేషించారు. ఈ విమర్శ ఉద్యమసాహిత్యాన్ని తిరస్కరించడానికి కాదు, దాని మూలవిలువలను సమకాలీన సందర్భాలకు అనువదించడానికి దోహదపడింది. ఈ విధంగా ఉద్యమ సాహిత్యం ఒక జీవంత సంప్రదాయంగా కొనసాగింది [నాగేశ్వరరావు, 1994, పుట. 126–130]. సామాజిక న్యాయం, కులనిర్మూలన, మహిళాసాధికారత వంటి అంశాలలో స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం ప్రతిపాదించిన భావనలు స్వాతంత్ర్యానంతర సాహిత్యంలో మరింత విస్తృతంగా చర్చించబడ్డాయి. ఉద్యమకాలపు రచనలు ఈ చర్చలకు చారిత్రక పునాదిగా నిలిచాయి. ఫలితంగా, ఉద్యమసాహిత్యం రాజకీయ స్వాతంత్ర్యాన్ని మించిన సామాజిక విముక్తి లక్ష్యాలను గుర్తుచేసే

సాధనంగా మారింది [వెంకటరమణ, 2001, పుట. 156–161].

అదే సమయంలో, జాతీయ ఉత్సవాలు, స్మారక దినాలు, సాహిత్యసభల ద్వారా ఉద్యమసాహిత్యం ప్రజా సంస్కృతిలో నిలిచింది. ఈ సాహిత్యం జాతీయ స్మృతినిర్మాణంలో భాగమై, భారత స్వాతంత్ర్య చరిత్రను సజీవంగా ఉంచింది. ఉద్యమకాలపు రచనలు స్వాతంత్ర్యానంతర తరాలకు ఒక నైతిక వారసత్వంగా అందాయి [రామచంద్రరావు, 2010, పుట. 176–181]. మొత్తంగా చూస్తే, స్వాతంత్ర్యానంతర దృష్టిలో ఉద్యమసాహిత్యం తన ప్రేరణాత్మక శక్తిని కొనసాగించింది. ఇది కేవలం గతాన్ని స్మరించే సాహిత్యంగా కాకుండా, వర్తమానాన్ని విశ్లేషించి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే మేధోపరమైన వనరుగా నిలిచింది. తెలుగు స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం భారత జాతీయ చైతన్య నిర్మాణంలో శాశ్వతస్థానం సంపాదించిందని ఈ దశ స్పష్టంగా నిరూపిస్తుంది.

**జాతీయ ఉద్యమకాలంలో తెలుగురచయితలు, కవులు, నాటకకారులు తమ రచనల ద్వారా ప్రజా అనుభవాలను చరిత్రలో నిలిచేలా చేశారు.**

తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం భారత జాతీయ చరిత్రలో ఒక ప్రత్యేకమైన మరియు అత్యంత ప్రాముఖ్యత గల అధ్యాయంగా నిలిచింది. ఈ సాహిత్యం రాజకీయ సంఘటనల సరళవర్ణనకు పరిమితం కాకుండా, ఉద్యమానికి సంబంధించిన సామాజిక, సాంస్కృతిక, నైతిక మరియు మానసిక పరిణామాలను సమగ్రంగా నమోదు చేసింది. జాతీయ ఉద్యమకాలంలో తెలుగురచయితలు, కవులు, నాటకకారులు తమ రచనల ద్వారా ప్రజా అనుభవాలను చరిత్రలో నిలిచేలా చేశారు. ఈ విధంగా, తెలుగు సాహిత్యం భారత స్వాతంత్ర్య పోరాటానికి ఒక ప్రత్యామ్నాయ చారిత్రక పత్రంగా కూడా పనిచేసింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 210–215]. చారిత్రకంగా చూస్తే, అధికారిక వలసచరిత్రలు ఎక్కువగా పాలకుల దృష్టికోణాన్ని ప్రతిబింబించాయి. దీనికి భిన్నంగా, తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం సామాన్య ప్రజల అనుభవాలను, వారి బాధలు, ఆశలు, త్యాగాలను కేంద్రంగా చేసుకుంది. రైతులు, కూలీలు, మహిళలు, యువత

వంటి వర్గాల పాత్రను సాహిత్యం ముందుకు తెచ్చింది. ఈ కారణంగా, ఉద్యమచరిత్రను అర్థం చేసుకోవడంలో తెలుగు సాహిత్యం ఒక అనివార్యమైన ఆధారంగా మారింది (నాగేశ్వరరావు, 1994, పుట. 133–138].

**స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం జాతీయ విలువలను త్యాగం, ధైర్యం, నైతికత, ఐక్యత తరతరాలకు అందించింది.**

తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం జాతీయ చైతన్య నిర్మాణ ప్రక్రియను స్పష్టంగా చూపిస్తుంది. ప్రజలు ఎలా మానసిక బానిసత్వం నుండి బయటపడ్డారు, స్వేచ్ఛాభావనను ఎలా స్వీకరించారు, ఉద్యమంలో ఎలా చురుకుగా పాల్గొన్నారు అనే అంశాలు ఈ సాహిత్యంలో విశదంగా నమోదు అయ్యాయి. ఈ రచనలు ఉద్యమాన్ని ఒక సజీవప్రక్రియగా చరిత్రలో నిలిపాయి. చరిత్రను కేవలం తేదీలు, సంఘటనల పరంపరగా కాకుండా, మానవ అనుభవాల సమాహారంగా అర్థం చేసుకోవడానికి ఇవి దోహదపడ్డాయి [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 214–219]. చారిత్రక ప్రాధాన్యతలో మరో ముఖ్యమైన అంశం సాహిత్యం ద్వారా ఏర్పడిన సాంస్కృతిక వారసత్వం. స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం జాతీయ విలువలను–త్యాగం, ధైర్యం, నైతికత, ఐక్యత తరతరాలకు అందించింది. ఈ విలువలు స్వాతంత్ర్యానంతర భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు మేధోపరమైన పునాదులుగా నిలిచాయి. సాహిత్యరూపంలో నమోదు అయిన ఈ విలువలు చరిత్రలో నిలిచిపోయి, జాతీయ స్మృతిని నిర్మించాయి [వెంకటరమణ, 2001, పుట. 162–167]. ఈ దృష్టికోణం భారత చరిత్రను ఒక ఏకైక, సమగ్ర అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పించింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 216–220]. అదే సమయంలో, ఈ సాహిత్యం చరిత్ర పునఃవ్యాఖ్యానానికి కూడా దోహదపడింది. స్వాతంత్ర్య ఉద్యమాన్ని కేవలం రాజకీయ నాయకుల కృషిగా కాకుండా, సామూహిక ప్రజాపోరాటంగా పునర్నిర్వచించడంలో తెలుగు సాహిత్యం కీలక పాత్ర పోషించింది. ఈ పునఃవ్యాఖ్యానం ఆధునిక చరిత్ర రచనలకు కొత్త దిశను అందించింది. ప్రజల పాత్రను కేంద్రంగా చేసుకున్న చరిత్ర రచనలకు ఇది ప్రేరణగా నిలిచింది [రామచంద్రరావు, 2010, పుట. 182–187].

మొత్తంగా చూస్తే, తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం భారత

జాతీయచరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా మాత్రమే కాకుండా, ఒక సజీవ చారిత్రక వనరుగా నిలిచింది. ఇది ఉద్యమ అనుభవాలను నమోదు చేయడమే కాకుండా, జాతీయ చైతన్య నిర్మాణానికి మేధోపరమైన ఆధారాన్ని అందించింది. ఈ సాహిత్యం లేకుండా భారత స్వాతంత్ర్య ఉద్యమచరిత్రను పూర్తిగా అర్థం చేసుకోవడం అసాధ్యమని చెప్పవచ్చు. అందువల్ల, తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం భారత చరిత్రలో తనకు తాను ఒక విశిష్టమైన, శాశ్వతమైన స్థానం సంపాదించిందని నిర్ధారించవచ్చు.

**తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం రాజకీయ స్వేచ్ఛను మాత్రమే కాకుండా, సామాజిక మార్పును కూడా తన ప్రధాన లక్ష్యంగా చేసుకుంది.**

## 10. ఉపసంహారం (Conclusion)

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగుసాహిత్యం ప్రజాచైతన్యాన్ని నిర్మించిన శక్తివంతమైన మాధ్యమంగా పనిచేసిందని ఈ అధ్యయనం స్పష్టంగా నిరూపిస్తుంది. ఇది కేవలం ఉద్యమానికి ఒక సాహిత్య ప్రతిబింబంగా మాత్రమే కాకుండా, ఉద్యమాన్ని ముందుకు నడిపించిన క్రియాశీలశక్తిగా కూడా వ్యవహరించింది. కవిత్వం, గద్య రచనలు, నాటకాలు, ప్రజాగీతాలు వంటి విభిన్న సాహిత్య రూపాలు ప్రజలను మానసిక బానిసత్వం నుండి విముక్తి వైపు నడిపించడంలో కీలక పాత్ర పోషించాయి. ఈ సాహిత్యం ప్రజల ఆలోచనా విధానాన్ని మార్చి, స్వేచ్ఛ అనే భావనను సామూహిక ఆకాంక్షగా మలిచింది [రంగనాథాచార్యులు, 1986, పుట. 220–225]. తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం రాజకీయ స్వేచ్ఛను మాత్రమే కాకుండా, సామాజిక మార్పును కూడా తన ప్రధాన లక్ష్యంగా చేసుకుంది. అస్పృశ్యత నిర్మూలన, మహిళావిద్య, సామాజిక సమానత్వం, అభివృద్ధి వంటి అంశాలను ఉద్యమసాహిత్యం నిరంతరం ప్రస్తావించింది. ఈ దృష్టికోణం రాజకీయ విముక్తి సామాజిక న్యాయం లేకుండా అసంపూర్ణమేనన్న భావనను ప్రజల్లో బలపరిచింది. ఈ విధంగా, తెలుగుసాహిత్యం స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఒక సమగ్ర సామాజిక ఉద్యమంగా రూపుదిద్దడంలో సహకరించింది [నాగేశ్వరరావు, 1994, పుట. 135–140]. ఈ సాహిత్యం వివిధ సామాజిక వర్గాలను–రైతులు, కతులు, మహిళలు, యువత–ఉద్యమంలో

భాగస్వాములుగా మార్చింది. ప్రజలకు ఉద్యమభావనను చేరవేయడంలో మౌఖిక సాహిత్యరూపాలు కీలకపాత్ర పోషించాయి. పట్టణ మేధావుల ఆలోచనలు వరకు చేరి, ఉద్యమం నిజమైన ప్రజా ఉద్యమంగా మారేందుకు ఇది దోహదపడింది [వెంకటరమణ, 2001, పుట. 168–173]. ఈ సమగ్ర భాగస్వామ్యం లేకుండా స్వాతంత్ర్య ఉద్యమం ఇంత విస్తృత స్థాయిలో విజయవంతమయ్యేదని ఊహించడం కష్టం.

**స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం జాతీయ విలువలను త్యాగం, ధైర్యం, నైతికత, ఐక్యత తరతరాలకు అందించింది.**

ఉద్యమసాహిత్యం స్వతంత్ర భారతదేశానికి ఒక నైతిక దిక్సూచిగా నిలిచింది. ప్రజాస్వామ్య విలువలు, పౌరబాధ్యత, జాతీయ ఐక్యత వంటి అంశాలను ఇది నిరంతరం గుర్తుచేసింది. స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రతిపాదించిన ఆదర్శాలు స్వాతంత్ర్యానంతర వాస్తవాలకు ఎంతవరకు అనుసరించబడ్డాయన్న ప్రశ్నను కూడా ఈ సాహిత్యం ముందుకు తెచ్చింది. ఈ విధంగా, ఉద్యమసాహిత్యం ఒక జీవంత సంప్రదాయంగా కొనసాగింది [సుబ్రహ్మణ్యం, 1978, పుట. 220–225].

చారిత్రకంగా చూస్తే, తెలుగు స్వాతంత్ర్య ఉద్యమసాహిత్యం అధికారిక రాజకీయ చరిత్రలకు ప్రత్యామ్నాయ దృష్టిని అందిస్తుంది. ఇది ప్రజల అనుభవాలను, వారి త్యాగాలను, భావోద్వేగాలను చరిత్రలో నిలిపింది. ఈ కారణంగా, భారత స్వాతంత్ర్య ఉద్యమచరిత్రను సమగ్రంగా అర్థం చేసుకోవాలంటే తెలుగు భాషల సాహిత్యాన్ని అధ్యయనం చేయడం అనివార్యమని ఈ పరిశోధన సూచిస్తుంది [రామచంద్రరావు, 2010, పుట. 188–193]. మొత్తంగా చూస్తే, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్యం రాజకీయ మరియు సామాజిక మార్పులకు శక్తివంతమైన మేధోపరమైన, సాంస్కృతిక సాధనంగా నిలిచింది. ఇది ఉద్యమాన్ని ప్రతిబింబించడమే కాకుండా, దిశానిర్దేశం చేసిన శక్తిగా పనిచేసింది. అందువల్ల, తెలుగు స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం భారతచరిత్రలో శాశ్వత స్థానం సంపాదించిందని, జాతీయ చైతన్య నిర్మాణంలో దాని పాత్రను ఎప్పటికీ విస్మరించలేమని ఈ ఉపసంహారం నిర్ధారిస్తుంది.

## సూచన గ్రంథాలు (References)

1. రంగనాథాచార్యులు, డి. (1986). తెలుగు సాహిత్యంలో జాతీయ చైతన్యం. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ.
2. నాగేశ్వరరావు, ఎం. (1994). స్వాతంత్ర్య ఉద్యమం – తెలుగు సాహిత్యం. విజయవాడ: విశాలాంధ్ర ప్రచురణ.
3. సుబ్రహ్మణ్యం, కె. (1978). ఆంధ్ర పత్రికలు – జాతీయ ఉద్యమం. హైదరాబాద్: ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణలు.
4. రామచంద్రరావు, ఎస్. (2010). తెలుగు సాహిత్యం – సామాజిక చైతన్యం. న్యూఢిల్లీ: కనిష్క పబ్లిషర్స్.
5. వెంకటరమణ, పి. (2001). ప్రజానాటకాలు మరియు స్వాతంత్ర్య సంగ్రామం. హైదరాబాద్: ఎమెస్కో బుక్స్.
6. శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు). (1952). మహాప్రస్థానం. మద్రాస్: శ్రీశ్రీ సాహిత్య ప్రకాశన.
7. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ. (1990). స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం – తెలుగు. హైదరాబాద్.
8. విశ్వనాథ సత్యనారాయణ. (1964). ఆంధ్ర సాహిత్య చరిత్ర. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.
9. నారాయణరావు, వెల్చేరు. (1991). దక్షిణ భారతచరిత్ర రచనలో కాలస్వరూపం. ఢిల్లీ: ఆక్స్ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్.
10. కోసాంబి, డి.డి. (1956). భారత చరిత్ర అధ్యయనానికి పరిచయం. బొంబాయి: పాప్యులర్ ప్రకాశన్.
11. బిపిన్ చంద్ర. (1989). భారత స్వాతంత్ర్య పోరాట చరిత్ర. న్యూఢిల్లీ: పెంగ్విన్ ప్రచురణలు.
12. గాంధీ, మహాత్మా. (1957). నా సత్యాన్వేషణ ప్రయోగాలు (ఆత్మకథ). అహ్మదాబాద్: నవజీవన్ పబ్లిషింగ్ హౌస్.
13. పాణిక్కర్, కె.ఎన్. (1995). సంస్కృతి, సిద్ధాంతం, ఆధిపత్యం. ఢిల్లీ: తులికా బుక్స్. 14. గుహ, రణజిత్. (1982). సబాల్టర్న్ అధ్యయనాలు – భారత చరిత్ర. ఢిల్లీ: ఆక్స్ఫర్డ్.

14. మిస్సింగ్
15. చటర్జీ, పార్థ (1993). జాతి మరియు దాని విభాగాలు. న్యూజెర్సీ: ప్రిన్స్టన్ యూనివర్శిటీ ప్రెస్.
16. హార్డిమన్, డేవిడ్. (1987). భారత జాతీయ ఉద్యమం. ఆక్స్ఫర్డ్: బ్లాక్వెల్.
17. ఓంవేద్, గెయిల్. (1994). దళితులు మరియు ప్రజాస్వామ్య విప్లవం. న్యూఢిల్లీ: సేజ్ పబ్లికేషన్స్.
18. ఫోర్బ్స్, జెరాల్డిన్. (1996). ఆధునిక భారతదేశంలో మహిళలు. కేంబ్రిడ్జ్: కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్.
19. థారు, సుశీలా & లలిత, కె. (1991). భారతదేశంలో మహిళల రచనలు. న్యూఢిల్లీ: ఆక్స్ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్.
20. నంది, అశీష్. (1983). వలస పాలనలో స్వీయ గుర్తింపు. ఢిల్లీ: ఆక్స్ఫర్డ్.
21. ఆంధ్రప్రదేశ్ ఆర్కైవ్స్ విభాగం. (1985). ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమం. హైదరాబాద్.
22. తెలుగు విశ్వవిద్యాలయం. (2005). తెలుగు స్వాతంత్ర్య ఉద్యమ సాహిత్యం. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణలు.
23. విశాలాంధ్ర ప్రచురణ. (2000). స్వాతంత్ర్యోద్యమ సాహిత్య సంకలనం. విజయవాడ.
24. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. (1972). స్వాతంత్ర్య ఉద్యమ స్మారక గ్రంథం. హైదరాబాద్.
25. భారత చరిత్ర పరిశోధనా మండలి (ICHR). (1998). భారత స్వాతంత్ర్య ఉద్యమ అధ్యయనాలు. న్యూఢిల్లీ.

# ఇక చాలు....

డా. గోపాలకృష్ణ కొవ్వలి

బాపు, ఇక్ చాలు -----
నీ పేరు చెబితే ఓట్లు రావు
నీ పేర పెట్టిన పథకాలకు గుర్తింపు రాదు
వికటాట్టహాసపు నవ్వుల ముందు నీ బోసినవ్వులు
వెలవెలబోతున్నాయి
ఇక్ చాలు బాపు, నీకిక సెలవు

నీ పేరుకి విలువలేదు, నీత్యాగానికి గుర్తింపులేదు
నీ ఆదర్శాలకి ఆదరణ లేదు
నేతలు  మార్చే ఖరీదైన సూట్ల నీడలో  కొల్లాయికి
గతకాలపు మెరుపు  లేదు
మానవత్వం, సమానత్వం పదాలు సైతం కిట్టని
నాయకగణం నీ దేశానికి రామరాజ్యం తెచ్చే పనిలో
ఉన్నారు

స్వేచ్ఛకి సంకెళ్ళు, భావప్రకటనకి తాళాలు
రాగ, తాళ సహిత స్తుతులకి  అందలాలు
మతాలమధ్య చిచ్చు రాజేసే రాజ్యంలో
మత మౌఢ్యం ప్రవచించే మేధావుల మైదానం నీ దేశం
రామరాజ్యంలో కోతులు మారాయి
'మంచి వినకు, మంచి మాట్లాడకు, మంచి చూడకు'
అని నినదిస్తూ

నీ ఉనికిని సమాధి చేస్తాం నీ స్మృతికి గోరి కడతాం
స్వయం సేవకి పట్టం కడతాం, స్వరాజ్యానికి  నివాళులు ఇస్తాం
ఇక చాలు బాపు,  నీ మాటల, పాటల, ఆదర్శాల కీర్తనలు

పాడనీ నేతల స్వయంకృతులు,
మరుగున పడనీ వినపడని జన ఘోషలు

# స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగు సాహిత్యం పాత్ర

మెట్టు రవళి
9542847047

బ్రిటిష్ వారు తూర్పు ఇండియా కంపెనీ ద్వారా వ్యాపారనిమిత్తం భారతదేశంలో ప్రవేశించి భారతదేశంలో తమ సంస్థను ఏర్పాటు చేసుకొని దాదాపు రెండువందల సంవత్సరాల పాటు ఏకఛత్రాధిపత్యంగా తమపాలన కొనసాగుతున్న సమయంలో బ్రిటిష్‌వారి కాలంలో భారతీయులను బానిసల్లాగా మార్చారు. వారి ఆగడాలకు భరించ లేక బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయడానికి సైనికులు, సాధారణ ప్రజలు చేతివృత్తుల వారు తిరుగుబాటును కొనసాగించారు. వారితో పాటుగా తెలుగుసాహిత్యం తమదైన శైలిలో ఈ ఉద్యమంలో పాలుపంచుకుంది. సాహిత్యం అంటే 'మంచిని చేకూర్చేది' అని అర్థం వస్తుంది. సాహిత్యం ఆనాటి సామాజిక పరిస్థితులను కవులు తమ కలము ద్వారా రచనల ద్వారా ఆనాటి సమాజాన్ని చైతన్యం చేయడానికి తెలుగుసాహిత్యం ఉపయోగపడింది. సమాజానికి సాహిత్యానికి అవినాభావ సంబంధం ఉంది. భారతదేశంలో నివసిస్తున్న కోట్లమంది ప్రజలను ఏకతాటి పైకి తెచ్చి ప్రజలలో దేశభక్తి, స్వేచ్ఛ, సమానత్వం గురించి అవగాహన కల్పించడంలో తెలుగుసాహిత్యం ఒక శక్తివంతమైన సాధనంగా నిలిచింది. "రవి గాంచని చోట కవి గాంచును" అని రామరాజ భూషణుడు అన్నట్టుగా, ఎక్కడయితే సమస్య ఉద్భవిస్తుందో, అక్కడ ప్రజలను సంఘటితం చేయడానికి తెలుగుసాహిత్యం తోడ్పాటు అందించింది.

కవులు, రచయితలు రాసిన కవితలు, గీతాలు, నాటకాల ద్వారా బ్రిటిష్ వారిని విమర్శిస్తూ స్వరాజ్య ఆకాంక్షను ప్రజల్లోకి నింపారు. ఈ సాహిత్యం అహింస, స్వదేశీ ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చింది.

సాహిత్యం స్వాతంత్ర్యోద్యమంలో తెలుగువారి సహకారాన్ని గుర్తించేలా చేసింది. పాటలు, నాటకాలు ప్రజలను సంగ్రామ భాగస్వాములను మార్చాయి. దీని ద్వారా జాతీయ చైతన్యం వ్యాపించింది.

తెలుగుసాహిత్యం స్వాతంత్ర్యోద్యమ సందేశాన్ని పాటలు, కవితలు, నాటకాలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలలో వ్యాప్తి చేసింది. ఈ రచనలు సులభంగా గ్రహించబడే స్థానికభాషలో ఉండటం వల్ల గ్రామీణ ప్రజల వరకు చేరాయి.

**సాహిత్యం ద్వారా స్వదేశీ ఉద్యమం, అహింసా సందేశాలు వేగంగా వ్యాపించాయి. ప్రజలను సంఘర్షణకు ప్రేరేపించాయి.**

దేశ స్వాతంత్రోద్యమంలో తెలుగువారి పాత్ర ప్రముఖమైనది.అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, ఎన్జీ రంగా, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, టంగుటూరి ప్రకాశం పంతులు, తుర్రేబాజ్ ఖాన్, దుగ్గిరాల గోపాల కృష్ణయ్య, దుర్గాబాయి దేశ్ ముఖ్, బూర్గుల రామకృష్ణారావు, వావిలాల గోపాలకృష్ణయ్య, అభినవ సర్దార్ వల్లభాయ్ పటేల్, సర్దార్ గౌతు లచ్చన్నతో పాటుగా ఎంతోమంది తమ ప్రాణాలను లెక్కచేయకుండా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం జరిగింది.

త్రిపురనేని రామస్వామి చౌదరి రాసిన 'వీరగంధము తెచ్చినారము, వీరుడెవ్వడో తెల్పుడీ'వంటి గీతాలు స్వరాజ్యసాధన కసిని మరింత పెంచిందని కొనియాడారు. గరిమెళ్ల వారు రాసిన 'మాకొద్దీ తెల్లదొర తనము', రాయప్రోలు రాసిన

"ఏ దేశమేగినా ఎందుకాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరేమనినా
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపురా నీ జాతి నిండు గౌరవము"

సాహిత్యం ద్వారా స్వదేశీ ఉద్యమం, అహింసాసందేశాలు వేగంగా వ్యాపించాయి. ప్రజలను సంఘర్షణకు ప్రేరేపించాయి. ప్రచురణలు, దినపత్రికల్లో ప్రచారం దీని ప్రభావాన్ని మరింత పెంచింది. ఫలితంగా తెలుగుప్రాంతాల్లో ఉద్యమం బలపడింది. ఇవే కాకుండా నాటకాలు,

ఉపన్యాసాలు, జానపదకళారూపాల ప్రదర్శనల ద్వారా ప్రజలను ఉద్యమంలో భాగస్వామ్యం చేసాయి.

శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు పారిన భాగ్యసీమయి
వరలినది ఈ భరతఖండము
భక్తిపాడర తమ్ముడా!"
"వేదశాఖలు వెలిసెనిచ్చట
ఆది కావ్యం బలరే నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాదుసుమ్మిది చెల్లెలా!

ఈ విధంగా రాయప్రోలువారు అనేకగీతాలలో జాతీయభావాన్ని ప్రబోధిస్తూ ప్రజలలో అనూహ్యమైన విధంగా ఉద్వేగపూరిత చైతన్యాన్ని రగిలించారు. ఆ రోజులలో ఆంధ్రోద్యమ సమయంలో రాయప్రోలు వారి ఈ పద్యాలను శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు తన సహజ గంభీర ధోరణిలో పఠిస్తూ, ఆనాటి సామాన్య చక్కని ప్రజలను సైతం చైతన్యపూరితులను గావించడం ఆంధ్రుల చరిత్రలో చిరస్మరణీయంగా చెప్పుకోదగిన అంశము. కవులు తమ కలము ద్వారా రచనలద్వారా ఆనాటి సమాజాన్ని వారు చేసిన కృషిని తెలుసుకోవడానికి స్వాతంత్ర్యోద్యమ పరిస్థితులను ఇప్పుడు మనం తెలుసుకోవడానికి తెలుగుసాహిత్యం పాత్ర కీలకంగా పోషించింది.

శ్రీశ్రీ గారు రాసిన మహాప్రస్థానం వంటి రచనలు ఆనాటి సమాజములో శ్రీశ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) – ప్రజాకవిగా పేదల బాధలు, సామాజిక అసమానతలను చూపించి విప్లవాత్మక ఆలోచనలకు బీజం వేశారు. స్వాతంత్ర్య ఉద్యమంలో తెలుగుసాహిత్యం కీలకమైన పాత్రను పోషించింది. ప్రజల్లో జాతీయ చైతన్యం, దేశభక్తి, స్వేచ్ఛాభావనలను రగిలించడంలో సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనంగా నిలిచింది.

కాళోజీ నారాయణరావు గారు రాసిన, 'ఒక సిరాచుక్క లక్షమెదళ్ళకు కలయిక' అని అతని కలమునుండి జాలువారిన అంశాలు, ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, మానవహక్కులపై రచనలు చేశారు. 'ఇది నాగొడవ' అనే పుస్తకంలోని కవితలు ఆనాటి సమాజాన్ని ఆలోచింపచేసేలా ఉన్నాయి. 'ఆంధ్ర పత్రిక', 'కృష్ణాపత్రిక', 'స్వరాజ్యం'వంటి పత్రికలు స్వాతంత్ర్యోద్యమ భావాలను ప్రజల్లో

వ్యాప్తి చేసాయి. ఇవి రాజకీయ చైతన్యాన్ని పెంపొందించడంలో ప్రధానపాత్ర పోషించాయి.

వీధి నాటకాలు, దేశభక్తి గేయాలు ఉద్యమానికి ప్రజలను సమీకరించాయి. చదువుకోని ప్రజలకు కూడా స్వాతంత్ర్య సందేశాన్ని చేరవేశాయి. తెలుగు సాహిత్యం స్వాతంత్ర్యాన్ని కేవలం రాజకీయ స్వేచ్ఛగా కాకుండా, సామాజిక, మానసిక విముక్తిగా భావించింది. కులవ్యవస్థ, అజ్ఞానం, మూఢనమ్మకాలపై పోరాటం చేసింది.

ముగింపు

ఈ విధంగా తెలుగుసాహిత్యం స్వాతంత్ర్యోద్యమానికి ఆత్మగా నిలిచి, ప్రజల్లో చైతన్యం, ధైర్యం, త్యాగభావనలను నింపింది. రాజకీయ పోరాటానికి బలమైన భావోద్వేగ ఆధారాన్ని అందించింది.

# రచయితగా గాంధీజీ - ఒక పరిశీలన

డా. కె.జి. వేణు
9848070084

దేశ, విదేశాల్లో అవతార పురుషుడిగా కీర్తించబడుతున్న మహాత్మాగాంధీ సత్యాగ్రహి, స్వాతంత్ర్య సమరయోధుడు మాత్రమేకాదు, ఒక గొప్ప రచయిత కూడా. అనేక పుస్తకాల రచయితగా సుప్రసిద్ధులైన గాంధీజీ చాలావరకు సత్యం, అహింస, స్వదేశీ మీద రాసిన రచనలే ఎక్కువ. పుస్తకాలు రాయటానికి ముందు ప్రపంచంలోని అనేక భాషల్లో ప్రసిద్ధిచెందిన గ్రంథాలను ఆయన చదివారు, అంతేకాదు లోతుగా అధ్యయనం చేశారు. సమస్త విషయాల మీద సాధికారమైన పట్టు సాధించాకే ఆయన రచనలు చేయటం మొదలుపెట్టారు. తాను చదివిన గ్రంథ రచయితల ఎవరి శైలిని ఆయన అనుసరించలేదు. తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలిని తనకు తెలియకుండనే తాను ఏర్పరచుకున్నారు. భారతదేశంలో బ్రిటీషువారి తరుపున పనిచేసిన వైస్రాయిలు అందరూ గాంధీగారి రచనలను చాలా ఇష్టపడేవారు. ఆయన వాడిన ప్రామాణికమైన, సొగసైన ఇంగ్లీషు భాషను ఎంతగానో మెచ్చుకొనేవారు. ప్రతి రచనలోనూ సగటుమనిషి మనోభావాలు స్పష్టంగా కనిపించేవని. వందలకొలది విదేశీ రచయితల రచనలను గాంధీజీ జీర్ణించుకొని, ఆ పదప్రయోగాల స్థాయికి ఏమాత్రం తీసిపోకుండా తన రచనా ప్రవాహాన్ని కొనసాగించారని ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన ఆచార్య లూయిస్ రిచర్డ్సన్ ఎన్నో సందర్భాల్లో కొనియాడటం జరిగింది.

రచయితగా గాంధీజీ చేసిన మొట్టమొదటి ప్రయత్నం ఏమిటంటే ఇంగ్లండుకు వచ్చే భారతీయ యువకుల కోసం, వారి అవసరాల నిమిత్తం "లండన్ గైడ్" అన్న ఒక బుల్లెట్ ను ముద్రించారు. లండన్ చేరిన వాళ్లకు ఆ పుస్తకం ఎంతగానో వుపయోగపడింది. అక్కడి వసతులు, విద్యాలయాలు, ఫీజులు, వాతావరణ పరిస్థితులు, ఆహారపు ఇబ్బందులు, సహాయ, సహకారాలు పొందే విధానాలు, స్కాలర్ షిప్పులు మొదలైన సమస్త విషయాల

మీద సమగ్రమైన వివరాలతో ఈ పుస్తకం వెలువడింది. ఈ పుస్తకం ప్రచురించిన నెలరోజులకే రెండవ ముద్రణ చేయవలసి వచ్చింది. రచనలు చేస్తున్నప్పుడు కుడిచేతికి కాసేపు విశ్రాంతి ఇచ్చి, ఎడమ చేత్తో కొద్దిసేపు రాసేవారు. ఆ విధంగా రెండు చేతులతో వ్రాయగలిగిన సామర్థ్యం కలిగిన రచయిత గాంధీజీ. అలా రాయటం వలన తన రచనలను తొందరగా పూర్తి చేసేవారు. ప్రయాణాల్లో రచనలు చేయటం గాంధీజీకి అలవాటు. అలా రాసిన రచనే "ది థింగ్స్ ఫర్ యూత్ ". ప్రపంచ యువతను దృష్టిలో పెట్టుకొని రాసిన రచన ఇది. ఇప్పటికీ ఆ రచన యువతకు ఎన్నోమార్గదర్శక సూత్రాలను అందిస్తూనే వుంది. గాంధీజీ రచనలు ఎప్పుడు ప్రచురణకు వెళ్లినా ఆ రచనలో ఎలాంటి సవరణల అవసరం వచ్చేది కాదు.

**ఆయన తన జీవిత చరిత్రను గుజరాతీ భాషలో రాశారు. అందులోని ప్రత్యేకత ఏమిటంటే, ఆ రచన వెలువడిన తరువాత గుజరాతీ సాహిత్యంలో ముఖ్యంగా భాష వాడకంలో చాలా మార్పులు వచ్చాయి.**

ఒక భాషలోని విషయాన్ని మరొక భాషలోకి అనువాదం చేస్తున్నప్పుడు మూలగ్రంథంలోని భావానికి, పదాల ప్రయోగానికి ధీటుగా అనువాదంలో కూడా ఆ స్థాయిని కొనసాగించేవాడు గాంధీజీ. ముఖ్యంగా ఇంగ్లీషు రచనల్ని గుజరాతీ భాషలోకి అనువాదం చేస్తున్నప్పుడు ఆ సమతూకాన్ని తన రచనల్లో తప్పకుండా పాటించేవారు. "స్టోరీ ఆఫ్ సత్యాగ్రహి" అన్న గ్రంథాన్ని పరిశీలిస్తే ఈ విషయం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ప్లాటో రచించిన "డిఫెన్స్ అండ్ డెత్" రచనకు ఉన్నది ఉన్నట్లు కాకుండా అదే విషయాన్ని తన స్వతంత్రభావాలతో, అనుభవాలతో అద్భుతంగా రచించారు గాంధీజీ. ఆయన జైలులో వున్నప్పుడు సుప్రసిద్ధ భారతీయ కవులు రాసిన కవిత్వాన్ని అనువదించారు. ఆయన తన జీవిత చరిత్రను గుజరాతీ భాషలో రాశారు. అందులోని ప్రత్యేకత ఏమిటంటే, ఆ రచన వెలువడిన తరువాత గుజరాతీ సాహిత్యంలో ముఖ్యంగా భాష వాడకంలో చాలా మార్పులు వచ్చాయి. తన రచనలో గాంధీజీ ముఖ్యంగా ప్రజల వాడుక భాషను వాడారు. దానివల్ల ఆ రచన ప్రతి సామాన్యుడికి బాగా దగ్గరయింది. ఆ తరువాత రచయితలు చాలామంది ఆ పద్ధతినే అనుసరిస్తూ రచనలు చేశారు. ఆ రచనలో గాంధీ

తన తల్లిదండ్రులను, భార్యను, స్నేహితులను పరిచయం చేసిన విధానం పాఠకుల్ని విపరీతంగా ఆకర్షిస్తుంది. వాళ్లతో తన జీవితం పెనవేసుకున్న సందర్భాలను చాలా ఆసక్తి కలిగించేలా రచించారు ఆయన. కొన్ని సన్నివేశాల్లో నాటకీయత తారాస్థాయికి చేరుతుంది. దీనివల్ల నాటక రచనల అధ్యయనం గాంధీజీ ఎంత లోతుగా చేశారో అర్థమవుతుంది. ఈ గ్రంథం, ఆ తరువాత అన్ని భారతీయ భాషల్లోకి అనువాదం గావించబడింది. ఆయన రచనల్లో ముఖ్యంగా సత్యం, అహింస, మానవత ప్రధాన పీఠం వేసుకొనేవి. ఏ రచన కూడా ఎడారిలోని ఎండమావుల్లా కాకుండా గల, గల పారే సెలయేరులా వుండేది. గాంధీజీ వ్రాసిన ప్రతి రచన తాను కదులుతూ, పాఠకుల్ని కూడా కదిలించేది, ఆలోచింపజేసేది, చైతన్యదిశగా నడిపించేది.

"కళ – కళ కోసమే" అన్న నినాదానికి పూర్తి వ్యతిరేకి గాంధీజీ. కళ ప్రజల కోసం, ప్రజల చైతన్యం కోసం, ప్రజల వికాసం కోసమని అనేక రచనలు చేశారు.

"కళ – కళ కోసమే" అన్న నినాదానికి పూర్తి వ్యతిరేకి గాంధీజీ. కళ ప్రజల కోసం, ప్రజల చైతన్యం కోసం, ప్రజల వికాసం కోసమని అనేక రచనలు చేశారు. గుజరాత్లో సుప్రసిద్ధులైన స్త్రీ మూర్తుల గురించి చాలా రచనలు చేశారు. అలాగే గుజరాతీ మహానుభావులు గురించి కూడా కొన్ని రచనలు చేశారు. గాంధీజీ రచనల్లో సుప్రసిద్ధమైన మరో రచన "రామ్ చంద్ భాయ్ జీవితచరిత్ర". రామ్ చంద్ భాయ్ గొప్ప తత్వవేత్త అంతేకాదు ఆయన గొప్ప గుజరాతీ కవి కూడా. రామ్ చంద్ భాయ్ జీవిత చరిత్ర రాసేముందు, రామ్ చంద్ భాయ్ పుట్టిన ఊరును, చిన్నతనంలో ఆయన ఆడుకున్న ఆటస్థలాలను, చదువుకున్న పాఠశాలను, అతడి కుటుంబ వారసులను, ఆ పూర్తి చరిత్ర తెలిసిన ఎంతోమంది మేధావులను కలుసుకొని ఎన్నో విషయాలను సేకరించి, కొన్ని నెలల అధ్యయనం తరువాత రామ్ చంద్ భాయ్ జీవితచరిత్రను రాయటం మొదలుపెట్టాడట. ఈ విధానం భవిష్యత్తు లో ఎంతోమంది రచయితలకు మార్గదర్శకమైంది.

"వెస్టర్న్ కాన్సెప్ట్ మూలాలలో నుంచే సత్యం పుట్టిందని అప్పట్లో లార్డ్ కర్జన్ చేసిన ఒక ప్రకటన గాంధీజీకి చాలా కోపం తెప్పించింది. దాన్ని తీవ్రంగా

ఖండిస్తూ సత్యానికి మూలాలు భారతదేశంలోనే వేదాలు మొదలుకొని ప్రాచీన రామాయణ, మహాభారతల్లో ఏ విధంగా వున్నాయో సోదాహరణంగా వివరిస్తూ గాంధీజీ ఒక గొప్ప రచన చేసి లార్డ్ కర్జన్ కు పంపించారట. ఆ గ్రంథాన్ని చదివిన లార్డ్ కర్జన్ మత్తుదిగి, నిజం తెలుసుకొని తన అవివేకానికి, అజ్ఞానానికి సిగ్గుపడి, గాంధీజీ చెప్పిందే వాస్తవమని, తన ప్రకటన తప్పని వొప్పుకున్నాడట. అప్పట్లో ఈ వార్త దేశంలో పెద్ద సంచలనం సృష్టించింది. రచయితగా గాంధీజీ కలం ఎంత శక్తివంతమైనదో నిరూపించిన సంఘటన ఇది.

గాంధీజీ తన బాల్యంనుంచి, 1921 వరకు తన జీవితంతో ముడివడిన అనేక సత్యాలను, సందర్భాలను వివరిస్తూ, సాంఘికంగా, ఆధ్యాత్మికంగా తన జీవితం అనుభవించిన పరిణామాలను, సూత్రాలను పరిచయం చేస్తూ 'ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్పెరిమెంట్స్ విత్ ట్రూత్' గ్రంథంలో 150 పైగా వ్యాసాలను రచించటం జరిగింది. పాఠకులను సమ్మో హనపరిచి, గుజరాతీ భాషలోవ్రాయబడిన ఈ రచన 1925 నుండి 1929 వరకు 'నవజీవన్' వారపత్రికలో ధారావాహికంగా ప్రచురించబడింది. ఆ తరువాత ఈ గ్రంథం మహాదేవదేశాయ్ చేత ఆంగ్లంలోకి అనుదించబడి, 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రచురించబడింది. 1909లో 'హింద్ స్వరాజ్' పుస్తకాన్ని రచించారు. బ్రిటీషు పాలనకు చరమగీతంపాడే దిశగా ఈ రచన కొనసాగుతుంది. స్వారాజ్యస్థాపన దృశ్యాలను ఈ గ్రంథం మనముందు వుంచుతుంది. దాస్య శృంఖలాలు త్రెంచుకున్న భారతాన్ని గూర్చి తన కలలను 'ఇండియా ఆఫ్ మై డ్రీమ్స్' గ్రంథంలో వివరిస్తారు. గ్రామ పంచాయితీల ద్వారా సాంఘిక, ఆర్థిక, రాజకీయ శక్తులను ఎలా బలోపేతం చేయవచ్చునో వివరిస్తూ వ్రాసిన గ్రంథమే 'విలేజ్ స్వరాజ్'. సమాజంలో ఒక మనిషి స్వయంసమృద్ధి సాధించటానికి ఏర్పరచుకోవలసిన కార్యక్రమాలను గురించి, సమస్యల పరిష్కారంలో నిర్మాణాత్మక ఎత్తుగడల రూపకల్పనల గురించి తెలియజేసే పుస్తకం 'కన్ స్ట్రక్టివ్ ప్రోగ్రాం– ఇట్స్ మీనింగ్ అండ్ ప్లేస్'.

పైన వివరించిన గ్రంథాలే కాకుండా గాంధీజీ రచనల్లో ముఖ్యమైనవి: 'సత్యాగ్రహ ఇన్ సౌత్ ఆఫ్రికా', 'ది ఎస్సెన్షియల్ గాంధీ', 'ది వర్డ్స్ ఆఫ్ గాంధీ', 'దివే టు గాడ్', 'ది మైండ్ ఆఫ్ మహాత్మాగాంధీ', 'భగవద్గీత' ఇలా ఎన్నో గ్రంథాలను ఆయన రచించారు. ఒక రచయితగా, ప్రింటర్ గా, పబ్లిషర్ గా, సంపాదకుడిగా, జర్నలిస్టుగా ఆయా రంగాలలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన అవతారమూర్తి, మన జాతిపిత మహాత్మాగాంధీ. ఆయన ఎప్పటికీ అన్నిరంగాలలో ప్రపంచానికి ఆదర్శప్రాయుడే.

# బతుకమ్మ పండుగ పాటలు - తెలంగాణ జానపదుల జ్ఞానపరంపర

శ్రీ కర్నె మల్లికార్జున్
63037442369

బతుకమ్మ పండుగ తెలంగాణ స్త్రీలకు బతుకునిచ్చిన అమ్మగా భావించి కొలుస్తారు. బతుకమ్మ పండుగ సమయంలో స్త్రీలు పాడే పాటలలో, స్త్రీలు ఆడే ఆటలలో ఉండే జ్ఞాన పరంపర ఒకతరం నుండి ఇంకోతరానికి అందించిన వారధి ఈ బతుకమ్మ పండుగ. ఈ పండుగ బతుకును నేర్పించింది, ఉద్యమస్ఫూర్తిని నేర్పించింది. బతుకమ్మ పూల పండుగ, స్త్రీల పండుగ. ఊరిలో ఉన్న పిల్లాజెల్లా, ముసలీముతకా, యువతీయువకులు ఈ బతుకమ్మ సంబురంలో పాల్గొంటారు. బతుకమ్మ పండుగ కుటుంబ జీవనవిధానాన్ని వ్యక్తం చేసే అ'ద్వితీయ'మైన పండుగ. స్త్రీలు తమ భర్తలు నిండునూరేళ్ళు సుఖంగా జీవించాలని గౌరమ్మను బతుకమ్మగా భావించి పుజిస్తారు.



బతుకమ్మ 9 రోజుల ముందు బొడ్డెమ్మ పండుగను నిర్వహిస్తారు. బొడ్డెమ్మ పండుగను పెళ్లికాని యువతులు మంచి భర్త లభించాలని నిర్వహిస్తారు. వెరసి రెండు పండగలు పురుషుడి ఆయుష్షు, ఆరోగ్యం బాగుండాలని స్త్రీలు చేసే పండుగలు. ఈ బతుకమ్మ పండుగలో కుటుంబ జీవనవిలువలే ప్రాధాన్యంగా కనిపిస్తాయి. ప్రకృతంతా పరవశించే ఈ పండుగ, ప్రకృతికి బతుకమ్మ ప్రతిరూపంగా భావించి పూలతో పూజిస్తారు. ఈ బతుకమ్మ పాటలు, ఆటలు, సంస్కృతి, సంప్రదాయం, భాష మొదలైన విషయాలు ఎక్కడా

లిఖించబడలేదు. కేవలం జానపదుల మౌఖికసాహిత్యంలో భాగంగా, విభిన్న పాఠాంతరాల సమన్వయం జరిగి తరతరాల ఆస్తిగా ఒక తరం నుండి మరో తరానికి అందించబడిన తెలంగాణ ప్రజల ఆస్తి బతుకమ్మ పండుగ. బతుకమ్మ పాటలలో స్త్రీ పురుష జీవనం ప్రతిబింబిస్తుంది. ముఖ్యంగా ఈ పాటలలో వ్యవసాయం, కుటుంబ జీవనం, దుస్తులు, జానపదుల నమ్మకాలు, ఆహారం, పనిముట్లు, ఆటలు మొదలైన విషయాలను ముందు తరాలవారికి వాటిలో ఉన్న జ్ఞానాన్ని అందించే విధంగా జానపదులు పాటలను అల్లారు.

**ఈ బతుకమ్మ పండుగ సందర్భంలో ఇతిహాస, పురాణాలకు సంబంధించిన పాటలను పరిచయం చేసుకుందాం.**

బతుకమ్మ పాటలలో సంస్కృతీ, సంప్రదాయాలు: మానవుడు పుట్టినప్పటినుండి పెరుగుతున్న క్రమంలో ఎన్నో అనుభవాల సారం ద్వారా కొన్ని కొత్త అలవాట్లను, కొత్త నియమాలను, కట్టుబాట్లను, ఆచారసంప్రదాయాలను ఏర్పరుచుకుంటాడు. వాటిద్వారా కొంత జ్ఞానాన్ని సంపాదించి, ఆ జ్ఞానాన్ని ముందుతరాల వారికి అందించే ప్రయత్నం చేశాడు మానవుడు. అలాంటి ప్రయత్నంలో తెలంగాణ జానపదులు బతుకమ్మ పాటలలో ముందు తరాల వారికి చాల చక్కటి జ్ఞానాన్ని అందించే ప్రయత్నం చేశారు.

పురాణ, ఇతిహాస జ్ఞానం: జానపదులు నోటినుండి ఎంతటి సామాన్య విషయం వచ్చినా, దాని వెనకాల ఎంతో నిగూఢమైన అర్థం దాగి ఉంటుంది. జానపదులు రామాయణ, భారత, పురాణ విషయాలను ఒకతరం నుండి మరో తరానికి మౌఖికంగా ప్రచారం చేస్తూ అందించిన ఆస్తులు. పురాణాలలో జరిగిన కొన్ని విషయాలను, ఘట్టాలను ప్రతీకలుగా తీసుకొని వాటిని నిత్యజీవితంతో సమన్వయం చేస్తూ సామెతలు, జాతీయాలు, పాటలు అల్లుకున్నారు జానపదులు. ఈ బతుకమ్మ పండుగ సందర్భంలో ఇతిహాస, పురాణాలకు సంబంధించిన పాటలను పరిచయం చేసుకుందాం. గృహజీవితంలో అందరికీ రాముడు ఆదర్శం. రాముడి పేరు తలవకుండా బతుకమ్మ మొదలే పెట్టారు స్త్రీలు. "రామరామరామ ఉయ్యాలో – శ్రీ రామరామ ఉయ్యాలో... అంటూ రాముడిని తలచిన తరువాతనే మిగతా పాటలు ఆటలు

దుష్టపాత్రల నుండి గుణపాఠం నేర్పుతూ, మంచిపాత్రల ద్వారా మానవవ్యక్తిత్వాన్ని నేర్చుకునే విధంగా పాటలను కడుతారు.

ప్రారంభిస్తారు. శ్రీరామ కథను బతుకమ్మ పాటలో పాడేప్పుడు మొదటిపాదంలో ప్రశ్న వేసుకొని, దానికి రెండోపాదం సమాధానం అయ్యేలాగ పాడుకుంటారు. ఈ పాటలలో ఒక ఘట్టాన్ని ఒక్కో పాదంగా, ఒక కాండను పది నుండి పదిహేను పాదాలలో పూర్తిచేస్తారు. "శివధనస్సును వారు ఉయ్యాలో – చిటికెలో విరిచిరి ఉయ్యాలో" రాముడు శివధనస్సును విరిచే గట్టాన్ని ఒకే పాదంలో చెప్పారు. సీతాపహరణ సన్నివేశంలో "భిక్షంబు పెట్టమని ఉయ్యాలో – బిగ్గరగా అరిచే ఉయ్యాలో / భిక్ష పట్టుకొని ఉయ్యాలో – బయిలెల్లె సీత ఉయ్యాలో / వచ్చి నిలువగానె ఉయ్యాలో – పిచ్చిరావణబ్రహ్మ ఉయ్యాలో / సీతమ్మ నెత్తుకా ఉయ్యాలో – రథమునెక్కించె ఉయ్యాలో..." ఈ విధంగా సుదీర్ఘ సన్నివేశాన్ని కూడా సంక్షిప్తంగా వాక్యాలుగా మలుస్తారు. దుష్టపాత్రల నుండి గుణపాఠం నేర్పుతూ, మంచిపాత్రల ద్వారా మానవవ్యక్తిత్వాన్ని నేర్చుకునే విధంగా పాటలను కడుతారు. కొన్ని పాటలను హాస్యంగా కూడా మలుచుకుంటారు. లక్ష్మణదేవర నవ్వు, ఊర్మిళాదేవి నిద్ర మొదలైన ఘట్టాలను హాస్యంలో నీతిని భోదిస్తూ పాడుకుంటారు. మహాభారతానికి సంబంధించి మూలంలో ఉన్న విషయాలకు జానపదులు చాల విషయాలు కల్పించి పాడుకునే పాటలు ఉంటాయి. భారతంలో జరిగిన అన్నదమ్ముల వైరం, యుద్ధనీతి, స్త్రీల ప్రాముఖ్యతకు సంబంధించిన చాల విషయాల గూర్చి పాటలు అల్లుకున్నారు. "రామరామ రామ ఉయ్యాలో – శ్రీ రామరామ ఉయ్యాలో / అయ్యొయ్యొ రామ ఉయ్యాలో – అయోధ్యరామ ఉయ్యాలో / నరనారాయణులకు ఉయ్యాలో – జరిగిన యుద్ధంబు ఉయ్యాలో / అనువుగా చెప్పెదా ఉయ్యాలో – ఆలకించుడి మీరు ఉయ్యాలో / ద్వాపర యుగములో ఉయ్యాలో – ధరణి శ్రీ కృష్ణుండు ఉయ్యాలో / తన సతులతో కూడి ఉయ్యాలో – సంతోషమూ తోడ ఉయ్యాలో..... భారత కథను మొదలుపెట్టి కురుపాండవ యుద్ధం వరకు భారతాన్ని చెబుతారు. మనిషి వ్యక్తిత్వవికాసానికి సంబంధించిన విషయాలను ఈ కథలో ఏరికోరి బోధిస్తారు.

వ్యవసాయం: తెలంగాణ ప్రజలు వ్యవసాయంలో ఉండే కష్టనష్టాల గురించి, సాధకబాధకాల గురించి, పని చేసేటప్పుడు అలుపు రాకుండా, బరువులు ఎత్తేటప్పుడు ఉత్సాహం కోసం, పనిలో అందరినీ ఐక్యతగా ముందుకు తీసుకెళ్లడం కోసం ఇలా ప్రతీ పనిలోనూ జానపదులు పాటలను అల్లుకొని వారి కష్టాన్ని మరిచిపోతూ, పనిలో లగ్నం అవుతారు. "కొత్త బాయికాడ ఉయ్యాలో – వారి శేన్లుండే ఉయ్యాలో/ అప్పుడు కదాను ఉయ్యాలో – మల్లమ్మ నయితే ఉయ్యాలో.../ పది మందికి ఉయ్యాలో – మునుమూలైన ఉయ్యాలో/ మునుమూలైన ఉయ్యాలో – పట్టి ఇచ్చినాది ఉయ్యాలో..." ఈ పాటలో వరికోతలో ఒక వ్యక్తి నాయకత్వం వహించి పదిమంది కూలీలను ఎలా పనిలో ముందుకు నడిపించిందో అన్న విషయాన్ని చాల చాకచాక్యంగా చెప్పారు. వ్యవసాయ ఎద్దుల గురించి, ఎద్దుల బండి గూర్చి, పాడి పశువుల గురించి కూడా పాటల్లో అల్లుకుని పాడుతుంటారు. "ఆ బండి నడిచేటి ఉయ్యాలో – ఎడ్ల పేరేమిటిటే ఉయ్యాలో/ నడుములూ సక్కనా ఉయ్యాలో – నాగభూతా ఎడ్లు ఉయ్యాలో/ కొమ్ములూ సక్కనా ఉయ్యాలో – కోడెభూత ఎడ్లు ఉయ్యాలో/ మడిమలు సక్కనా ఉయ్యాలో – మాయభూతా ఎడ్లు ఉయ్యాలో....." అంటూ ఎడ్ల వర్ణన చేస్తారు. ఏ లక్షణాలు కలిగివుంటే ఎడ్లు ఇంటికి మంచిది? పాడిపశువులను ఏ వారంలో కొనాలి? వాటి పనితనం కొనేముందు ఎలాంటి ఆనవాలతో గుర్తిస్తారు? అన్న అంశాలను కూడా బతుకమ్మ పాటల్లో నిక్షిప్తం చేసి పాడుతారు.

సమాజంలో వ్యక్తి పాత్ర, వ్యక్తిగా సమాజంలో ఎలా జీవించాలి? అన్న విషయాలను బతుకమ్మ పాటల రూపంలో వ్యక్తం చేశారు.

సమాజ నీతి: ఇప్పుడు మనం చూస్తున్న నాగరికత అభివృద్ధి కావడానికి పూర్వం పెద్దలు ఏర్పరచిన సంఘ జీవనమే ప్రధాన కారణం. సమాజంలో వ్యక్తి పాత్ర, వ్యక్తిగా సమాజంలో ఎలా జీవించాలి? అన్న విషయాలను బతుకమ్మ పాటల రూపంలో వ్యక్తం చేశారు. స్త్రీకి పతివ్రతాధర్మాలను బోధిస్తూ, "శ్రీకరంబై నట్టి ఉయ్యాలో – స్త్రీ ధర్మములు కొన్ని ఉయ్యాలో..... /నీతి దప్పగరాదు ఉయ్యాలో – నిందింపగ రాదు ఉయ్యాలో/ శాస్త్ర ధర్మంబులు ఉయ్యాలో – పాడు వించగరాదు ఉయ్యాలో/ పెద్దలూ చెప్పినా

ఉయ్యాలో / బుద్ధితప్పగరాదు ఉయ్యాలో... /ఓర్పు కలిగిన వారు ఉయ్యాలో – ఉత్తమ కాంతలు ఉయ్యాలో..." అంటూ స్త్రీలు తమ జీవితంలో పాటించవలసిన ధర్మాలను పాటలో పొందుపరిచారు. అట్లాగే స్త్రీ సమాజంలో ఎలా మెలగాలి అని చెప్పడానికి "తోటివారలతోడ ఉయ్యాలో – కూడియుండుట మేలు ఉయ్యాలో / కలహించుకోరాదు ఉయ్యాలో – కాంతలు తమలోన ఉయ్యాలో..." అంటూ సమాజంలో పాటించవలసిన నియమాలు పొందుపరిచారు. స్త్రీలకు విద్య ద్వారా నీతినియమాలను నేర్చుకోవాలని చెబుతూ, "సఖియలారా మనము ఉయ్యాలో – సాధారణముగా ఉయ్యాలో..../ విద్య నేర్చితిననుచు ఉయ్యాలో – విర్రవీగరాదు ఉయ్యాలో / విద్యకూ తగినంత ఉయ్యాలో – వినయముండిన మేలు ఉయ్యాలో .../సక్కదన మున్నదని ఉయ్యాలో – నిక్కితిరుగరాదు ఉయ్యాలో..." అంటూ విద్య నేర్చుకుంటే స్త్రీసమాజంలో ఉత్తమస్థానాన్ని పొందాలి కానీ అధమస్థానంలో ఉండకూడదని ఈ పాట ద్వారా తెలియజేశారు.

**కుటుంబం ఏర్పడినప్పుడు మనిషి సంచార జీవితానికి స్వస్తి పలికాడు. కుటుంబ జీవితాన్ని ఎలాంటి విలువలతో గడపాలి?**

కుటుంబ జీవన నీతి: ఒక మంచి కుటుంబం, ఒక మంచి సమాజాన్ని ఏర్పరుస్తుంది. ఈ మానవుని నాగరికత నైతిక విలువలతో మొదలవ్వడానికి ప్రధాన కారణం భారతీయ కుటుంబ జీవనవిధానం. కుటుంబం ఏర్పడినప్పుడు మనిషి సంచార జీవితానికి స్వస్తి పలికాడు. కుటుంబ జీవితాన్ని ఎలాంటి విలువలతో గడపాలి? బంధం, బంధుత్వం అనే అంశాలలో మనిషి పాత్ర ఎలాంటిది? సంసార జీవితంలో ఒక మనిషి పాత్ర మారుతూ ఉంటుంది. ఏ వ్యక్తితో ఎలా ప్రవర్తించాలి? కుటుంబ జీవనవిధానంలో మనవంతు పాత్ర ఏమిటి? అన్న విషయాలతో పాటు కుటుంబ సంసార జీవితంలో కష్టసుఖాలు, సంబధ బాంధవ్యాల విలువలను బతుకమ్మ పాటల రూపంలో చొప్పించి ముందు తరాల వారికి అందించారు. పెళ్ళయిన స్త్రీ పుట్టింటికి వచ్చినప్పుడు తన తల్లి, తండ్రి, అన్న, వదినల మమకారం ఏ విధంగా ఉంటుందో చెబుతూ "చిలుకా తిన్నాపండు ఉయ్యాలో – సిద్దించగారాదు ఉయ్యాలో / అమ్మ నీ కోడలితో ఉయ్యాలో – వడ్డించగారాదు ఉయ్యాలో /

వడ్డించు కోడలుతో ఉయ్యాలో – మాట పడరాదు ఉయ్యాలో / మాటపడి పుట్టింట్లో ఉయ్యాలో – మరి ఉండరాదు ఉయ్యాలో... అంటూ కూతురు అలిగితే పుట్టింటి వారు అది కొనిస్తా, ఇది కొనిస్తా అంటూ కూతురిని బ్రతిమాలి ప్రేమ చూపించడాన్ని ఈ పాటలో చూస్తాం. అన్నాచెల్లెలు అనుబంధం చెబుతూ "సూర్యుడూ చంద్రుడూ ఉయ్యాలో – చుట్టమై వచ్చిరీ ఉయ్యాలో / మాకు మా అన్నలు ఉయ్యాలో – బలగమై వచ్చిరీ ఉయ్యాలో.... అంటూ అన్నాచెల్లెలు అనుబంధాన్ని వివరిస్తారు.

**సైన్స్‌కు అందని ఎన్నో విషయాలు జానపదుల నమ్మకాల్లో వ్యక్తం అవుతుంటాయి.**

దుస్తులు: జానపదులు ధరించే దుస్తులలో కూడా శాస్త్రీయమైన అంశాలు ఉంటాయి. వారు ఏ దుస్తులు ఎలా ధరించాలన్న విషయాలతో పాటు, దుస్తులు ధరించే స్త్రీల అందాన్ని వర్ణనాత్మకంగా పాటలలో పొందుపరిచారు. అట్లాగే నేతన్నల పనితనాన్ని చెబుతూ "చింతక్రింది శాలీలు ఉయ్యాలో – చిన్న శాలీలు ఉయ్యాలో / చిగురంతాదూసి ఉయ్యాలో – చీరేనేసిందు ఉయ్యాలో / కట్టుకొంగుకు రెండు ఉయ్యాలో – కడువలు దించిందు ఉయ్యాలో.... అంటూ ఒక్కొక చీరలో ఉన్న ప్రత్యేకతల గూర్చి పొందుపరిచారు.

జానపదుల నమ్మకం: జానపదులలో నమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే విద్యాగంధం తక్కువగా ఉంటుంది. కానీ వారి నమ్మకాలలో శాస్త్రీయమైన అంశాలు దాగి ఉంటాయి. సైన్స్‌కు అందని ఎన్నో విషయాలు జానపదుల నమ్మకాల్లో వ్యక్తం అవుతుంటాయి. బతుకమ్మ పాటలలో జానపదుల నమ్మకాలకు సంబంధించిన విషయాలు కొన్ని మనకు కనబడుతుంటాయి. బతుకమ్మ పండుగలో ఎల్లమ్మ పాట విరివిగా వినిపిస్తుంటుంది. తన భర్త జమదగ్నికి అపాయం పొంచి ఉందని తనకు ఎదురైన శకునాల ఆధారంగా "మల్లె వృక్షంబులు ఉయ్యాలో – వాడిపోయినాయి ఉయ్యాలో / నొష్టిదీ కుంకుమా ఉయ్యాలో – చెదిరి పోయింది ఉయ్యాలో / చేతికి గాజులు ఉయ్యాలో – చెదిరి పోయినాయి ఉయ్యాలో / కాళ్ళకున్నా మట్టె ఉయ్యాలో – నొక్కు పోయినాది ఉయ్యాలో" అంటూ పై శకునాలు ఎదురైతే ప్రమాదం పొంచి ఉందనడానికి సూచనగా జానపదులు భావిస్తారు. భిక్ష వేసే సందర్భంలో "పిలిచి భిక్షం పెడితే ఉయ్యాలో – బిడ్డపుడుతదయ్య ఉయ్యాలో / కోరి భిక్షం పెడితే ఉయ్యాలో – కొడుకు పుడుతడయ్య ఉయ్యాలో..." పరులకు ఎంత

దానం చేస్తే, తిరిగి మనకు అంతే పుణ్యం లభిస్తుందని జానపదుల నమ్మకం.

**తెలుగు జానపదుల ఆహారపు అలవాట్లు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. అందులో తెలంగాణ ప్రాంతపు అలవాట్లు ఇంకా భిన్నంగా ఉంటాయి.**

ఆభరణాలు: అలంకరణ అనేది ప్రాచీన కాలంలో స్త్రీ, పురుషులకు యోగ్యమైన విషయం. ప్రస్తుతకాలంలో అలంకరణ కేవలం స్త్రీకి పరిమితం అయ్యింది. జానపదులు ధరించే వస్త్రాలు, ఆభరణాలు, పచ్చబొట్టు మొదలైన అన్ని విషయాలలోనూ శాస్త్రానికి సంబంధించిన విషయాలు ఉన్నాయి. కాలానుగుణంగా ఆభరణాల తీరు మారుతూ వచ్చింది. గౌరమ్మ (దేవత) ధరించిన ఆభరణాలను తన భర్త మీద ప్రేమను వ్యక్తం చేసేలా "ఆకశమందునా ఉయ్యాలో – అల్లెను మేఘములు ఉయ్యాలో.../ పతిభక్తియే మీకు ఉయ్యాలో – పచ్చలా పతకంబు ఉయ్యాలో/ నాధునిపై ప్రేమ ఉయ్యాలో – నడుముకూ వడ్డాణము ఉయ్యాలో/ అత్తమామల సేవ ఉయ్యాలో – అందెలూ గాజులు ఉయ్యాలో/ కష్టము లోర్చుటే ఉయ్యాలో – కంకణము శాకట్లు...." అంటూ స్త్రీకి ఏవి నిజమైన ఆభరణములు భర్తపై ప్రేమ, అత్తమామ కుటుంబంపై ప్రేమే నిజమైన స్త్రీ ఆభరణాలు అని బతుకమ్మ పాటల్లో వ్యక్తం చేశారు.

ఆహారం: తెలుగు జానపదుల ఆహారపు అలవాట్లు చాలా ప్రత్యేకంగా ఉంటాయి. అందులో తెలంగాణ ప్రాంతపు అలవాట్లు ఇంకా భిన్నంగా ఉంటాయి. ఆహారానికి సంబంధించిన కొన్ని విషయాలను బతుకమ్మ పాటల్లో అక్కడక్కడ ప్రస్తావించారు. "ముప్పయిఏడు కూరలు ఉయ్యాలో – ములగపూలాచారు ఉయ్యాలో/ డెబ్బయిఏడు కూరలు ఉయ్యాలో – దేవనాలా పెరుగు ఉయ్యాలో/ అరవై ఏడు కూరలు ఉయ్యాలో – అల్లపూ పచ్చడి ఉయ్యాలో/ వంటను తయారు ఉయ్యాలో – తల్లి చేసీనాది ఉయ్యాలో..." అంటూ వంటలలో కూరల రకాల ప్రస్తావించారు. "రమ్ము ప్రాణనాథా ఉయ్యాలో – భోజనంబు చేద్దాము ఉయ్యాలో/ అప్పాలు వడియాలు ఉయ్యాలో – ఆకుకూరలయ్య ఉయ్యాలో/ నవకోటి రుచులు ఉయ్యాలో – భోజనంబు చేసినా ఉయ్యాలో..." బతుకమ్మ పండుగలో పిండి వంటకాలకు సంబంధించిన విశేషాంశాలు చాలానే ఉన్నాయి.

పనిముట్లు: తెలంగాణ జానపదులు వారివారి వృత్తులకనుగుణంగా పనులు చేసుకుంటూ, ఆ పనికి అవసరమయ్యే ప్రతి పనిముట్టును ఒక ఆయుధంగా భావించే అలవాటు ఉంటుంది. ఆ వస్తువుపై మమకారం కూడా పెంచుకుంటారు. వాటిని దైవంగా భావిస్తూ వాటికి పూజలు కూడా చేస్తుంటారు జానపదులు. "నా కొడుకు రారా ఉయ్యాలో – ఉప్పరివాడ ఉయ్యాలో / ఒంటి స్తంభము ఉయ్యాలో – మాలు కట్టవాలె ఉయ్యాలో / ఉప్పురోళ్ళు అయితే ఉయ్యాలో – ఏమీ చెప్పినారు ఉయ్యాలో / గడ్డపార లయితే ఉయ్యాలో – మాకు ఇయ్యి రాజ ఉయ్యాలో..." అంటూ వారు వాడే పనిముట్లను ప్రస్తావిస్తారు బతుకమ్మ పాటల్లో.

**తెలంగాణ జానపదులు దైనందిన జీవితంలో చేసిన కష్టాన్ని మరవడం కోసం వినోద కార్యక్రమాలలో భాగంగా కొన్ని ఆటలు ఆడుతుంటారు.**

ఆటలు: తెలంగాణ జానపదులు దైనందిన జీవితంలో చేసిన కష్టాన్ని మరవడం కోసం వినోద కార్యక్రమాలలో భాగంగా కొన్ని ఆటలు ఆడుతుంటారు. బాల్యం నుండి పెద్ద వయసు వారి వరకు ఈ ఆటలలో పాల్గొంటారు. కచ్చకాయలు, నేలబండ, తొక్కుడుబిళ్ల, పులి–మేక, కాసేపుల్ల ఆట, బారాకట్ట, వెన్నెల కుప్పలు, చిర్రగోనె, చెమ్మాచెక్క, దాల్గడి మొదలైన ఆటలను బతుకమ్మ పాటల్లో ప్రస్తావిస్తారు. "అద్దన్న పడవిలో ఉయ్యాలో – అది పర్ణశాల ఉయ్యాలో / ఆ పర్ణశాలలో ఉయ్యాలో – రాముడు సీతమ్మ ఉయ్యాలో / రాముడు సీతమ్మ ఉయ్యాలో – జూతమాడంగా ఉయ్యాలో...." అంటూ రాముడు, సీత ఏకాంతంలో జూదం ఆట ఆడటాన్ని పాటలో వ్యక్తం చేశారు. ఎల్లమ్మ పాటలో బొంగరాల ఆట ప్రస్తావన "బడిలోపల బాలలు ఉయ్యాలో – బడి ఇడిసినంకను ఉయ్యాలో.../ నను గన్న తల్లి ఉయ్యాలో – తల్లిరో రేణుకా ఉయ్యాలో / నాకొక్క గోలీనే ఉయ్యాలో – కోనియ్యరమ్మ ఉయ్యాలో.../ అమ్మరో నాకొక్క ఉయ్యాలో – బొంగారం కావాలె ఉయ్యాలో..." అంటూ బతుకమ్మ పాటలలో వినోద ఆటలను ప్రస్తావన చేస్తారు. శ్రీనాథుడు/ వినుకొండ వల్లభామాత్యుడు రాసిన క్రీడాభిరామములో కూడా కథామలుపులో భాగంగా బొంగరాల ఆట ప్రస్తావన కలదు. ఈ కావ్యంలో జానపదులకు సంబంధించిన అనేకమైన విషయాలు ప్రస్తావించబడ్డాయి.

స్థానిక సంఘటనలు: తెలంగాణ ప్రాంతంలో ధర్మంపై అధర్మం గెలిచినా, ప్రజలకు అన్యాయం జరిగినా వెంటనే బతుకమ్మ పాటగా మార్చి, ఆ అన్యాయాన్ని ఎదిరించడానికి స్ఫూర్తి పొందేలాగా పాటలను అల్లుతారు. తెలంగాణాలో నిజాం పరిపాలనలో జరిగిన సంఘటనల గూర్చి, భూస్వామ్య దొరల ఏలుబడిలో జరిగిన సంఘటనల గూర్చి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు జరిగిన అన్యాయాలను నిలదీస్తూ, ప్రజలను మేల్కొలిపే విధంగా బతుకమ్మ పాటలలో ఆ ఘట్టాలను చొప్పించి పాటలను అల్లుకున్నారు. నల్గొండ ప్రాంతంలో పాపిరెడ్డి అనే భూస్వామ్య అధికారానికి బలైన సామాన్యవ్యక్తి మల్లమ్మకు జరిగిన అన్యాయాన్ని బతుకమ్మ పాటగా మార్చి పాడుతూ "రామరామరామ ఉయ్యాలో – శ్రీ రామ రామ ఉయ్యాలో/ అయ్యో రాములు ఉయ్యాలో – నేను కొలువునట్టి ఉయ్యాలో/ ఆర్తి పాదంబు ఉయ్యాలో – అపరాధినైతి ఉయ్యాలో/ నిల్తి పాదంబు ఉయ్యాలో – నీలిగొల్లనైతి ఉయ్యాలో/ తప్పునీ పాట ఉయ్యాలో – తల్లి గలనాథ ఉయ్యాలో.../ ఇక్కడి ముచ్చాట ఉయ్యాలో – ఇట్ల ఉండాని ఉయ్యాలో/ మల్ల ముచ్చాట ఉయ్యాలో – మా దండిదమ్మ ఉయ్యాలో/ అప్పుడు కాదాని ఉయ్యాలో – పాపిరెడ్డిని ఉయ్యాలో/ పాతేలూను ఉయ్యాలో – పాపిరేడ్డీను ఉయ్యాలో...." అంటూ ఈ పాటలో భూస్వాముల ఆగడాలను చెప్పారు.

ముగింపు: తెలంగాణ జానపదులు ఎంతో జ్ఞానాన్ని వారి ఆట, పాట, మాటల ద్వారా అందించారు. వాటిని నేటి తరానికి పరిచయం చేయడం వలన వారి జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు వారి ప్రతిభాపాటవాలు మనకు అర్థం అవుతాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై ఎన్నో పరిశోధనలు వెలుగులోకి వచ్చాయి. భవిష్యత్తులో మరెన్నో వస్తున్నాయి.

## ఆధార గ్రంథాలు

విష్ణుమూర్తి, తాటికొండ. 1994. బతుకమ్మ పండుగ పాటలు(సంస్కృతి సంప్రదాయాలు). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

వెంకట్రామయ్య, రాసాని. 1992. జానపద గేయాలలో పురాణాలు (రామాయణ భారత భాగవత పౌరాణిక గేయాల సంకలనం). తిరుపతి: జనహిత పబ్లికేషన్స్.

కృష్ణశ్రీ. 1901. దేశీ సారస్వతము స్త్రీల రామాయణపు పాటలు. హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

# మన తెలుగు - మన హృదయ ధ్వని

యం. గాయత్రి దేవి ✆ 6300995657

మధుర మధురమౌ మన భాష
మాధుర్యమిది మన మాతృ భాష
శృతి మధురమీ భాష
శతకములకాద్యము మన తెలుగు భాష

ఉయ్యాల పాటలలో ఊగిసలాడిన భాష
చైతన్య భాష ఇది చరిత్ర భాష
కలికితురాయి ఈ భాష
భావలకే బాస మన తెలుగు భాష

కవుల గానం లోన పూసిన మణి ఈ భాష
రాగ మాలికలా రమ్యమైనదీ భాష
పల్లె పాటలలో పరిమళించినదీ భాష
మన హృదయపు హారమై మెరిసినది మన తెలుగు భాష

అమ్మ ఆక్షరాల ఆత్మగా ఆవిర్భవించిన భాష
కృష్ణ రాయలు మెచ్చిన అపురూప భాష
బాలగీతాల బంగారమైన పలుకుల భాష
పద్యాల పరవశం లో పదిలమైనది మన తెలుగు భాష

మాటమాటలో మమతను మలిచిన భాష
నాటక వేదికల పై నర్తించిన భాష
వేదాంత వీధి లో వెలసిన వేమన వాక్య మీ భాష
రస భరితమైన కధనాలకు రూపమిచ్చిన భాష మన తెలుగు భాష

ఆంధ్ర కవుల అక్షర తేజస్సుని మోసిన భాష
వీరగాధల వేదికైన విజయ భాష
పలకరింపులలో పరిమళించే ప్రణయ రాగ భాష
మన జీవన నాడిలో జీవమైన భాష మన తెలుగు భాష

పల్లె కోనల్లోని పాటకు ప్రాణమిచ్చిన భాష
రామయ్య పాటల రాగం లో పరవశించిన భాష
రాగాలు పుట్టిన రాగ మాతృక ఈ భాష
మనసులో మంత్రమై నిలిచిన భాష మన తెలుగు భాష

# ఎగరనివ్వరూ...

డా. దారల విజయ కుమారి
91771 92275

రాత్రి ఎనిమిది గంటల ఇరవై నిమిషాలు. తిన్న ప్లేట్లు గ్లాసులు తీసేసి కింద పడిన మెతుకులు కాలికింద పడకుండా చేత్తో తీసేస్తోంది మంగమ్మ. ఇంతలో తలుపులు కొడుతుండం విని...)

**మంగమ్మ :** ఎవురు?

(అని... అంటూనే తలుపు తీసింది. ఎదురుగా ఉన్న వదిన రామక్కను చూసి తత్తరబిత్తర అయిపోయి,)

**మంగమ్మ :** రా వదినా... రా! (అని) మామా! మీ యక్కొచ్చింది.
(మంగమ్మను ఎగాదిగా చూసుకుంటూనే లోపలికొచ్చింది రామక్క.)

**రాజు:** "ఏం క్కా చెప్పంపిచ్చనన్నా లేదే వస్తా ఉన్నట్లు? బస్టాండుకే వొచ్చిందునే!
(అని రామక్క చేతుల్లోని బ్యాగులు అందుకున్నాడు రాజు)

**రామక్క :** బస్సుకు రాలేదురా! రైలుకే ఎక్కిచ్చ మీ బావ. మిగిలినోళ్ళ లారీలో వస్తామని.

**రాజు :** ఏమట్ల... చెప్పాపెట్టకుండా వొచ్చేసినారు క్కా?

**రామక్క :** ఏముంటాది? అదీ ఇదీ మాట్లాడదామని. మీ బావ గుడ్ల కోడ్ని కోసి వానికి ఎత్తుకోని పో అని నన్ను ముందే రైలెక్కిచ్చ.

**రాజు :** ఓహో రైలుకొస్తిరా? మల్ల ఇంత నిదానమైందేమి?

**రామక్క :** అయ్యో ఏమి చెప్ప నాయనా! ఆ నాశనమైన రైలు ఐదు గంట్లకు రావల్సింది ఇబ్బుడొచ్చింది.

**రాజు :** ఇదేంది క్కా?
(కింద దించి పెట్టిన చిన్న చెక్కపీట చూపిస్తూ అడిగాడు)

**రామక్క :** నీ అల్లుడు సరైనోడు. 'నేను యాడమోద్దునురా?' అని అంటే గూడా ఇనకుండా... రైలు నిన్నూ, దాన్ని ఇద్దర్నీ మోస్తుందిలే ఎత్తకబోమ్మా అని ఈ చెక్క పీట అంటగట్ట్య.
(రాజు నవ్వుతూ దాన్ని చూపిస్తూ)

**రాజు :** ఇద్యాలంటక్కా?

**రామక్క :** ఏం చెబ్దు సామీ... ఆ యమ్మికి పొడుగు ఎంట్రుకలు. అత్త ఆ యమ్మి తల దువ్వుతాంటే కిందపడ్తాంటాయి, ఇంగనుంచీ దీనిపైన కూచో బెట్టి తల దువ్వమని అత్తకు చెప్పు అని, ఆచారి కాటికి పొయ్యి చేపించుకోని తెచ్చిచ్చ.

**రాజు :** వానికి మరదాలు పైన చానా ప్రేమ.

**రామక్క :** అదే ప్పా వానికి దానిపైనే పగులూ రాత్రి కలవరం.
(మంగమ్మ అక్కడికొచ్చి ఒక వైపుగా నిలబడి అడిగింది.)

**మంగమ్మ :** అందురూ బాగుండారా వొదినా?

**రామక్క :** ఊ... బాగానే ఉండారు. మీరు తినేసినట్లుండారు. అన్నమూ కూర చేస్తావా, నేనే చేద్దునా?

**మంగమ్మ :** నువ్వు మీ తమ్ముడు మాట్లాడుకోండి వదినా, నేనే చేస్తా.

**రామక్క :** మసాలాలు పోయినసారి నూరినట్లు నూరేవు. ధనియాలు నలగనేల్యా. ఈసారన్నా జాతీగా నూరు. కారం రొంత ఎక్కువేయ్. మీయన్న, లచ్చుమన్న, ఎంకట్రాముడు, ఖాసీమన్న, అందురూ వస్తాండారు, రెండుపావులు ఎక్కువేసి అన్నమొంచు.
(అక్కడే దించి పెట్టిన సంచిని మంగమ్మకు చూపించింది. సరే అని తల ఊపి కోడిమాంసమున్న సంచిని చేతిలోకి తీసుకుని పొయ్యకాటికి పోయింది మంగమ్మ.)

(రామక్క, రాజు ఎదురెదురుగా కూర్చుని,)

**రామక్క :** ఇబ్బుడన్నా నోటికి ఇతువుగా వండుతాందారా? ఊర్లో ఉన్నబ్బుడు అదిట్ల చెయ్యాళ్ళ ఇదిట్ల చెయ్యాళ్ళ అని చెప్తాంటిమి, మీకూ రెక్కలొచ్చ్య... ఎగిరొచ్చేస్తిరి.

**రాజు :** నువ్వు, బావ ఊ... అంటేనే కదక్కా వచ్చింది! మన నేలల్లో ఏం పండతాండాయి చెప్పు? ఏసిన చెనిగిత్తనాలకు వానొస్తే సరే... ల్యాకుంటే పంటకోసం పెట్టిన అసలే రాదు. అప్పులూ బుట్టవు. ఇంగ నావళ్ళకాకే కదక్కా ఇట్లొచ్చింది!

**రామక్క :** మిల్లులో పని... కష్టపడతా ఉండావు. మీరు తెంచుకున్నట్లు మన్నుతో సంబంధం మేం తెంచుకోలేము గద నాయనా!
(అలా అంటూనే సంచి లోంచి చిన్నచిన్న మూటలు తీసి ఒక్కొక్కటీ విప్పింది. ఒక్కొక్క గుడ్డలో అరకేజీ పావుకేజీ మైన మినుములు పెసులు అలసందలు ఎర్నాగులును చూసి,)

**రాజు :** ఈడ దొరకతాయి కదక్కా, ఆడ మీకు బెట్టుకోకుండా మళ్ళా మాకు దెచ్చినావు ఇవన్నీ...

**రామక్క :** ఎవరు తిన్నా పోతాయిరా, ఏదో మా ప్రాణాలుండక తెస్తాంటాం. అమ్మా నాయనా పొయినప్పట్నుంచీ నేనే పెద్దదాన్ని కాబట్టి అందర్నీ సాకితి. మీ బావ ఇంటికి అల్లుడైనా అందరికీ పెద్ద దిక్కైపాయ!

**రాజు :** నువ్వు, బావ పెంచి పెద్దగ చెయ్యక పోతే మేమ్యాడుందుము లేక్కా!

**రామక్క. :** ఏమో నాయనా అంతమాత్రం గుర్తుంటే సాలు. మేము య్యాదీ ఆసించము.

**రాజు :** మా పానాలున్నంత వరకూ గుర్తుండదా మళ్ళ!

**రామక్క :** అది సరేగానీ పిల్లోళ్ళు య్యాడరా? అబ్బుడే నిద్రబొయినారా?

**రాజు :** లేదుక్కా యాదో సదువుకుంటా రాసుకుంటాంటారు.

**రామక్క :** ఓ యబ్బో... సదువులు సదువుతాండారా... ఇంగా

**రాజు :** అవునుక్కా ఇస్కూల్ లో యావావో ఇంటిపాఠాలు ఇస్తారంట అవి రాసుకుంటారు ఈ ఇరవ దాకా. రేయ్ వెంకటేసు, లచ్చీ... మీ అత్తొచ్చింది రాండి!
(మంగమ్మ వచ్చింది లోపలినుంచి.)

**మంగమ్మ :** ఎంకటేసు నిద్ర బోయినాడొదినా... లేపుతా.

**రామక్క :** ఏమొద్దులే... పండుకోనీ పొద్దున కుంటాం గద
(ఇంతలో లచ్చిమి వచ్చింది లోపలినుంచి. రాగానే రామక్కను నవ్వుతూ పలకరించింది)

**లచ్చిమి :** బాగున్నావాత్తా?
(రామక్క లచ్చిని దగ్గరకు తీసుకుని, బుగ్గలు పుణికి, ముద్దుపెట్టుకుంది.)

**రామక్క :** ఈ ఇరవ దంక ఏం సదువే లచ్చి, తిని నిద్రబోకుండా?

**లచ్చి :** ఇంటి పాఠం రాయళ్ళత్తా. ల్యాకుంటే బడిలో బెంచీ మీద నిలబెడతాది మేడం!

**రామక్క :** ఈ సదువుల కోసరము ఆ యమ్మగార్లతో అన్ని అవస్థలు పడేద్యాల. ఇంటి కాడే ఉండి ఇంత తిని, ఆ పనీ ఈపనీ నేర్చుకోమ్మా.
(అలా అనేసి లచ్చిని, లచ్చి జడలను చూసింది)

**రామక్క :** అంత పొడుగు ఎంట్రుకలు ఎవరు కత్తరించినారు?

**లచ్చి :** అమ్మే కొన వెంట్రుకలు చిట్లినాయని కొంచెం కత్తరించింది.

**రామక్క :** మీ యమ్మ ఏమంట టౌనుకొచ్చెనో ఏం మిడిమాలం బడతాందో ఏమో... జానెడు ఎంట్రుకలంటే కత్తిరించేసింది చూడు!

**మంగమ్మ :** అదికాదొదినా. లచ్చి మెడ గూడా సన్నగా అయిపోతా ఉంది. జానెడు కత్తరించినా ఎంత పొడువున్నాయో జూడు. జడలు అల్లేదానికే కాదు.

**రామక్క :** అందుకే వాడు... నీ బావ ఎత్తుగా ఉండే ఈ ముక్కాలి పీట చేపిచ్చి పంపినాడు జూడు.

**మంగమ్మ :** బాగుందొదినా!

**రామక్క :** ఇంగ నుంచీ లచ్చిని ఈ పీటమీద కూచోబెట్టి తల దువ్వు. అబ్బుడు వెంట్రుకలు కింద పడకుండా దువ్వచ్చు. ఆ జడలు అల్లి బాగా పైకి మడిచి కట్టేయ్, ఒగరి కండ్లున్నట్లు ఇంగోరివి ఉండవు, దిష్టి తగులుతుంది. ఎందుకైనా మంచిది. బయటకు ఎల్లబారినప్పుడు అరికాలికి నల్ల చుక్క పెట్టి పంపిచ్చు.

**మంగమ్మ :** సరే వొదినా, నువ్వు చెప్పినట్లే చేస్తాలే!
(మంగమ్మ, లచ్చిమి లోపలికి వెళ్ళిపోయారు)
(రామక్క, రాజు మాట్లాడుకుంటున్నారు)

**రాజు :** పనులు జరుగుతాండాయాక్కా?

**రామక్క :** దున్నుకుంటాండాము... ఉన్నోళ్ళు ట్రాక్టర్లతో దున్నిస్తాండారు. వాన ఒక్క పదునన్నా పడితే... ఉలవలు యావో చల్లుకోవళ్ళ.

**రాజు :** ఈడ టౌన్లో ఉలవలకు చానా డిమ్యాండుక్కా. గుర్రాలకు పెట్టాంటారు. ఉలవలు ఉడకబెట్టిన నీళ్ళు గూడా అమ్ముకుంటారు.

**రామక్క :** టౌన్లో అన్నిట్నీ యాపారం చేసేస్తారు నాయనా. మాబోటోళ్ళము ఈడ బతకలేము. అందుకే కలోగంజో తాగుతా పల్లెలోని ఉండిపోతిమి.

**రాజు :** చెనిక్కాయిలు ఒలిచినారా? ఎన్నిసార్లు చెప్పినా చెనిగిత్తనాలు మనవే ఏద్దామంటాడు బావ. ఒకసారి కదిరివి నెంబర్లు ఏసి చూడండి క్కా.

**రామక్క :** మీ బావ మాట యాడింటాడు నాయనా?

**రాజు :** బావకు ఈసారి చెప్తాలే.

**రామక్క :** అయ్యో మర్చేపోతి... ఇత్తనాల కాయల్లోనివి రా, ఇదో మంగా! ఈ చెనిగిత్తనాలు నాసుగింజలు, ఊరిమిండికీ పాడూ పనికొస్తాయి లోపల బెట్టుకో. అట్లే కాసిన్ని ఏంచి... పాకం పప్పు కట్టి పిల్లోళ్ళకు పెట్టు.

(లోపలినుంచి మంగమ్మ వచ్చి, రామక్క దగ్గరినుండి సంచి తీసుకుని లోపలికి పోయింది )
(లారీకొచ్చినోళ్ళందరూ వచ్చి, తినేసి ఎక్కడోళ్ళక్కడ పడుకున్నారు.)

**రాజు :** ఇదో మంగా! పొద్దున్నే ఉడుకుడుగ్గా సంగటి గెలికి, ఊరుమిండి చేస్తే తలాకొక ముద్ద తినేస్తారు. బిరిన్యా చేసేయ్

**మంగమ్మ :** పోనీ ఏమన్నా నాస్తా చేసేద్దునా మామా?

**రాజు :** వొద్దొద్దు. సంగటైతే కొంచెం కడుపునిండా తింటారు. వాళ్ళగ్గూడా తిన్నట్టు ఉంటుంది. ఈ దోసిలు ఇడ్లీలు వాళ్ళకు తరుంగావు లే.
(సరే అని ముందే చేసేసి పెట్టేసింది మంగమ్మ. అందరూ తినేసి ఆమాటా ఈమాటా మొదలు పెట్టుకున్నారు)

**రామక్క :** నీకు గుర్తుందారా, మనూర్లో సారు ఇసకలో రాపిస్తాండ్య. ఎన్ని పుట్లు గిద్దలు... అణాలు దమ్మిడీలు అనే లెక్కలు, పద్యాలు ఎన్నో చెప్తాంటివి... మన ఇండ్లలో అంత మాత్రం సదివిచ్చింది నిన్నే... ఆ అయివేరు ఇంటికాడ కొస్తే సాలు నిన్ను బలే పొగుడుతాండ్య.

**రాజు :** ఆ సారు కూతురు ఈ టౌన్లోనే ఉంది క్కా. ఆయమ్మ గూడా చానా మంచిదే సారు లాగా.

**రామక్క :** 'నీ కొడుకు బలే వాడమ్మా... బలే చురుకైనోడు, ఒగ సారికే నేర్చుకునేస్తాడు' అని అయివేరు చెప్తే జాలు అమ్మ నెయ్యి, బెల్లము చెనిక్కాయలు బ్యాగు నిండాకూ ఏసి పంపిస్తాండ్య సారుకు.

**రాజు :** అవుక్కా ఆ సారు నన్ను బలే చూసుకుంటాడ్య.

**రామక్క :** ఆయన ఎళ్ళిపోయినంక మళ్ళా అట్లాంటి అయివేరు మనూరికి ఎవురూ రాలేదురా!

**రాజు:** అవును ఆ సారులాగా పాఠాలు చెప్పేటోళ్ళు ఎవురూ లేరు అప్పట్లో.

**రామక్క :** అయితే ఆ సారు కూతురు ఈడే ఉంది. మంచోళ్ళు యాడున్నా బాగనే ఉంటారు.

**రాజు :** ఈ టౌన్లో అందురూ ట్యూషన్లకు మరిగినారు. ఏమంటే నీ కోడలు, అల్లుడు బానే చదువుతాండారు అవ్వావీ ల్యాకుండానే...

**రామక్క :** ఆ మిల్లుకు పోతాండావు, జీతాలు నెల నెలా ఇస్తాండారా?

**రాజు :** ఆ, ఇస్తారు క్కా. ఈ టౌన్ లో బాడిగింటికీ ఉప్పు పప్పు మిరపకాయి చింతకాయి సమస్తమూ కొనుక్కోవళ్ళ మిగిలేది తక్కువ ఖర్చులు ఎక్కువ.

**రామక్క :** సేద్యానికి మించింది యాదీ లేదు. చెప్పినా నీ బోటోళ్ళకు బుర్రకెక్కదు. ఉరుకులాడతా వొస్తివి టౌన్ లో ఉద్యోగము చేయళ్ళ అని, గోడేటు చెంపేటు తింటేనే యాదన్నా తెలిసేది.

**రాజు :** ఇబ్బుడు నేను కొత్తగా చేరినాను కదక్కా... జీతం తక్కువ... రొన్నాళ్ళు పోతే రెండ్రూపాయలు మిగిలిచ్చుకోవచ్చు.

**రామక్క :** నీ పెండ్లాము ఏమంట... టౌనుకొచ్చిందో దొరసానమ్మలాగ రోజూ నీళ్ళుబోసుకోవడాలు...రోజుకో చీర కట్టడాలు... ఏం అమిసరమొచ్చిందో జూడు. ద్యాన్ని జూసుకోనో ఆ పకారం పొడువులు పోతాంది?

**రాజు :** టౌన్లో అందురూ సుబ్రంగా ఉంటేనే క్కా. ల్యాకుంటే దగ్గిరికి గూడా రానీరు.

**రామక్క :** అదికాదురా తిక్క నాగన్నా. నేనెందుకు చెప్తానో తెలుసుకో. బతికేదానికి ఇంత దూరం వచ్చేసినారు. ఏందో ఒగరూపాయి చేతిలో పెట్టుకుందాము, ఎట్లబోయ్యి ఎట్లొస్తుందో... టయానికి ఆదుకుంటాది అని బుద్ధుండాల. ఈ ప్యాలికలకు ఎంత బెడ్తే ఏం సుఖం. ఒళ్ళు దాచుకోవళ్ళంటే య్యాదో గుడ్డ చాల్దా? ఆడబిడ్డుండాది ఇంత కూడబెడ్దాము అని తెరకవ ల్యా?

**రాజు :** పాపం అది కూడా కర్చేం పెట్టదులేక్కా.

**రామక్క :** ఏమో నాయనా టౌన్లో ఉండారు. మనూరు కాదు. ఈడ ఎవురికెవురూ ల్యా. నువ్వేమో చానా కష్టపడతాండావు దాన్ని నిలుపుకోవల్సింది ఇంటి ఆడదే గద!

**రాజు :** అక్కా దాని కతెందుకు... పిల్లోళ్ళ బడికాడికి పాదూ పోతాండళ్ళ నాకేమో అబ్బదు. ఆడికి పొయినబ్బుడు కొంచెం నదురుగా నే పోవళ్ళ.

ఏందో అందరూ కట్టు కుంటాండారు మామా... సలీసుగానే ఇస్తాదంట. నెలకింతనిస్తే చాలంట అంటే... నేనే నాలుగు చీరలు తీసుకోమంటిలే.

**రామక్క :** మనూర్లో మా అదోటీలో ఉన్నబ్బుడు ఎట్లుండ్య? ఇబ్బుడెట్లుండ్యాది? కడుపుక్కూడు తిన్నోనికెవునికైనా భేదం తెలీదా, సరే సరే రా నీ పెండ్లాం సంగతి నాకెందుకులే గానీ... నా కొడుక్కి నీ కూతుర్నిచ్చి పెండ్లెప్పుడు జేస్తావో చెప్పు.
(రాజు ఏం మాట్లాడకుండా ఒక నిమిషం ఆలోచనలో పడిపోయాడు)

**రామక్క :** ఏం రా మాట్లాడవు?

**రాజు :** ఒగసారి లచ్చిని అడిగేసి చెస్తా నుండు... పరీచ్చలు పాడూ అయిపోయినాయో లేదో

**రామక్క :** అదీ కథ... నువ్వే అంటాంటివి గుర్తుల్యా... గొర్నడిగి ద్యావర చెయల్నా అని. ఇబ్బుడేమో కూతుర్నడుగుతా... అంటాండావు గదరా
(ఏం చెప్పాలో ఏం చేయాలో తెలియక అక్క పక్కే చూస్తున్న రాజును,)

**రామక్క :** అట్ల గుడ్లుమిటకరించి చూస్తానే ఉంటావా? ల్యాకుంటే నేనే దాంతో మాట్లాడేద్దునా?
(రామక్క ఇక ఏమాత్రం ఊరుకోదని లోపలికి చూస్తూ గదమాయించినట్టుగా పిలిచాడు రాజు)

**రాజు :** ఏయ్ యాడా.. పాపని బిరీన రమ్మన్జెప్పు

**మంగమ్మ :** మన్నాద్నుండీ పరిక్షలంట మామా! ఏందో అట్ట... తెల్లపేపర్లు గీతలపేపర్లు కావల్లనింది. డబ్బులు లేవల్లన్యందుకు ఏడస్తా పడుకోండ్య. ఇబ్బుడే ఆ పాపమ్మ కొడుకుని అడిగితే ఏవో మిగిలిన పేపర్లుంటే ఇస్తాననిండ్య. తెచ్చుకోమని పంపిస్తి.

**రామక్క :** నేనెబ్బుడో చెప్పితి కదరా... ఈ నంగనాచి తంగబుర్ర లోపల్లోపలే కూతురుకు నూరిపోసేస్తుందని. ఇబ్బుడు ఏం మిడిమాళం బడ్తాండాదో ఏమో సూడు.

**రాజు :** రొంత సేపుండు క్కా. లచ్చి రానీ మాట్లాడతా.

**రామక్క :** సమర్తైతానే ఇచ్చిచేసేయ్ రా అంటే ఇంటివా? ఇబ్బుడు జూడు, మొరిగే కుక్క ఇస్కో అంటే నువ్వే ఇస్కో అనిందంట. ఆడబిడ్డకేంటికిరా సదువు అంటే... ఉన్నీలేక్కా మనమెట్లా సదవల్యా... ఆయమ్మన్నా
సదువుకోనీలే... జాబు జూడు ఎంతబాగ రాస్తుందో... యాడికి బోతుంది నీ కోళ్ళి అంటివి... ఇబ్బుడేమాయ?

**రాజు :** ఇబ్బుడేమైందిక్కా? నేనేమన్నా కాదంటేనే గద. అబ్బుడు ఇబ్బుడు ఒగటే మాట, నా కూతుర్ని నీ కొడుక్కి ఇస్తానన్యంక ఇస్తానంతే.

**రామక్క :** నువ్వేమో ఇస్తాననే అంటాండావు. నీ పెండ్లాం మనసులో ఏముందో... సదువులు సదివి ఎవుర్నో ఉద్దరించల్ల అని ఏందేందో నేర్పిస్తాందంట.

**రాజు :** అక్కా నువ్వుండు. మాట తప్పను. బావ వాళ్ళంతా ఉండారు గదా... మాట్లాడదాం.
(మాట తప్పనని తెగేసి చెప్పిన తమ్ముని మాటకు కొంచెం తగ్గింది రామక్క. మధ్యానం తింటూనే అందరూ చాపమీద కూర్చున్నారు. రాజు రామక్కకు కాస్త దగ్గరగా కూర్చుంటే, మంగమ్మ వంటరూము గడపకానుకొని కూర్చుంది)

**రాజు :** ఏం బావా, పోయిన్నెల్లో కొనిపిస్తినే మోటరు ఎట్ల పని చేస్తాంది? ముందుకన్నా ఏమన్నా మేలేనా..

**బావ :** ఏంది మేలురా? 'అర్ధణా కోతి ముక్కాలుపాయి బెల్లం తినేసినట్లుందిరా'. ఏమంటే ఒగర్నాశించకుండా కూరల్లోకి ఇన్ని టమాటాలు, పచ్చిమిర్పకాయిలు నాటుకోవచ్చు ఆ నీళ్ళకు.

**రాజు :** ఈసారి నేను మనిషిని తెస్తాలే దాన్ని చూస్తాడు.

**బావ :** ఇవన్నీ ఎబ్బుడూ ఉండేవే లేరా.
(అని... రామక్క సైగ సేసినట్టు ఈసారి నాన్చకుండా నేరుగా అడిగేసినాడు.)

**బావ :** రేయ్ రాజూ! నీ కూతురుకు మూడేండ్లబ్బుడు మీ యక్కకు చేతిలో చెయ్యేసి మాటిచ్చినావు. ఏమనీ... 'అక్కా నా కూతుర్ని నీ చిన్న కొడుక్కు ఇస్తా చేసుకో ' అని ఇబ్బుడు అది అడిగేదానికే వచ్చినాముర, చెప్పు నువ్వేమంటావు?

**రాజు :** నేను అబ్బుడు ఇబ్బుడు అనేది ఆమాటే బావా. కానీ ఆ పాపకు చదువుకోవళ్ళ అని ఒగటే ఇది.

**బావ :** ఏమప్పా జారీకమాడ్తాండావా?

**రాజు :** తండ్రిలాంటోనివి... నీతో జారీకమాడ్తానా బావా?

**బావ :** ల్యాకుంటే ఇస్తానంటావు... ఈలేనూ అంటావు. ఇంగ నానబెట్టేదే ఒద్దుప్పా. చెనిగిచెట్లు తోల్తాండాము వామేసుకోవళ్ళ... చానా పన్లుండాయి. పోవళ్ళ పోవళ్ళ అని మీయక్క ఒగటే ఇది... అందుకనే అన్నీ పక్కకు బడేసి వొచ్చేస్తిమి.

**రామక్క :** మీ బావ చెప్పిందే నేనూ చెప్పేది. నిన్ను సాకినట్లే దాన్నీ సాక్కుంటా... చదివినంత వరకూ సాల్లేరా పెండ్లి చేసేచ్చేయ్.

**రాజు :** అక్కా! అది సదువులో మొద్దైతే అట్లే చేద్దును. బాగ చదువుతాది. మొన్న బళ్ళో ఏదో ఉంది రమ్మన్యారు అంటే పొయ్యింటి. టీచర్లు అందురూ మెచ్చుకుంటాండారు మంచి మార్కులొచ్చినాయని నువ్వు ఇనింటే నీకూ సంతోషమెయ్యిండు.

**రామక్క :** అది జెప్పి ఇది జెప్పి మళ్ళా ఆడికే వస్తాండావు కదరా... లోకంలో లేని సదువు నీకూతురే సదివినట్లు.

**రాజు :** అక్కా ఎవురెన్ని చెప్పినా ఆ పాప సదువాపలేనక్కా...

రామక్క : నీ కూతురు కంటే మంచిదాన్ని నాకొడుక్కు తెచ్చుకునేదానికి మాకేం ఒగలేదనుకున్నావారా? నా ఎంగిలి సన్ను తాగినోనివి, సాకిన ప్రేమ ఇట్ల అడిగిస్తాందంతే.
(ఖాసీమన్న కలుగజేసుకున్యాడు)

**ఖాసీమన్న :** రాజూ... ఇంగేమీ మాటలొద్దురా ఆ పాపను రమ్మను. అందరిముందు ఒగసారి అడుగు. తర్వాత ఏదో ఒకటి చూద్దాం.

**రాజు :** ఖాసీమన్నా! ఆయిమ్మి ఇంకా చిన్నపాప. ఏమనడుగుతాం?

**ఖాసీమన్న :** తొమ్మిదో క్లాసులో చదువుతాందంట కదా. ఇంగా చిన్నపిల్లేమిలే గానీ... మంగమ్మా! పాపను రమ్మను.
(రాజు ఏం మాట్లాడకుండా మంగమ్మ వైపు అందరి వైపు చూస్తూ ఉండంగానే...

లచ్చిమి వచ్చి రాజు పక్కనే కూర్చునింది. సన్నగా చామన చాయలో ఉన్న లచ్చిమి రాజు పోలికతోనే ఉండి, బాగానే ఉంటుంది.)

**ఖాసీమన్న నెమ్మదిగా అడిగినాడు :** ఏమ్మా లచ్చిమి పరీక్షలు ఎప్పుడు?

**లచ్చిమి :** మర్నాటి నుంచీ తాతా!

ఖాసీమన్న : నీ అత్త కొడుకంటే నీకు ఇష్టమేనా?
(ఇష్టమే అని తల ఊపింది లచ్చిమి)

**ఖాసీమన్న :** అయితే మీ బావకు నిన్నిచ్చి పెండ్లి చేద్దామని పెద్దోళ్ళు ఎబ్బుడో అనుకునేసినారు. నీకు ఇష్టమే గద!
(లచ్చిమి వద్దన్నట్టు అడ్డంగా తల ఊపేసింది)

**ఖాసీమన్న :** ఎందుకొద్దుమ్మా... చెప్పు.

**లచ్చిమి :** నేను చదువుకోవళ్ళ తాతా... నాకు పెండ్లొద్దు.

**రామక్క :** చదివింది సాల్లే లచ్చీ, నా కొడుకును చేసుకో.
(అత్త వైపు భయంగా చూసి... సన్నగా ఏడ్చడం మొదలుపెట్టింది. అందరూ నిశ్శబ్దంగా ఉండిపొయినారు. బిడ్డ ఏడుస్తూ ఉంటే చూడలేక,)

**రాజు :** అక్కా! నా బిడ్డ మనసును కష్టపెట్టే లేను. ఈ పెండ్లి విషయం వదిలేయ్.
(ఖచ్చితంగా చెప్పేసినాడు రాజు)

**రామక్క :** ఇబ్బుడు కక్కేసినావురా నీ కడుపులో మాట. ఆ నంగనాచి మనూరిని... మమ్మల్ని వదిలిచ్చి టౌనుకు పిల్చుకోని వచ్చేసినప్పుడే అర్థమైపాయ. యాదో కొంచెం తగుల్కోనుండ్య అదీ ఇబ్బుడు తెగిపాయ.

**రాజు :** అంత నిష్టూరంగా మాట్లాడద్దు క్కా! రక్త సంబంధం తెగిపోతుందా యాడన్న?

**రామక్క :** సాకినందుకు మా బాగా బుద్ధొచ్చిందిరా మాకు. నా కొడుక్కిచ్చి పెండ్లిచెయ్యద్దని ఎవుడు నేర్పిచ్చ... ఎవుతి నేర్పిచ్చ... వానికి ధూము తగల... దాని మొగం మూసిపెట్టా యాడబడింగ్రి వీళ్ళంతా...

**రాజు :** గట్టిగా అరచద్దు క్కా... అందురూ వింటారు. అందర్లో బగిసీనమ్ గదా!

**రామక్క :** ఎవర్రా బగిసీనంగా జూసేది? కష్టాల్లో యానాకొడుకన్నా జూసినాడా? రేయ్ ఇవన్నీ ఒద్దురా, ఒగే మాట... నీ కూతుర్ని నా చిన్న కొడుక్కే ఇస్తానని మాటిచ్చినావు. ఇమ్మని అడుగుతాండా. ఇస్తావా? ఈవా?

**రామక్క పెద్దకొడుకు :** అమ్మా! అది నా మేనమామ కూతురు. హక్కుంది మాకు. దాన్ని గుంజకు కట్టేసి నా తమ్మునితో బొట్టు కట్టిస్తా. ఎవురొస్తారో రానీ!
(రామక్క పెద్దకొడుకు సర్రున లేచినాడు)

**రాజు :** రేయ్ నోర్మూసుకో. పెద్దోళ్ళు మేం మాట్లాడ్తాండాం గద.
( రాజు పెద్ద మేనళ్ళున్ని కసురుకున్నాడు)

**రామక్క :** ఆడబిడ్డని కంటతడి బెట్టిస్తాండావు... నువ్వేం బాగుపడ్తావు రా?

**రాజు :** అక్కా అక్కా! నీ కాళ్ళు పట్టుకుంటాను అంత పెద్ద పెద్ద మాటలు అనొద్దమ్మా. నువ్వు మనసు కష్టపెట్టుకుంటే మాకు మంచిదా చెప్పు? నన్ను సాకి ఇంతవాన్ని జేసినావు. ఈరోజు అన్నన్ని శాపనార్థాలు పెడ్తాండావే! ఏమన్నా న్యాయమేనామ్మా?
(అని అంటూనే రామక్క కాళ్ళను పట్టుకున్నాడు రాజు. సడెన్ గా రాజు అలా చేసేసరికి కాస్త మెత్తబడింది రామక్క అయినా సరే కాళ్ళను కొంచెం పక్కకు జరుపుకుంటూ...)

**రామక్క :** న్యాయము, అన్నాయము అని ఏం మాట్లాడ్తాండావు పోరా పో... నేను సాకి సంతరిచ్చకనే పెద్దోడివైపోతివా? రక్తసంబంధం వదులుకోలేక... ఏందో నా పుట్టింటి బిడ్డే ఇంట్లో దీపం పెడ్తాదని ఆశ పడితి అంతే!

**రాజు :** ఆపాప నాయనా చదువుకుంటాను నాకు పెండ్లొద్దో అని ఒగటే ఏడస్తా ఉంటే ఏం జేసేదో నువ్వే చెప్పు.

**రామక్క :** అన్నీ వాళ్ళనడిగే చేస్తాండావా? ఇంత పిరిగ్గొడ్డువు నా ఎనక ఎట్లబుట్టివిరా? అయినా ఇది నీకు బుట్టిన బుద్ధి కాదులే... చెవులకు ఇంపితంగా ఉండేట్లుగానే ఎక్కించేసినారు. ఇంగ మా మాట్లేం ఇనిపిస్తాయి. నోరేమన్నా తెరుస్తుందేమో జూడు ముచ్చుమొగంది.

**రాజు :** దాన్నెందుకంటావు క్కా? దానికి నేనెంత చెప్తే అంతే.

**రామక్క :** అయ్యో నీ పెండ్లాన్ని ఏమీ అండ్లేదు సామీ... పాయదరువులే తెంచేసినంక ఇంగ ఏమని ఏం లాభం? ఇంగ మీ బతుకులు మీవి, మా బతుకులు మావి. ఈరోజుతో నీ అక్క లేదురా చచ్చిపోయింది. ఇంగా ఏం జూస్తారు లెయ్యండి. గతిలేక వస్తిమా? నా కొడుక్కు పిల్లే దొరకదా?

**రాజు :** అక్కా! నా మాట విను, సూరిగానికి నేను నచ్చచెప్తా.

**రామక్క :** రేయ్! నీ కూతుర్ని ఒప్పించేదానికే నీకు ఒగలేక పాయ... ఇంగ వానితో ఏం మాట్లాడతావురా? ఇంగా నన్ను అనిపించద్దు. నా నోరు మంచిది కాదు.

**రాజు :** అక్కా! నేను చెప్పేది విను.

**రామక్క :** రేయ్! అందర్నీ లెయ్ మని చెప్తాంటే ఇనబడ్లేదా చెవులకేమన్నా కొవ్వడ్డంబడిందా? యాదుంటే ఆ బస్సుకు

అందుకుందాం ఎల్లబారండి.

**రాజు :** సరేక్కా నిలబడు. నువ్వు ఎప్పుడంటే అప్పుడే పెండ్లి చేసిచ్చేస్తా. నాకు నువ్వే లేకుండా బోతే ఎవురుండి ఏం చేసుకుందు?

(చేతిలో సంచితో నిలబడిన రామక్క, కాస్త తగ్గి రాజు పక్క చూసింది. రాజు దక్కరకొచ్చి రామక్క చేతులు పట్టుకొని,)

**రాజు :** రాక్కా నువ్వు అడిగినట్లే చేస్తా... ఏయ్ ఆ పాపను రేపట్నుంచీ బడికి పంపేది లేదు. బడికేమీ వొద్దని... పెండ్లి చేసుకోవళ్ళని నచ్చజెప్పు
(అని మంగమ్మ వంక చూస్తూ చెప్పాడు. మంగమ్మ లేచి లోపలికి పోయింది. అరగంట తర్వాత... ఏందో చెప్పలేక ఇంట్లోకి వెనక్కి రెండుసార్లు గబాగబా తిరిగి తిరిగి వచ్చింది )

**మంగమ్మ :** ఇంటెనకే కూచోనుండ్య యాడికిబొయ్యిందో కనిపించలా మామా!
(మంగమ్మ గొంతు వణికిపోతోంది. పక్కింటికి పరిగెత్తి పోయి అడిగేసి వచ్చింది)

**మంగమ్మ :** నేను ఆ ఇంటోళ్ళను అడిగితే... రానేమో వచ్చింది.అబ్బుడే ఎల్లి పొయ్యింది అన్రి. పేపర్లేమో అడిగి ఇప్పించు కునిందంట. మళ్ళ యాటికిబొయిందో మాకేం తెలీదు అండ్రి.

**రామక్క :** ముసవ లాగ ఉండకపోతే అబ్బుడే చెప్పళ్ళగదా. ఇబ్బుడు యాడని వెతికేది?

**మంగమ్మ :** ఎబ్బుడన్నా ఆ కింద్రగాటు బడి చెప్పే టీచరోళ్ళ పాప దగ్గరికి పోతాంటాది.

(రాజుతో పాటు మేనళ్ళుడూ ... రామక్క భర్త తలా ఒగపక్క వెతికేందుకు పొయినారు. వెతి వెతికి యాడా కనబల్లేదని అందరూ ఇంటికి కాల్లీడ్చుకోని వచ్చేసినారు. మంగమ్మ ఏడుస్తూనే ఉంది. ఎక్కడోళ్ళక్కడ కూచున్నారు. ఎక్కడికి పొయ్యింది. ఏమన్నా అయ్యిందా... ఎవరన్నా ఏమన్నా చేసినా రా? రాజు పైకి బింకంగా ఉన్నా లోపల ధైర్యం జారిపోతోంది... అందర్లోనూ ఏవేవో ఆలోచనలు. రామక్కే తేరుకుని,)

**రామక్క :** ఏం చేద్దాం రా? దాని కేమైందో యాడుందో... నేనూ వస్తా... మళ్ళా ఒగసారి వెతుకుదాం పదండ్రా నాయనా!

(రాగాలు తీస్తూనే ఉంది)

★★★★★★★★★★★★★★★★★★★★★★

(రాత్రి 9.30 అవుతుంటే హెడ్ మాస్టర్ సార్ ఇంటికొచ్చారు. వెనక లచ్చిమి మెల్లగా నడిచొచ్చింది. మంగమ్మ ఏడుస్తూ లచ్చిమిని చుట్టేసింది. అందరూ లచ్చిమి క్షేమంగా వచ్చేసినందుకు సంతోష పడినా కంగారు పెట్టేసినందుకు బాధగా కోపంగా ఉన్నారు. అది గమనించిన హెడ్ మాస్టర్ సర్,)

**హెడ్మాస్టర్ :** రాజూ! అమ్మాయిని ఎవరూ ఏమీ అనకండి. చదువుకోండి బాగుపడ్తారు అని రోజూ చెప్తూనే ఉంటాం అయినా సరే ఎంతమంది మాట వినే స్టూడెంట్‌లు ఉంటారో చెప్పండి. లక్ష్మిని చూస్తే చాలా గర్వంగా ఉంటుంది. ఎంతో బాగ చదువుతుంది. మంచి మార్కులు తెచ్చు కుంటుంది. మంచి ప్రవర్తన ఉంది. ఏ టీచరు కానీ ఇతర విద్యార్థులు కానీ ఆమె పైన ఏనాడు ఫిర్యాదు చేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఉత్తమ విద్యార్థిని.

(కూతుర్ని హెడ్ మాస్టర్ పొగుడుతుంటే రాజుకు పట్టలేని సంతోషం కలిగింది. ఎలా వ్యక్తంచేయాలో తెలియక రెండు చేతులూ జోడించి దండం పెట్టి...)

**రాజు :** కూచోండి సార్
(అని ఉన్న ఒక కుర్చీ తెచ్చి వేసినాడు)

**రామక్క :** మీరు చెప్పింది వింటా ఉంటే సంతోషంగానే ఉంది సామీ కానీ మా ఇంట్లో ఆడబిడ్డలు చదివిందే లేదు. ఈపనీ ఆపనీ నేర్పిచ్చి పెండ్లి చేసేస్తాము.
(రామక్క కలుగజేసుకుని చెప్పింది)

**హెడ్మాస్టర్:** ఇంకా ఏ జెనరేషన్ లో ఉన్నారమ్మా మీరు? ఆడపిల్లలు మగపిల్లలు అని తేడా లేదిప్పుడు. అబ్బాయిలతో సమానంగా అన్నీ సాధిస్తున్నారు. ఆ అమ్మాయి చదువుకుంటానో అని అంతగా చెప్తుంటే వినడం లేదు మీరు. మొదట మిమ్మల్ని మార్చుకోండి. మీలాంటి వాళ్ళ వళ్ళే ఎంతోమంది చదువుకు దూరమై పోతున్నారు. చదివింటే మీకు చరిత్ర తెలిసేది. ఎంతమంది స్త్రీలు చదివి సమాజానికి దేశానికి సేవ చెసారో తెలుసుకునే వారు. నా మాట విని ఈ అమ్మాయిని చదివించండి.
(అందరూ నిశ్శబ్దంగా ఆయన చెప్పేది విన్నారు. మళ్ళీ హెడ్ మాస్టరే లచ్చిమి వైపు తిరిగి)

**హెడ్మాస్టర్ :** చూడమ్మా లక్ష్మీ నువ్విలా ఏడిస్తేనో, మౌనంగా ఉంటేనో ప్రయోజనం లేదు. నీ మనసులో మాట ధైర్యంగా చెప్పగలగాలి. పెద్దలను నీ జ్ఞానం తో మంచితనంతో ఒప్పించగలగాలి. అంతే గానీ అలా పిరికి గా పారిపోరాదు
(అనగానే లచ్చిమి రామక్క వైపుకు వచ్చి ఒక్కసారిగా కాళ్ళమీద పడి ఏడుస్తూ...)

**లచ్చిమి :** అత్తా! నేను చదువుకుంటా నాకు పెండ్లి వద్దు.
(అనగానే రామక్క మనసు కదిలిపొయ్యింది. మేనకోడల్ని లేవనెత్తి గుండెకు అదుముకుంటూ కండ్లనుండి బొటాబొటా కన్నీళ్ళు కారుతుంటే...)

**రామక్క :** లచ్చిని చదివిచ్చురా ఎంత సదువుతానంటే అంత సదివిచ్చు. ఈ మట్టి పిసుక్కునే పన్లన్నీ మనతోనే పోనీలే... సూరిగానికి యాడో చూసి చేద్దాంలే.

(మనస్ఫూర్తిగా అంది రామక్క. అంత కఠినంగా కనిపించే రామక్క లచ్చిని చూసి కరిగిపోయింది. హెడ్ మాస్టర్ చెప్తూ ఉన్నాడు)

**హెడ్ మాస్టర్:** మార్కెట్ దార్లో వెల్తూ ఉంటే ఒక బెంచి మీద ఏడుస్తూ కూర్చొనుంది లక్ష్మి. ఒక్కతే ఉందని నలుగురు రెక్కపట్టుకొని లాక్కుబోవాలని చూస్తూ ఉన్నారు. నేను గట్టిగా అరిచి మందిని పిలవగానే వాళ్ళు పారిపొయినారు. ఎట్లో నేను చూసాను కాబట్టి తీసుకుని రాగలిగాను. లేకుంటే ఎక్కడికి తీసుకొని పోయేవాళ్ళో... ఏం ప్రమాదంలో ఇరుక్కునేదో. మీరేమీ ఆలోచించకండి. ఆమె చదివి అనుకున్న ది సాధించుకుంటుంది. ఆడపిల్లలు చదవాలంటే కుటుంబం సహకారం చాలా అవసరం.

(అని అనేసి సెలవు తీసుకుని బయల్దేరినా ఆడపిల్లల చదువుల గూర్చే ఆలోచనలు ముసురుకున్నాయి. ఆనాడైనా ఈనాడైనా ఆడబిడ్డ చదువుకోవడమంటే అంతో ఇంతో పోరాటమే! ఆడపిల్ల అంటే ముగ్ధమోహనంగా మురిపించేందుకేనా? ఆ మేధను మన్నించరా ఎవరైనా? మతాలెంతగా ముంచెత్తినా ఆడబిడ్డకు చదువెందుకన్న వివక్షల తీగలను సున్నితంగా విడిపించుకుని... అక్షరాల తీరాలను చేరుకోవాలన్న పోరాటం ఈనాటిదా? ఎన్ని యుగాల ఆరాటమది! వేదం పురాణంనుంచీ కంప్యూటర్ దాకా ఆమె నేర్వని విద్యలేదు! ఆ రెక్కలు ఎగలేని దూరాలు లేవు ఎక్కలేని విజ్ఞానపుటెత్తులు లేవు! ఏ యుగంలో వదిలేసి వచ్చినా దూరాలు నడుస్తూనే చేరుకుంది. మగాడి వెనకే నడిచిందని వెనకబడిపోలేదు అలాగని అతన్ని ధిక్కరించనూ లేదు ఒక్కసారామెను తేరిపార చూడగలిగితే ఏకాగ్రతా వ్రతాన సరస్వతి లాగే ఉంటుంది! ఆమెను భంగపరచడం ఆ భగవంతునికైనా వశ్ళకాని పనే! ఆ ఆదిశక్తి ఆచరించని ధర్మం లేదు. తప్పుకు తిరిగిన బాధ్యత లేదు అని ఆలోచిస్తూ నడక సాగించాడు హెడ్ మాస్టర్.)

★★★

*ప్రకాశిక సమగ్ర సాహిత్య సామాజిక మాసపత్రిక నిర్వహించిన మహాకవి శ్రీ గురజాడ అప్పారావు స్మారక నాటకరచనల పోటీలలో మొదటి బహుమతి పొందిన నాటిక*

# ధన్యోస్మి

ఈ సంచికతో 'ప్రకాశిక' 6వ సంవత్సంలోకి అడుగుపెట్టింది. ఎందరో అభిమానుల, సంపాదక వర్గ సభ్యుల సహాయ సహకారాలతో గత ఐదు సంవత్సరాలు 'ప్రకాశిక' తెలుగు పత్రికా రంగంలో విశిష్టమైన స్థానం సంపాదించుకుందని పలువురి ప్రశంసల ద్వారా విని ఆనందం కలిగింది.

ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి

భవదీయుడు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 1 | సంచిక 6 జనవరి-మార్చి 2026

మమత-సమత-మానవత
www.gurajada.org

